# యేసు మరణించ వచ్చుటకు యాభై హేతువులు

# యేసు మరణించ వచ్చుటకు యాభై హేతువులు

## జాన్ పైపర్

**అనువాదము :**

బ్రదర్. సి.హెచ్. బలరాం పాల్

C R O S S W A Y   B O O K S
WHEATON, ILLINOIS

**_Fifty Reasons Why Jesus Came to Die_**

Formerly published as *The Passion of Jesus Christ*

Copyright©2006 by Desiring God Foundation

Published by Crossway Books
a publishing ministry of Good News Publishers
Wheaton, Illinois 60187, U.S.A

*This edition published by arrangement with Good News Publishers.*
*All rights reserved.*

**For Copies :**

PHILADELPHIA MISSIONS
2-147, Visakhanagar Colony,
Jammu Narayana Puram,
Vizianagaram, A.P. India, 535002
Ph : 91+9440070852, 91+9491571943
E-Mail : chintadabalaram@rediffmail.com,
paulnpadma@gmail.com



**యేసుక్రీస్తునకు అంకితం :**

మనుష్యుల వలన విసర్జింపబడి;
వ్యసనాక్రాంతుడుగాను వ్యాధి ననుభవించిన వాడుగాను...
మొత్తబడిన వానిగాను, దేవుని వలన బాధింపబడినవానిగాను
శ్రమనొందినవానిగాను మనమతనిని ఎంచితిమి.
మన యతిక్రమక్రియలనుబట్టి అతడు గాయపరచబడెను,
మన దోషములను బట్టి నలుగగొట్టబడెను,
మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను,
అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది.

మనమందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి
మనలో ప్రతివాడును తన కిష్టమైన త్రోవకు తొలిగెను,
యెహోవా మన యందరి దోషమును అతనిమీద మోపెను.

అతడు దౌర్జన్యము నొందెను
బాధింపబడినను అతడు నోరు తెరవలేదు,
వధకు తేబడు గొఱ్ఱెపిల్లయు,
బొచ్చు కత్తిరించువానియెదుట గొఱ్ఱెయు,
మౌనముగా నుండునట్లు అతడు నోరు తెరువలేదు...

అతడు నా జనుల యతిక్రమమునుబట్టి మొత్తబడెను,
సజీవుల భూమిలో నుండి అతడు కొట్టి వేయబడెను...
అతని నోట ఏ కపటమును లేదు,
అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను,
ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను.

**యెషయా ప్రవచన గ్రంధం,**

**53వ అధ్యాయం, 3-10 వచనములు**

# విషయసూచిక

## ఉపోద్ఘాతము


క్రీస్తు మరియు సామూహిక మరణ శిబిరములు 11


## యేసు మరణించ వచ్చుటకు యాభై హేతువులు


1. దేవుని ఉగ్రతను తనయందు భరించుటకు 20
2. తన పరలోకపు తండ్రిని శాంతింపజేయుటకు 22
3. విధేయత నేర్చుకొని సంపూర్ణుడగుటకు 24
4. మరణము నుండి తన సొంత పునరుత్థానమును పొందుటకు 26
5. శ్రేష్ఠమైన దేవుని ప్రేమ మరియు కృపను పాపులకు వెల్లడిపరుచుటకు 28
6. తన ప్రేమను మనపట్ల వెల్లడిచేయుటకు 30
7. మనకు విరోధముగా ధర్మశాస్త్రము చేయు ఆరోపణలు కొట్టివేయుటకు 32
8. అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా నుండుటకు 34
9. మన పాపములను క్షమించుట కొరకు 36
10. మన నీతికి ఆధారమును నిచ్చుటకు 38
11. తన విధేయత ద్వారా మనలను నీతిమంతులుగా చేయుటకు 40
12. మన శిక్షా విధి తొలగించుటకు 42
13. రక్షణకు ఆధారము కలుగునట్లు సున్నతి మరియు ఆచారములను రద్దుచేయుటకు 44
14. మనలను విశ్వాసములోనికి తెచ్చి, నమ్మకస్తులుగా నుంచుటకు. 46
15. మనలను పరిశుద్ధులుగాను, నిందారహితులుగాను, మరియు సంపూర్ణులుగా చేయుటకు 48
16. నిర్మలమైన మనస్సాక్షి నిచ్చుటకు 50
17. మనకు మేలు కలిగించే సమస్త విషయాలను అనుగ్రహించుటకు 52

18. నైతిక మరియు శారీరక రోగములనుండి మనకు స్వస్థత నిచ్చుటకు 54
19. ఆయనలో విశ్వాసముంచు వారందరికి నిత్యజీవము నిచ్చుటకు 56
20. ప్రస్తుతపు దుష్టకాలము నుండి విమోచించుటకు 58
21. మనలను దేవునితో సమాధాన పరచుటకు 60
22. మనలను దేవుని యొద్దకు తెచ్చుటకు 62
23. మనము ఆయనకు చెందియుండునట్లు 64
24. మనము పరిశుద్ధ స్థలములో ప్రవేశించునట్లు నిశ్చయతనిచ్చుటకు 66
25. దేవునిని కలుసుకొనే స్థలముగా మనకొరకు ఆయన ఉండుటకు 68
26. పాత నిబంధన యాజకత్వమును ముగింపునకు తెచ్చి, నిత్యము ప్రధాన యాజకునిగా నుండుటకు 70
27. సహానుభవము కలిగి, సమయోచితమైన సహాయము చేయు యాజకునిగా నుండుటకు 72
28. పితృపారంపర్యమైన మన వ్యర్థప్రవర్తన నుండి విడిపించుటకు 74
29. పాప దాసత్వము నుండి విడిపించుటకు 76
30. మనము పాపము విషయమై చనిపోయి, నీతి విషయమై జీవించునట్లు 78
31. మనము ధర్మశాస్త్ర విషయమై మృతిచెంది, దేవుని కొరకు ఫలించునట్లు 80
32. మనము మనకొరకు గాక క్రీస్తు కొరకు జీవించునట్లు శక్తినిచ్చుటకు 82
33. మనము ఆయన సిలువలో అతిశయించుటకు 84
34. విశ్వాసము ద్వారా ఆయనలో జీవింపజేయుటకు 86
35. వివాహము యొక్క గూఢార్థమును తెలుపుటకు 88
36. సత్క్రియల పట్ల ప్రజలు ఆసక్తి కలిగియుండునట్లు చేయుటకు 90
37. తన మితానుభవమును మరియు విలువైన ప్రేమను మనము వెంబడించునట్లు పిలచుటకు 92
38. సిలువవేయబడిన అనుచరుల సమూహమును తయారుచేయుటకు 94
39. మరణ భయము అనే బంధకము నుండి విడిపించుటకు 96
40. మరణానంతరము ఆయనతో మనముండునట్లు 98



41. మరణమునుండి మన పునరుత్థానమును బద్రపరచుటకు 100
42. ప్రధానులను, అధికారులను నిరాయుధులనుగా చేయుటకు 102
43. సువార్తలో ఉన్న దేవుని శక్తిని బయలుపరచుటకు 104
44. జనముల మధ్య ద్వేషమును తొలగించుటకు 106
45. ప్రతి వంశము, ఆయా భాషలు మాటలాడు వారికి, ప్రతి ప్రజ మరియు ప్రతి జనము కొరకు విమోచన క్రయధనముగా నుండుటకు 108
46. ఈ లోకమందు తన గొఱ్ఱెలను సమకూర్చుటకు 110
47. అంతిమ తీర్పునుండి మనలను విడిపించుటకు 112
48. తన యొక్క ఆనందము పొందుటకు మరియు మనలను ఆనందింపజేయుటకు 114
49. మహిమ ప్రభావములతో కిరీటము ధరించునట్లు 116
50. మిక్కిలి చెడ్డదైన కీడును దేవుడు మేలుకై మార్చెనని చూపుటకు 118
ఒక ప్రార్థన 121
గ్రంథముల వివరణ పట్టిక 123

# ఉపోద్ఘాతము

# క్రీస్తు మరియు సామూహిక మరణ శిబిరములు

ఈ ఇరవై–ఒకటవ శతాబ్దములో ప్రాముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే : ఎందుకు యేసుక్రీస్తు వచ్చి మరణించారు? దీని ప్రాముఖ్యతను గుర్తించటానికి, మానవ కారణాలకు ఆవల మనము చూచెదము. చివరకు, యేసును ఎవరు చంపారు? అనే ప్రశ్నకు జవాబు ఏమనగా: దేవుడే చేసాడు. ఇది సంశయముతో కూడిన ఆలోచన. యేసు ఆయన కుమారుడు అయితే బైబిలు గ్రంథము యొక్క సారాంశము ఇటువంటి ముగింపు నిస్తుంది.

## దేవుడు దీనిని మేలుకొరకై ఉద్దేశించెను.

క్రీస్తునకు అనేక శతాబ్దాల పూర్వమే, హెబ్రీయుల ప్రవక్త అయిన యెషయా ఇట్లు చెప్పెను: “అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను. ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను” (యెషయా. 53:10). క్రైస్తవుల క్రొత్త నిబంధన ఇట్లు చెబుతుంది, “(దేవుడు) తన సొంతకుమారుని అనుగ్రహించుటకు వెనుకతీయక” (రోమా. 8:32). “ఆయన తన నీతిని కనుపరచవలెనని క్రీస్తుయేసు రక్తమునందలి విశ్వాసము ద్వారా ఆయనను... బయలుపరచెను” (రోమా. 3:25).

అయితే, యేసును చంపిన మనుష్యుల యొక్క భయంకరమైన పాపకృత్యములకు దైవికమైన కార్యములు ఎట్లు వర్తిస్తాయి? ఆది సంఘములో చేయబడిన ప్రార్థన వ్యక్తపరచుట ద్వారా బైబిలు గ్రంథము దీనికి సమాధానము నిచ్చుచున్నది; “ఏవి జరుగవలెనని నీ హస్తమును నీ సంకల్పమును ముందు నిర్ణయించెనో, వాటినన్నిటిని చేయుటకై నీవు అభిషేకించిన నీ పరిశుద్ధ సేవకుడైన యేసునకు విరోధముగా హేరోదును పొంతిపిలాతును అన్యజనులతోను ఇశ్రాయేలు ప్రజలతోను ఈ పట్టణమందు నిజముగా కూడుకొనిరి” (అపో.కా. 4:27–28). ఈ దైవిక ఆదిపత్యము యొక్క పరిధి మన శ్వాశను తీసివేస్తుంది. అయితే అది మన రక్షణకుమూలమైయున్నది. దేవుడు దానిని ఉద్దేశించియున్నాడు, మరియు దుష్టులైన మనుష్యుల ద్వారా దానిని ఆయన నెరవేర్చెను.

యూదుల గ్రంథమైన థోరా లోని ఒక వచనమును క్లుప్తీకరిస్తే ఈ విధముగా ఉంటుంది : "మీరు కీడు చేయ నుద్దేశించితిరి గాని... అది మేలుకే దేవుడు ఉద్దేశించెను" (ఆది.కా. 50:20).

మరియు దేవుడు దీనిని మేలుకొరకై ఉద్దేశించినందున, మానవ హేతువులకు ఆవలఉన్న దేవుని ఉద్దేశ్యమును మనము చూచెదము. యేసు మరణము యొక్క ముఖ్య అంశము దాని కారణాన్ని వెదకుటకాదు గానీ దాని ఉద్దేశ్యమును, అర్థమును చూచుటయైయున్నది. యేసును తమ మార్గమునుండి తొలగించుకోడానికి మనుష్యులు అనేక కారణములు కలిగియుండవచ్చు. అయితే కేవలము దేవుడు మాత్రమే లోకముయొక్క మేలుకొరకు దీనిని ఉద్దేశించగలడు. వాస్తవానికి, యేసు మరణములో ఈ లోకము పట్ల దేవుని ఉద్దేశ్యములు అపరిమితమైనవి. వాటిలో యాబదింటిని వివరించటానికి నేను ప్రయత్నము చేసాను, అయితే మరియెక్కువ చెప్పటానికి అక్కడ ఉన్నాయి. బైబిలు గ్రంథమే మీతొ మాటలాడాలన్నది నా ఉద్దేశ్యము. ఇందులోనే మనము దేవుని వాక్యమును వినుచున్నాము. తన కుమారుని యొక్క మరణములో దేవుని గొప్ప ప్రణాళికలను మరియెక్కువగా తెలుసుకొనుటకు అన్వేషిస్తారని నేను నిరీక్షిస్తున్నాను.

## యేసు మరణము సంపూర్ణముగా ప్రత్యేకమైనది

యేసుమరణము ఎందుకు అంత శక్తివంతమైనది? రోమా సింహాసనమునకు కపటదారిగా ఆయన దూషించబడెను మరియు ఒప్పించబడెను. అయితే ఆయన మరణించిన మూడు శతాబ్ధములు తరువాత, రోమా సామ్రాజ్యమును మార్చివేయ గలిగిన ప్రేమ, శ్రమలను ఈ మరణము విడుదల చేసినది, మరియు ఇప్పటికీ ఈ లోకమును రూపకల్పన చేయుచున్నది. మరియు మూడు దినముల తరువాత జరిగిన ఆయన పునరుత్థానము, ఆయన మరణము నిర్ధోషమైనదని చూపించుచున్నది.

ఆయన మరణము ప్రత్యేకమైనది ఏలయనగా ఆయన సాధారణ మానవుని కంటే ఆయన అతీతమైన వాడు. తక్కువకాదు. ఆయన "దేవుని యొక్క దేవుడై" యున్నాడని ప్రాచీన నీసీయన్ క్రీడ్ చెబుతుంది. ఇది ఆయనను ఎరిగినవారు ఇచ్చు సాక్ష్యము మరియు ఆయన ఎవరైయున్నారో తెలుపుటకు వారు ప్రేరేపించబడియున్నారు. అపోస్తులుడైన యోహాను క్రీస్తును "వాక్యము" గా ఆరోపించాడు మరియు ఈ విధముగా వ్రాస్తున్నాడు: "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను.... ఆ వాక్యము శరీరధారియై, కృపా సత్య సంపూర్ణుడుగా మన మధ్య నివశించెను" (యోహాను. 1:1-2, 14).



మరియెక్కువగా తన శ్రమలలో ఆయన పూర్తిగా నిరపరాది. ఆయన మీద మోపబడిన దేవదూషణ విషయములో నిరపరాధి మాత్రమే కాదు గానీ పాపములన్నింటి విషయములోను నిర్దోషి. తనకు అతిదగ్గరగా ఉన్న శిష్యులలో ఒకరు ఇట్లు చెప్పెను, "ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు" (1 పేతురు 2:22). దీనికితోడు ఆయన సొంతమరణమును సంపూర్ణ అధికారముతో హత్తుకొనెను. తన మరణము మరియు పునరుత్థానమును గూర్చి యేసు చెప్పిన మిక్కిలి ఆశ్చర్యకరమైన మాట ఏదనగా: "నేను దాని మరల తీసికొనునట్లు నా ప్రాణము పెట్టుచున్నాను; ఇందువలననే నా తండ్రి నన్ను ప్రేమించుచున్నాడు. ఎవడును నా ప్రాణము తీసికొనడు; నా అంతట నేనే దాని పెట్టుచున్నాను; దాని పెట్టుటకు నాకు అధికారము కలదు, దాని తిరిగి తీసికొనుటకును నాకు అధికారము కలదు; నా తండ్రివలన ఈ ఆజ్ఞపొందితిననెను" (యోహాను. 10:17-18). మనుష్యులు యేసును చంపారు అనే వివాదాంశము చివరన ఉన్నది. ఆయన మరణించడానికి ఎన్నుకొనెను. తన పరలోకపు తండ్రి దానిని ప్రతిష్ఠించెను. ఆయన దానిని హత్తుకొనెను.

## ఆయన మరణము యొక్క ఉద్ధేశ్యము పునరుత్థానము ద్వారా ఋజువు చేయబడినది

ఆయన నీతిమంతుడని కనబరుచుటకు దేవుడు తనమరణము నుండి యేసును లేపెను, మరియు ఆయన నిర్దోషియని నిరూపించెను. ఇది మూడు దినముల తరువాత జరిగినది. ఆదివారమున ఇంకను చీకటిగా ఉన్నప్పుడు ఆయన మరణమునుండి పునరుత్థానుడాయెను. ఆయన పరలోకమునకు ఆరోహణమగుటకు ముందు నలువది దినముల వరకు తన శిష్యులకు అనేకమార్లు అగపడెను (అపో.కా. 1:3).

ఇది (పునరుత్థానము) నిజముగా జరిగినదని శిష్యులు నిదానముగా నమ్మిరి. వారు మోసగింపబడలేదు. వారు పైనుండి - భూమి మీదకు వర్తకులైయున్నారు. ప్రజలు మరణములో నుండి పునరుత్థానము చెందుట వారికి తెలియదు. తాను భూతము కాదని నిరూపించుటకు ఒక సందర్భములో యేసు వారిని చేపను తినుమని ఒత్తిడి చేసెను (లూకా 24:39-43). ఇది శవము పునరుత్థానము అగుటకాదు. దైవ-మానవుడు అనశ్వరమైన నూతన జీవములోనికి పునరుత్థానుడగుట. పరలోక మునకును భూమికిని ఆయనను ప్రభువుగా ఆది సంఘము శ్లాఘించెను. దేవుడు తనకు అప్పగించిన పనిని యేసు పూర్తి చేసెను మరియు దేవుడు సంతృప్తిచెందియున్నాడనుటకు పునరుత్థానము ఋజువైయున్నది. యేసు యొక్క మరణము లోకమునకు ఏమి చేసినదో దానిని గూర్చి ఈ పుస్తకము తెలుపుతుంది.

## క్రీస్తు మరణము మరియు మరణశిబిరములు

క్రీస్తు మరణము యొక్క వృత్తాంతము, యూదులకు వ్యతిరేఖముగా విరుద్ధబావసారూప్యతను, ముస్లింలకు వ్యతిరేకముగా మతయుద్ధములు కలుగజేయుట దురదుష్టకరమైన విషయము. క్రీస్తు యొక్క ఆత్మచొప్పున నడువని మన పితరులను గూర్చి క్రైస్తవులముగా మనము సిగ్గుపడుచున్నాము. సందేహములేదు అచ్చట ఈ తెగులు యొక్క జాడలు మన ఆత్మలలో కూడా ఉన్నాయి. అయితే నిజమైన క్రైస్తవత్వము-అనగా హింసాత్మకముగా మతమును కొనసాగించే పద్ధతులను విసర్జించుట (హింసాత్మకముగా మతమును స్థాపించుట పాశ్చాత్య సంస్కృతికి విరుద్ధమైనది, మరియు అనేక క్రైస్తవ సంఘములలో ఇది లేదు), "నారాజ్యము ఈ లోక సంబంధమైనది కాదు; నా రాజ్యము ఈ లోక సంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింపబడకుందునట్లు నా సేవకులు పోరాడుదురు" (యోహాను. 18:36). సిలువ మార్గము శ్రమల మార్గము. వారు ఏ విధముగా క్రీస్తుచేత ప్రేమించబడ్డారో లోకమునకు చూపించుట కొరకై, క్రైస్తవులు చావడానికి పిలవబడ్డారు గానీ చంపుటకు కాదు.

ప్రజలందరికీ దేవుని యొద్ద రక్షణమార్గము, కలుగజేయునట్లు నిజక్రైస్తవ ప్రేమ వినయముగా, ధైర్యముగా క్రీస్తును శ్లాఘిస్తుంది, ఎంత మూల్యము చెల్లించవలసివచ్చినా (వెనుదీయదు). "నేనే మార్గమును, సత్యమును, జీవమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" (యోహాను. 14:6). అయితే అది స్పటికమంత స్పష్టముగా ఉండనీయండి; ఇతరులను అణచుట లేక తిరస్కారము లేక నీచముగా నెంచుట లేక గర్వముతో హింసించుట లేక మత దండయాత్రలు లేక హింసాత్మక శిబిరములు ఏర్పాటుచేయుట మొదలైనవి క్రైస్తవత్వము కాదు. ఇవి చాలా సంక్లిష్టమైనవి, భయంకరమైనవి మరియు యేసుక్రీస్తునకు అవిధేయమైనవి. అనేకులైన తన అనుచరులవలె కాకుండ, ఆయన సిలువ మీద నుండి ఈ ప్రార్థనచేసెను ; "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని చెప్పెను" (లూకా. 23:34).

యేసు క్రీస్తు యొక్క మరణము చరిత్రలో చాలా ప్రాముఖ్యమైన ఘటన, మరియు ఈ ఇరువది-ఒకటవ శతాబ్దములో రాజకీయ, వ్యక్తిగత విస్ఫోటనము కలిగించే వివాదాంశము. క్రీస్తు సిలువవేయబడి దానిని ఉపేక్షించుట సామూహిక మరణాలను ఉపేక్షించుట వంటిదే. కొంతమందికి ఈ విషయాన్ని రూఢీ పరచుట కష్టము. మరికొంత



మందికైతే ఇది మతమును బలవంతముగా రుద్ది సానుభూతి పొందుకొనే దురాలోచనగా కనబడుతుంది. అయితే ఈ విషయాన్ని తిరస్కరించేవారు చరిత్రపరమైన ఊహాలోకములో జీవిస్తుంటారు. వివరించలేనంతగా యేసు శ్రమపొంది, మరణించాడు. యూదులుకూడ అంతే.

కల్వరికి, మరియు సామూహిక మరణ శిబిరములకు అనగా - యేసుక్రీస్తు శ్రమలు మరియు యూదుల శ్రమలను, అనుసంధానము చేయుటలో నేను మొదటివాడను కాను. హృదయ విదారకరమైన, నిరపరాదులను-ధ్వంసముచేయు, నోరుమూయబడిన విషయాలను గూర్చి తెలిపిన "నైట్" అనే పుస్తకములో, ఒక యువకునిగా ఆస్క్‌విట్జ్, భూన మరియు భుచెన్‌వాల్డ్ ప్రాంతములలో జరిగిన సామూహిక మరణ శిబిరములను గూర్చిన తన అనుభవములను ఏలీ వైజల్ చెప్పారు. అక్కడ "ఎంపికను" గూర్చిన భయము ఎప్పుడూ ఉంది-అనగా ఎంపిక చేయబడిన వారిని తీసుకుపోయి చంపి, కొలిమిలో కాల్చుతారు.

ఒక సందర్భములో-ఒకే ఒక్క సందర్భములో, వైజల్ కల్వరిని మరియు మరణ శిబిరమును సంధానము చేసాడు. అకిబా దూమర్, అనే ఒక వృద్ధుడైన బోధకుని గూర్చి ఆయన చెప్పిన మాటలు ఇవి:

> *ఎంపిక చేయబడిన బాధితుడుగా అకిబా దూమర్ మమ్ములను విడచిపెట్టాడు. చివరగా ఆయన మా మధ్య సంచరించాడు, ఆయన నేత్రములు మెరుస్తున్నాయి; "నేను ముందుకు వెళ్లలేను... అంతాజరిగిపోయింది..." వినుట లేదు. ఇవన్నీ ఆయనకొరకే జరుగుతున్నాయని, ఇంకెంత మాత్రము తన మనుగడ కొనసాగించలేనని, తనకు బలము లేదా విశ్వాసము మిగిలి లేదని పదేపదే చెబుతున్నాడు. అకస్మాత్తుగా ఆయన నేత్రములు శూన్యమైపోయాయి, రెండు గాయములు, భయంకరమైన నరకము తప్ప మరేమి కాదు.*

తరువాత వైజల్ రోషము కలిగించే ఈ మాటలు చెప్పెను; "బీదవాడైన అకీబా దూమర్, దేవుని యందు విశ్వాసముంచి ముందుకు వెళ్లియుంటే, ఈ కల్వరి దేవునియందు ఋజువు ఆయన చూడగలిగితే, ఆయన "ఎంపిక" ద్వారా కొనబడి యుండెడివాడు కాదు. ఏలీ వైజల్‌కు బదులు నేను చెప్పాలని తలంచుట లేదు. ఆయన భావము నాకు తెలియదు. అయితే ఇది ఒక ప్రశ్నను కలిగిస్తుంది; యేసు మరణించిన స్థలమైన కల్వరికి, సామూహిక మరణ శిబిరములకు సంబంధము ఏమిటి?

కారణము వెదకుటకు లేదా నిందించుటకు ఈ ప్రశ్న నేను అడుగుటలేదు. దాని అర్థమును, నిరీక్షణను గూర్చి ఆలోచిస్తున్నాను. యూదులు పొందిన శ్రమలు, యేసు పొందిన శ్రమలలో అర్థము పొందుకోగలిగే మార్గము ఏదైనా ఉన్నదా? క్రీస్తు యొక్క మరణము ఆస్క్‌విట్జ్‌కు నడిపించుట లేదు, గాని ఆస్క్‌విట్జ్ మరణాలు క్రీస్తు మరణమును అవగాహన చేసుకొనుటకు నడిపించబడుతున్నాయా? కల్వరి మరియు సామూహిక మరణ శిబిరములు మధ్య ఉన్న సంబంధము అపరిమితమైనదా? “ఒక సుదీర్ఘరాత్రి” లో యూదులకు సంభవించిన శ్రమలు బహుశా యేసు మాత్రమే ఎరిగియున్నాడు. మరియు తమ పూర్వీకులు పొందిన హానికరమైన శ్రమలను ఎరిగిన ఒక తరమువారు బహుశా దేవుని కుమారునికి కల్వరిలో ఏమి జరిగినదో గ్రహించగలరేమో, ఇంకెవరూ గ్రహించలేరెమో. దీనిని నేను ఒక ప్రశ్నగా విడచిపెడుతున్నాను. నాకైతే తెలియదు.

అయితే నాకు తెలిసినది ఇది: క్రైస్తవులగా పిలవబడి మరణ శిబిరాలను ఏర్పాటు చేసిన వారు, కల్వరి వైపు నడిపించిన యేసు క్రీస్తు ప్రేమను ఎప్పటికీ తెలుసుకొనలేరు. సంస్కృతిని రక్షించడానికి ప్రయాసపడిన వారికి లోకమును రక్షించుటకు మరణించిన క్రీస్తును గూర్చి ఎన్నటికి ఎరుగరు. అయితే అక్కడ కొందరు క్రైస్తవులున్నారు-నిజమైన క్రైస్తవులు-వారు క్రీస్తు మరణము యొక్క అర్థమును గ్రహించినవారు, మరియు ఆయన పొందిన శ్రమల వలన విరుగగొట్టబడి, తగ్గించబడినవారైయున్నారు. బహుశా అనేక మందికంటే, యూదుల యొక్క శ్రమల పరిధిని చూడగలిగినవారు వీరేనా?

ఎంతటి విరుద్ధ భావ సారూప్యత కలిగిన క్రైస్తవులు వీరు! యేసు మరియు ఆయన ఆది అనుచరులు యూదులైయున్నారు. పాలస్తీనాలో అన్ని తెగలవారు (యూదులు కాదు) తన సిలువ కార్యములో పాల్గొన్నారు, మరియు ప్రతి తెగ నుండి ప్రజలు (యూదులుతో సహా) దానిని ఆపుచేయుటకు ప్రయత్నించారు. దేవుడే తన కుమారుని యొక్క మరణములో ముఖ్య పాత్రదారి, అందువలన ప్రధానమైన ప్రశ్న: “ఏ మనుష్యులు యేసుమరణమునకు బాధ్యులు” ? అని కాదు గాని, యేసు మరణము ప్రజలందరి కొరకు అనగా-యూదులు, ముస్లింలు, భౌద్ధులు మరియు హిందువుల పట్ల ఆయన చేసిన కార్యము ఏమిటి అనునదియే.

అంతా చెప్పబడి, జరిగిన తరువాత, మిక్కిలి సంక్లిష్టమైన ప్రశ్న ఏదనగా: ఎందుకు? ఎందుకు యేసు మరణించవచ్చాడు? ఎందుకు వచ్చాడన్న కారణము వెదుకటకు కాదు గాని ఆయన ఉద్దేశ్యము ఏమిటి అన్నది తెలుసుకొనుటకే తన మరణము ద్వారా క్రీస్తు



సాధించినదేమిటి? ఆయన అంతగా ఎందుకు శ్రమనొందాలి? ఈ లోకము కొరకు కల్వరిలో ఎటువంటి గొప్పకార్యము జరగవలసియుంది?

మిగిలిన ఈ పుస్తకము ఈ విషయాలన్నిటిని గూర్చి తెలుపుతుంది. యేసు మరణించవచ్చుటకు గల యాబది కారణములను నేను క్రొత్త నిబంధన నుండి పొందుపరచాను. యాభై కారణాలు కాదు గాని, యాభై ఉద్దేశ్యములు. యేసును ఎవరు చంపారు అనే ప్రశ్నకంటే, మనలాంటి పాపులకొరకు తన కుమారుని మరణమునకు పంపించుటలో దేవుడు ఏమి సంపాదించాడు అనునది ప్రాముఖ్యము.

# యేసు మరణించ వచ్చుటకు యాభై హేతువులు

యేసు మరణించుటకు హేతువేమనగా :

# 1

# దేవుని ఉగ్రతను తనయందు భరించుటకు

*క్రీస్తు మన కోసము శాపమై మనలను ధర్మశాస్త్రము యొక్క శాపము నుండి విమోచించెను, ఇందును గూర్చి – "మ్రాను మీద వ్రేలాడిన ప్రతివాడును శాపగ్రస్తుడు" అని వ్రాయబడియున్నది.*

*గలతీ. 3 : 13-14*

*పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమివలన ఉపేక్షించినందున, ఆయన తన నీతిని కనుపరచవలెనని క్రీస్తు యేసు రక్తము నందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా బయలు పరచెను.*

*రోమా. 3 : 25*

*మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను.*

*1 యోహాను. 4 : 10*

**దే**వుడు నీతిమంతుడు కాకపోతే, ఆయన కుమారుడు శ్రమపొంది, మరణించవలసిన ఆవశ్యకత ఉండెడదికాదు. దేవుడు ప్రేమ కలిగి లేకుంటే, తన కుమారుడు శ్రమపొంది మరణించుటకు ఇష్టపడేవాడు కాదు. కాని దేవుడు న్యాయవంతుడు మరియు ప్రేమకలిగినవాడు. అందువలన తన నీతి కోరునది చేయుటకు తన ప్రేమచేత ఇష్టపడుచున్నాడు.

దేవుని ధర్మశాస్త్రము కోరునదేమనగా, " నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణ శక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను" (ద్వితి. కా. 6 : 5). కాని మనము ఇతర విషయాలను ఎక్కువగా ప్రేమిస్తున్నాము. దేవునికంటే ఎక్కువగా ఇతర విషయాలకు ప్రాధాన్యతనిచ్చి, వాటిని చేయుటకు పూనుకొనుటయే పాపము. అందువలన, " అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా. 3:23). అని బైబిలు గ్రంథము చెబుతుంది. మనము దేనియందు మిక్కిలి సంతోషించుతామో దానినే మహిమపర్చుతాము. అయితే దేవునిని మహిమ పర్చడము లేదు.

అందువలన పాపము చిన్నవిషయముకాదు, ఏలయనగా అది సామాన్యమైన



అధికారమును వ్యతిరేకించుట లేదు. అవమాన పర్చబడ్డ వారి స్థాయిని బట్టి అవమానము యొక్క తీవ్రత పెరుగుతూ ఉంటుంది. ఈ విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్త అటువంటి ఘనత, స్తుతి మరియు భక్తిని పొందుటకు యోగ్యుడు. అందువలన ఆయనను ప్రేమించ లేకపోవుట స్వల్పమైన విషయం కాదు గాని, అది బహు ద్రోహము. అది దేవునికి అపకీర్తిని తెచ్చి మనుష్యుని ఆనందమును పోగొట్టును.

దేవుడు న్యాయవంతుడు గనుక, ఈ అపరాధములన్నిటిని విశ్వము అనే కంబళి క్రిందకి నెట్టుటలేదు. అయితే వాటికి వ్యతిరేఖముగా ఒక పరిశుద్ధ ఉగ్రతను కలిగి యున్నాడు. వారు శిక్షించబడుటకు యోగ్యులని ఆయన స్పష్టము చేసెను,"పాపము వలన వచ్చు జీతము మరణము" (రోమా. 6 : 23). "పాపము చేయువాడెవడో వాడే మరణము నొందును" (యెహెజ్కేలు. 18 : 4).

పాపమంతటి మీద శాపము చుట్టుకొని ఉంది. శిక్షించకపోవుట న్యాయ విరుద్ధమే అవుతుంది. దేవుడు తక్కువగా ప్రమాణీకరించబడతాడు. సత్యమునకు బదులు అసత్యము రాజ్యమేలుతుంది. అందువలన, "ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుటయందు నిలుకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు" (గలతీ. 3 : 10, ద్వితి.కా. 27 : 26) అని దేవుడు చెప్పెను.

అయితే పాపభుయిష్టమైన మానవ జాతిని చుట్టుకొనియున్న శాపమును గూర్చి దేవుని ప్రేమ నెమ్మది లేక యున్నది. అది ఎంత పరిశుద్ధమైనదైనప్పటికీ, ఆయన ఉగ్రత చూపించుటకు ఇష్టపడుటలేదు. అందువలన, దేవుడు తన కుమారుని పంపించెను, ఆయన యందు విశ్వాసముంచు ప్రతివారి ఉగ్రతను తాను భరించెను. "క్రీస్తు మనకోసము శాపమై మనలను ధర్మశాస్త్రము యొక్క శాపము నుండి విమోచించెను" (గలతీ. 3 : 13)

రోమాపత్రిక 3 : 26 లో చెప్పబడిన " ఆయనను కరుణాధారముగా బయలుపరచెను" అనే మాటకు అర్థము ఇదే. ఒక ప్రత్యమ్నాయమును దేవుడు ఇచ్చెను. ఈ ప్రత్యమ్నాయమైన యేసుక్రీస్తు, కేవలం ఉగ్రతను రద్దుచేయడము మాత్రమే కాదుగాని, దానిని తనకు మలచుకొని తానే ఉగ్రతను భరించెను. దేవుని ఉగ్రత న్యాయమైనది, అది వెనుకకు తీయబడలేదు కానీ అది నెరవేర్చబడినది.

ఆయన ప్రేమను అలక్ష్యముగానొ లేదా స్వల్పముగానొ తీసుకొనకుందుము. పాపము యొక్క తీవత్రను మరియు మనపై ఉన్న న్యాయబద్ధమైన ఆయన ఉగ్రతను మనము గ్రహించనంతవరకు దేవుని యొక్క ఉత్కృష్టమైన ప్రేమలో నిలచియుండలేము. అయితే, కృపద్వారా మన యొక్క అయోగ్యతను మనము గ్రహించినప్పుడు క్రీస్తు పడిన శ్రమను మరియు ఆయన మరణమును చూడగలిగి ఈ విధముగా చెప్పెదము."మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు (ఉగ్రతను భరించుటకు) తన కుమారుని పంపెను" (1 యోహాను. 4 : 10)

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 2
# తన పరలోకపు తండ్రిని శాంతింపజేయుటకు

*అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను*
*ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను.*
*యెషయా. 53 : 10*

*క్రీస్తు మిమ్మును ప్రేమించి, పరిమళవాసనగా ఉండుటకు మనకొరకు*
*తన్నుతాను దేవునికి అర్పణముగాను బలిగాను అప్పగించుకొనెను.*
*ఎఫెసీ. 5 : 2*

**ప**రలోకములో ఉగ్రుడైయున్న తన తండ్రితో యేసు పెనుగులాడ లేదు, మరియు తన చేతిలోని కొరడాను ఝుళిపించలేదు. అదే విధంగా, మానవజాతి మీద కనికరము చూపించమని కూడా ఆయనను బలవంతము చేయలేదు. దేవుని దయ పాపులపై నుండునట్లు ఆయన మరణము అయిష్టమునగ అంగీకరించబడినది కాదు. యేసు శ్రమపొంది మరణించుట దేవుని యొక్క ఉద్దేశ్యమైయున్నది. దేవుడు లోకము యొక్క చరిత్రను దృష్టించి యోచించునట్లు ఇది సృష్టికి పూర్వమే ఉద్దేశించబడిన దేవుని ప్రణాళికయైయున్నది. అందువలన బైబిలు గ్రంథము “దేవుని యొక్క సంకల్పమును బట్టి తన కృపను అనాదికాలముననే క్రీస్తు యేసునందు మనకు అనుగ్రహించెను” అని చెప్పుచున్నది. (2 తిమోతి. 1 : 9)

ఈ ప్రణాళిక ఇప్పటికే యూదుల లేఖనములలో విశదపరచబడినది. పాపుల యొక్క స్థానాన్ని తీసుకున్న మెస్సియాను గూర్చి ప్రవక్తయైన యెషయా ప్రవచించెను. క్రీస్తు మనస్థానములో దేవునిచేత భాదింపబడెనని ఆయన చెప్పెను:

> *నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను, మన వ్యసనములను వహించెను. అయినను మొత్తబడినవాని గాను, దేవుని వలన భాదింపబడినవాని గాను, శ్రమనొందినవానిగాను మనమతనిని ఎంచితిమి. మన యతిక్రమ క్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను... మన మందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి, మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మన యందరి దోషమును అతని మీద మోపెను (యెషయా. 53 : 4-6)*



అయితే, పాపులకు ప్రత్యమ్నాయముగా క్రీస్తు శ్రమపొందుటలో ఆశ్చర్యకర విషయమేమిటంటే, ఇది దేవుని ఉద్ధేశ్యమైయున్నది. పాపులను శిక్షించాలన్న దేవుని ఆలోచనలో క్రీస్తు కలుగజేసు కొనలేదు. ఆయన అక్కడ (పాపిస్థానంలో) ఉండాలని దేవుడు ఉద్ధేశించియున్నాడు. పాతనిబంధనలో ఒక ప్రవక్త ఈ విధముగా చెప్పెను, “అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను” (యెషయా. 53 : 10)

ఇది క్రొత్త నిబంధనలోని విరుద్ధ భావాలను విశదపరుస్తుంది. ఒక విధముగా, క్రీస్తు యొక్క శ్రమలు పాపమును బట్టి దేవుని ఉగ్రతవలన కలిగినవిగా ఉన్నవి. కానీ మరియొక విధముగా క్రీస్తు పొందిన శ్రమలు తన యొక్క తండ్రికి తాను చూపించే శ్రేష్ఠమైన విధేయత మరియు లోబడుటయై యున్నది. అందుకే క్రీస్తు సిలువలో ఈ విధముగా కేక వేసెను, “నాదేవా నాదేవా నన్నెందుకు చెయ్యి విడిచితివి” (మత్తయి. 27 : 46). మరియు ఆయన పొందిన శ్రమలు దేవునికి పరిమళ సువాసనగా ఉన్నవని బైబిలు గ్రంథం చెబుతుంది. “క్రీస్తు మిమ్మును ప్రేమించి, పరిమళ వాసనగా ఉండుటకు మనకొరకు తన్నుతాను దేవునికి అర్పణముగాను బలిగాను అప్పగించు కొనెను”(ఎఫెసీ. 5:2)

ఆహా, భయంకరమైన అధ్భుతమైన దేవుని ప్రేమను మనము ఆరాధించెదము! ఇది అనురాగం కాదు. ఇది సామాన్యమైనది కాదు. మనకొరకు దేవుడు అసాధ్యమైనది చేశాడు: తన ఉగ్రతను తన సొంత కుమారుని మీద క్రుమ్మరించాడు - ఆయన కుమారుని యొక్క విధేయత అత్యంత అయోగ్యులైన వారు (ప్రేమను) పొందుకొనేటట్లు చేసినది. కుమారుడు ఉద్ధేశపూర్వకముగా తాను అప్పగించుకొనుట దేవుని దృష్టిలో ఎంతో ప్రశస్తమైనది. ఉగ్రతను భరించినవాడు అత్యధికముగా ప్రేమించబడెను.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 3

# విధేయతను నేర్చుకొని సంపూర్ణుడగుటకు

*ఆయన, కుమారుడైయుండియు తాను పొందిన*
*శ్రమల వలన విధేయతను నేర్చుకొనెను.*
*హెబ్రీ. 5 : 8*

*ఎవని నిమిత్తము సమస్తమును ఉన్నవో, యెవనివలన సమస్తమును కలుగు చున్నవో, ఆయన అనేకులైన కుమారులను మహిమకు తెచ్చుచుండగా వారి రక్షణకర్తను శ్రమలద్వారా సంపూర్ణునిగా చేయుట ఆయనకు తగును.*
*హెబ్రీ. 2 : 10*

**బై**బిలు గ్రంధమునందు ఈ పుస్తకము (హెబ్రీ పత్రిక) క్రీస్తు " శ్రమల ద్వారా విధేయత " నేర్చుకున్నాడని మరియు " శ్రమల ద్వారా సంపూర్ణునిగా చేయబడ్డాడని చెబుతుంది, మరియు ఆయన "పాపము లేనివానిగా " ఉండెనని చెబుతుంది. "సమస్త విషయములలోను (క్రీస్తు) మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను (హెబ్రీ. 4 : 15)

ఇది బైబిలు చేయుచున్న స్థిరమైన బోధ. క్రీస్తు పాపము లేనివాడు. ఆయన దేవుని కుమారుడు అయినప్పటికీ ఆయన నిజముగా మనుష్యుడు, ఆయన మనవలెనే శోధింపబడెను, దప్పిక మరియు శారీరక బలహీనత కలిగియుండెను. ఆయన ఆకలిగొనెను (మత్తయి. 21 : 18) కోపపడెను, దుఃఖపడెను, (మార్కు. 3 : 5) మరియు శ్రమ నొందెను (మత్తయి. 17 : 12) కాని ఆయన హృదయం మాత్రము సంపూర్ణముగా దేవుని ప్రేమ యందుండెను మరియు ఆ ప్రేమతోనే ఆయన సమన్వయంతో పనిచేసెను. "ఆయన పాపము చేయలేదు, ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు" (1 పేతురు. 2 : 22)

అందువలన యేసు "తాను పొందిన శ్రమవలన విధేయతను నేర్చుకొనెను" అని బైబిలు గ్రంధము చెప్పుతున్నప్పుడు, ఆయన అవిధేయతను మానుకొనుటకు నేర్చుకొనెనని అర్ధము కాదు. దాని అర్ధమేమిటంటే తాను అబ్యాసపూర్వకముగా పొందిన ప్రతి శ్రమ మరియు భాద విధేయతకు నడిపించినది. అలాగునే, "శ్రమల ద్వారా సంపూర్ణునిగా" ఆయన చేయబడెనని చెప్పబడినప్పుడు, తన లోపాల నుండి క్రమ క్రమంగా మార్పు మార్పు చెందుతున్నాడని అర్ధం కాదు. దానర్ధమేమనగా, మనలను



రక్షించు నిమిత్తము క్రమక్రమంగా సంపూర్ణ నీతిమత్వమును నెరవేర్చుచున్నాడు.

తన బాప్తిస్మము ద్వారా ఇదే విషయాన్ని ఆయన చెప్పెను. ఆయన పాపి అయినందుకు బాప్తిస్మము తీసుకొనలేదు. బాప్తిస్మమిచ్చు యోహానుకు ఆయన ఈ విధంగా వివరించెను: "నీతియావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నది." (మత్తయి. 3 : 15).

ప్రాముఖ్యమైన విషయమిదే : తన యొక్క నీతిమత్వమును మరియు ప్రేమను కనబర్చుటకు దేవుని కుమారుడు ఒక వేళ శోధన మరియు భాదల గుండా వెళ్ళకుంటే, పతనమైన మానవజాతికి ఆయన తగిన రక్షకుడు కాదు. ఆయన పొందిన శ్రమ దేవుని యొక్క ఉగ్రతను మ్రింగి వేయుటకు మాత్రమే కాదు గాని, అది ఆయన మానవత్వమును నెరవేర్చినది మరియు మనము ఆయన సహోదర, సహోదరిలముగా ఉండునట్లు చేసినది (హెబ్రీ. 2 : 17).

*యేసు మరణించుటకు హేతువేమనగా :* **4**

# మరణము నుండి తన సొంత పునరుత్థానమును పొందుటకు

*గొఱ్ఱెల గొప్పకాపరియైన యేసు అను మన ప్రభువును నిత్యమైన నిబంధన సంబంధమగు రక్తమునుబట్టి మృతులలో నుండి లేపిన సమాధానకర్త యగు దేవుడు, యేసు క్రీస్తు ద్వారా తన దృష్టికి అనుకూలమైన దానిని మనలో జరిగించుచు, ప్రతి మంచి విషయములోను తన చిత్త ప్రకారము చేయుటకు మిమ్మును సిద్ధపరచును గాక*

*హెబ్రీ. 13 :20-21*

**ఆ**యన పునరుత్థానమునకు ముందు, ఆయన మరణము ఊరకనేరాలేదు. దానికి ఆవశ్యకమైన మూల్యము చెల్లించబడినది. అందుకే నిత్యమైన నిబంధన సంబంధమగు రక్తమును బట్టి మృతులలో నుండి దేవుడు ఆయనను లేపెనని హెబ్రీపత్రిక 13 : 20 చెబుతుంది.

"నిబంధన సంబంధమగు రక్తము" యేసు యొక్క రక్తమైయున్నది. ఇది నా నిబంధన రక్తమని" ఆయన చెప్పెను (మత్తయి 26 : 28). బైబిలు గ్రంథము యేసు రక్తమును గూర్చి మాట్లాడినప్పుడు, ఆయన మరణమును అది తెలియజేస్తుంది. కేవలము యేసు శరీరము నుండి రక్తము కారుటవలన ఎటువంటి రక్షణ నెరవేర్చబడదు. ఆయన రక్తము చిందించి మరణించుట ద్వారా మాత్రమే ఆయన మరణము ప్రాముఖ్యమైనదైనది.

ఇప్పుడు, యేసు చిందించిన రక్తమునకు మరియు పునరుత్థానమునకు ఏమిటి సంబంధము? ఆయన కేవలం రక్తం చిందించిన తరువాత లేపబడలేదు కాని, రక్తం చిందించుట వలన లేపబడెను. అనగా క్రీస్తు యొక్క మరణము నెరవేర్చిన కార్యము నిండైనది మరియు లోపరహితమైనది. అందువలన పునరుత్థానము మరణము ద్వారా క్రీస్తు సాధించిన ప్రతిఫలమును నిర్ధోషమైన కార్యమునైయున్నది.

యేసు పొందిన శ్రమ మరియు మరణము ద్వారా దేవుని యొక్క ఉగ్రత శాంతించబడినది. పాపమునకు వ్యతిరేఖముగా నున్న పరిశుద్ధశాపము పూర్తిగా మ్రింగివేయబడినది. క్రీస్తు యొక్క విధేయత సంపూర్ణ పరిమాణములో నెరవేర్చబడినది. క్షమాపణకు ఆవశ్యకమైన మూల్యము సంపూర్ణముగా చెల్లించబడినది. దేవుని యొక్క నీతి సంపూర్ణముగా నెరవేర్చబడినది. అయితే దేవుడు ప్రమాణీకరించిన దానిని బహిరంగముగా ప్రకటించబడుటయే ఇంకా నెరవేర్చుటకు మిగిలి ఉంది. యేసును



మరణములో నుండి లేపుట ద్వారా దీనిని ఆయన ఇచ్చెను.

"క్రీస్తు లేపబడనియెడల మీ విశ్వాసము వ్యర్థమే, మీరింకను మీ పాపములలోనే యున్నారు'' అని బైబిలు గ్రంథము చెబుతుంది (1 కొరింథీ. 15:17), విషయమేమిటంటే, పునరుత్థానము మన పాపముల నిమిత్తము చెల్లించబడిన మూల్యము కాదు. ప్రాముఖ్యముగా యేసు యొక్క మరణము అన్నింటికి సరిపడే మూల్యమును చెల్లించినది అని పునరుత్థానము ఋజువు చేస్తుంది. ఒక వేళ యేసు మరణము నుండి లేపబడక పోతే, అప్పుడు ఆయన మరణము ఒక ఓటమి అవుతుంది, మరియు పాపమును భరించేలా ఆయన చేసిన కార్యమును దేవుడు గుర్తించలేడు, మరియు మనమింక మన పాపములలోనె ఉందుము.

అయితే నిజముగా, "తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి లేపబడెను" (రోమా. 6 : 4). ఆయన శ్రమ మరియు మరణము వలన కలిగిన విజయము నిజమని నిరూపించబడినది. మరియు మన విశ్వాసమును క్రీస్తులో నుంచితే మనమింక మన పాపములో ఉండము. నిత్యమైన నిబంధన సంబంధమగు రక్తమును బట్టి గొప్ప కాపరి లేపబడి నిరంతరమూ జీవిస్తున్నాడు.

*యేసు మరణించుటకు హేతువేమనగా :* 5

# శ్రేష్ఠమైన దేవుని ప్రేమ మరియు కృపను పాపులకు వెల్లడిపరచుటకు

✝

*నీతిమంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు. మంచివాని కొరకు ఎవడైన ఒక వేళ చనిపోవ తెగింపవచ్చును. అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరుచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను.*

*రోమా. 5: 7-8*

*దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను.*

*యోహాను. 3 : 16*

*దేవుని కృపామహాదైశ్వర్యమునుబట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది.*

*ఎఫెసీ. 1 : 7*

**దే**వుని ప్రేమ పరిమాణము మనకు రెండు విషయాల ద్వారా వెల్లడియగుచున్నది. మొదటిగా, పాపము యొక్క శిక్షలో నుండి మనలను రక్షించుటకు ఆయన బలియర్పణముగా అయిన స్థాయి. రెండవదిగా, ఆయన మనలను రక్షించునప్పుడు మన అయోగ్యత యొక్క స్థాయి.

ఆయన అర్పించబడిన పరిమాణమును "తన అద్వితీయ కుమారుని ఇచ్చెను" అనే మాటలో మనము గ్రహించవచ్చు (యోహాను. 3 : 16). క్రీస్తు అనే మాటలో కూడ దీనిని గ్రహింపవచ్చును. క్రిష్టోస్ అనే గ్రీకు పదము నుండి ఈ మాట వచ్చినది, అనగా "అభిషిక్తుడు లేదా మెస్సియా" అని అర్థము. ఇది గొప్ప ఘనతను సూచించు పదము. మెస్సియా ఇశ్రాయేలునకు రాజు కావలసియున్నది. ఆయన రోమీయులను జయించి, ఇశ్రాయేలు వారికి శాంతి మరియు భద్రతను తీసుకు వస్తాడు. ఆ విధముగా, పాపులను రక్షించుటకు దేవుని చేత పంపబడిన వ్యక్తి, ఆయన కుమారుడే - ఆయన



ఒక్కగానొక్క కుమారుడు మరియు ఆయన ఇశ్రాయేలువారికై అభిషేకించబడిన రాజు - నిజానికి ఆయన ఈ ప్రపంచానికే రాజు (యెషయా. 9 :6-7).

క్రీస్తు పొందిన అతి భయంకరమైన సిలువమరణమును మనము పరిగణలోనికి తీసుకొనినప్పుడు తండ్రి మరియు కుమారుడు చేసిన త్యాగము మహోన్నతమైనదని స్పష్టమగుచున్నది. దేవునికి మనుష్యునికి మధ్య ఉన్న అంతరాయమును నీవు పరిగణించినప్పుడు అది ఇంకా అనంతమైనదని గ్రహిస్తావు. కాని దేవుడు మనలను రక్షించడానికి ఈ త్యాగాన్ని చేయుటకు పూనుకున్నాడు.

మన యొక్క అయోగ్యతను మనము పరిగణించినప్పుడు, ఆయన ప్రేమ పరిమాణం ఎంతో ఎక్కువగా ఉంది. మంచివాని కొరకు ఎవడైన ఒక వేళ చనిపోవ తెగింపవచ్చును అయితే దేవుడు మనయెడల తన ప్రేమను వెల్లడిపరుచుచున్నాడు, ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను (రోమా. 5:7-8). మనము దైవిక శిక్షకు గురికావలసి యుండెను, దైవ బలియర్పణకు కాదు.

"దేవుడు కప్పలకొరకు మరణించలేదు. కావున మానవులగా మనకు గొప్ప విలువనిస్తున్నాడు" అని చెప్పడం నేను విన్నాను. దాని తలపైకి కృప వచ్చునట్లు ఆ మాట చేసినది. మనము కప్పలకంటే మిక్కిలి చెడ్డవారము. అవి పాపము చేయలేదు. అవి తిరుగుబాటు చేయలేదు మరియు వాటి జీవితములలో అక్రముగా నుండి దేవునిని నిర్లక్ష్యము చేయలేదు. దేవుడు కప్పలకొరకు మరణించాల్సిన అవసరము లేదు. అవి అంత చెడ్డవికావు. అయితే మనము చెడ్డవారము. మన యొక్క ఋణము చాలా గొప్పది, కేవలము ఒక దైవిక బలియర్పణము మాత్రమే దానిని చెల్లించగలదు.

దేవుడు మనకొరకు చేసిన బలియర్పణకు ఒకే ఒక వివరణ ఉంది. అది మనము కాదు. అది దేవుని కృపామహాదైశ్వర్యము మాత్రమే (ఎఫెసీ. 1:7). ఇది ఉచితమైనది. అది మన యోగ్యతకు ప్రత్యుత్తరముగా వచ్చినదికాదు. అది అనంతమైన పొంగిపొర్లే ఆయన యోగ్యతయైయున్నది. వాస్తవానికి, అత్యంగా దైవికమైన ప్రేమ ఇదే : అయోగ్యులైన పాపులైన మనలను గొప్పదైన నిత్య ఆనందముతో నింపి ఆయన తన అనంత సౌంధర్యములో గొప్ప వెలను చెల్లించి, ఆయన మనపట్ల అత్యంత ఆసక్తి కలిగియున్నాడు.

యేసు మరణించుటకు హేతువేమనగా :

# 6
# తన ప్రేమను మనపట్ల వెల్లడి చేయుటకు

*క్రీస్తు మిమ్మును ప్రేమించి, పరిమళ వాసనగా ఉండుటకు మనకొరకు తన్ను తాను దేవునికి అర్పణముగాను బలిగాను అప్పగించుకొనెను.*
*ఎఫెసీ. 5 : 2*

*అటువలె క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి... దాని కొరకు తన్నుతాను అప్పగించుకొనెను.*
*ఎఫెసీ. 5 : 25*

*(ఆయన) నన్ను ప్రేమించి, నా కొరకు తన్నుతాను అప్పగించుకొనెను.*
*గలతీ. 2 : 20*

**క్రీ**స్తు మరణము కేవలము దేవుని యొక్క ప్రేమను ఋజువు చేయుట (యోహాను. 3 :16) మాత్రమే కాదుగానీ ఎవరైతే పొందగోరు చున్నారో వారందరికీ ఉన్నతమైన తన యొక్క సొంతప్రేమను వ్యక్తపరచుచున్నది. ఆది సంఘములో క్రీస్తు కొరకు బహు శ్రమ పొందిన సాక్షులు ఈ సత్యముచేత పట్టుబడ్డారు: "ఆయన నన్ను ప్రేమించి, నా కొరకు తన్నుతాను అప్పగించుకొనెను'' (గలతీ. 2:20) వారు క్రీస్తు యొక్క బలియర్పణమును వ్యక్తిగతంగా అన్వయించుకున్నారు. "ఆయన నన్ను ప్రేమించాడు. ఆయన నాకొరకు తన్నుతాను అప్పగించుకున్నాడని" వారు చెప్పారు.

నిశ్చయముగా క్రీస్తు యొక్క శ్రమలు మరియు మరణమును ఈ విధముగా మనము అర్థం చేసుకోవలసియున్నదని వారి యొద్ద నుండి నేను నేర్చుకొంటిని. వారు వ్యక్తిగతముగా నాకు క్రీస్తు ప్రేమ కనబరిచారు. సాధారణముగా చెప్పుకొనేపాపము కాదుగాని, నా సొంతపాపమే నన్ను దేవుని నుండి వేరు చేయుచున్నది. కేవలము నా యొక్క హృదయ కాఠిన్యము మరియు ఆత్మీయ జడత్వము క్రీస్తు యొక్క మహోన్నత్వమును తక్కువచేయుచున్నది. నేను తప్పిపోయి, నశించిపోతున్నాను. రక్షణ విషయంలో, నాకున్న వాదనలన్నీ, (దేవుని) నీతిముందు విలువలేనివే. ఆయన కనికరము కొరకు వేడుకొనుటయే నేను చేయగలిగినది.

అలాగైతే, క్రీస్తు ఎవరికోసము శ్రమపొంది మరణించాడు? అని వెదికాను. దాన్నిగూర్చి ఇలా చెప్పబడుతుంది. "క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి...దాని కొరకు తన్నుతాను అప్పగించుకొనెను (ఎఫెసీ. 5:25) తన స్నేహితుల కొరకు తన ప్రాణము



పెట్టువాని కంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేదు. (యోహాను. 15:13). "అలాగే మనుష్య కుమారుడు పరిచారము చేయించు కొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని చెప్పెను" (మత్తయి. 20:28).

మరియు నేను అడిగాను, ఆ అనేకమందిలో నేనున్నానా ? ఆయన స్నేహితులలో నేను ఒకడిని కాగలనా? నేను సంఘమునకు చెందుతానా ? అప్పుడు నేను వినిన సమాధానము. "ప్రభువైన యేసు నందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును నీ యింటివారును రక్షణ పొందుదురు" (అపో. కా. 16:31). " ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపబడును. (రోమా. 10:13). "ఆయన యందు విశ్వాసముంచువాడెవడో వాడు ఆయన నామము మూలముగా పాపక్షమాపణ పొందును (అపో.కా. 10:43). ''తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచిన వారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను (యోహాను. 1:12). " ఆయన యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందును"(యోహాను. 3:16).

నాహృదయం కదిలించబడినది, నాకొరకు నిధియైయున్న క్రీస్తు సౌందర్యమును మరియు ఔదార్యమును నేను హత్తుకున్నాను. అప్పుడు నాకొరకైన క్రీస్తు ప్రేమ గొప్ప ప్రవాహము వలె వచ్చుట నిజమైనది. అప్పుడు, ఆది సంఘములోని సాక్షులుతో పాటు "ఆయన నన్ను ప్రేమించాడు. నాకొరకు తన్నుతాను అప్పగించుకున్నాడు" అని చెప్పాను.

అయితే నేను చెప్పునదేమిటి? ఒక అమూల్యమైన బహుమానము నిచ్చుటకు ఆయన గొప్పదైన మూల్యమును చెల్లించాడు అనేది నా ఉద్దేశ్యము. మరి అది ఏమిటి? అదేమిటనగా, తన యొక్క జీవితము చివరిలో చేసిన ప్రార్థన అనెడి బహుమానమే: "తండ్రీ, నేనెక్కడ ఉందునో అక్కడ నీవు నాకు అనుగ్రహించిన వారును నాతోకూడ ఉండవలెననియు, నీవు నాకు అనుగ్రహించిన నా మహిమను వారు చూడవలెననియు కోరుచున్నాను" (యోహాను. 17:24). ఆయన శ్రమ మరియు మరణములో "తండ్రివలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" (యోహాను. 1:14). ఆయన కొరకు పట్టబడులాగున చాలినంత విషయాన్ని మనము చూచియున్నాము. అయితే శ్రేష్ఠమైనది ఇంకా రావలసియున్నది. దీనిని భద్రపరుచుటకు ఆయన మనకొరకు మరణించెను. అదే క్రీస్తు ప్రేమ.

యేసు మరణించుటకు హేతువేమనగా :

# 7 మనకు విరోధముగా ధర్మ శాస్త్రము చేయు ఆరోపణలు కొట్టివేయుటకు

*అపరాధముల వలనను...మీరు మృతులై యుండగా, దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మన మీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి, దాని మీద చేవ్రాతను తుడచివేసి, మనకు అడ్డము లేకుండ దానిని ఎత్తివేసి మన అపరాధములనన్నిటిని క్షమించి, ఆయనతో కూడ మిమ్మును జీవింపచేసెను.*

కొలస్సీ. *2:13*

**మ**న యొక్క మంచిక్రియలు ఒక దినమున మన యొక్క చెడ్డక్రియలు కంటే హెచ్చుగా తూగుతాయని బావించటము ఎంత అవివేకము. రెండు కారణాలను బట్టి ఇది అవివేకమైయున్నది. మొదటిగా, మన మంచిక్రియలు కూడా అసంపూర్ణమైనవి, ఎందుకంటే ఆ (మంచి) క్రియలు మనము చేయుచున్నప్పుడు దేవుని మనము మహిమపరచలేదు. ఆయన మహోన్నత్వమును గుర్తిస్తూ, దేవుని మీద ఆధారపడుతూ సంతోషముగా మంచిక్రియలు మనము చేయుచున్నామా? "ఒకడు ఉపచారము చేసిన యెడల దేవుడు అనుగ్రహించు సామర్థ్యమునొంది చేయవలెను. ఇందువలన దేవుడు అన్నిటిలోను యేసుక్రీస్తు ద్వారా మహిమపరచబడును, అని చెప్పబడిన ప్రాముఖ్యమైన ఆజ్ఞ ప్రకారము ప్రజలకు పరిచర్య చేయుచున్నామా" (1పేతురు. 4:11) ?

"విశ్వాసమూలము కానిది ఏదో అది పాపము" (రోమా. 14:23) అని చెప్పే దేవుని వాక్యానికి ప్రత్యుత్తరమేమిత్తుము? మనము చెప్పగలిగినదేమి లేదని నా తలంపు "ప్రతినోరు మూయబడునట్లును.... ధర్మశాస్త్రము చెప్పుచున్న వాటినన్నిటిని ధర్మశాస్త్రమునకు లోనైనవారితో చెప్పుచున్నదని యెరుగుదుము" (రోమా. 3 :19) మనము చెప్పగలిగినదేమి లేదు. అందుకే దేవుని ముందు మన మంచిక్రియలు మన చెడ్డక్రియలు కంటే హెచ్చుగా తూగుతాయని భావించుట మన అవివేకము. క్రీస్తును హెచ్చించే విశ్వాసము మనలో లేకపోతే మనలో ఉన్న మంచి క్రియలు కేవలము తిరుగుబాటును మాత్రమే సూచిస్తాయి.

మంచి క్రియులయందు నమ్మకముంచుట అవివేకమని చెప్పుటకు రెండవకారణము ఏమనగా, ఈ విధముగా దేవుడు మనలను రక్షించుట లేదు. ఒక



వేళ మన చెడ్డక్రియల నుండి కలుగు పర్యవసానము వలన మనము రక్షింపబడినట్లయితే, ఇది అలా జరుగదు కారణమేమంటే అవి మన మంచిక్రియలు కంటే తక్కువ తూగుతాయి. కాని "మన మీద ఋణముగాను మనకు విరోదముగాను నుండిన పత్రమును సిలువకు" కొట్టుట వలన (రక్షణ) వీలు అయినది. వారిక్రియలను లెక్కగట్టుట కంటే, పాపులను రక్షించుటకు దేవుడు పూర్తిగా వెరొకపద్ధతిని కలిగియున్నాడు. కేవలము క్రీస్తు పొందిన శ్రమ మరియు మరణంలో మాత్రమే మనకు నిరీక్షణగలదు.

మన క్రియల తూకము వేయుటలో మనకు రక్షణ లేదు. ఆ చేవ్రాతను కొట్టివేయుట ద్వారా మాత్రమే మనకు రక్షణకలదు. మన చెడ్డక్రియలు (అలాగే లోపము కలిగిన మంచి క్రియలు) యొక్క చేవ్రాత మరియు మనమందరము పొందవలసిన న్యాయపూరితమైన శిక్ష కొట్టివేయబడాలి–తూనిక వేయబడకూడదు. అందువలననే దీనిని నెరవేర్చుటకు క్రీస్తు శ్రమపొంది మరణించెను.

మన క్రియుల వలన వ్రాయబడిన పత్రమును "మేకులతో సిలువకు కొట్టబడినప్పుడు" దాని మీద చేవ్రాత తుడిచివేయబడినది (కొలస్సీ. 2:13). ఈ వ్రాత రూపకమైన పత్రము ఏ విధముగా మేకులతో సిలువకు కొట్టబడినది? తోలు పత్రము సిలువకు కొట్టబడలేదు. క్రీస్తు (సిలువకు) కొట్టబడ్డారు. కాబట్టి నరకానికి నడిపించే నా చెడ్డక్రియల (లేదా మంచిక్రియల) చేవ్రాత క్రీస్తే తుడిచివేస్తాడు. నా రక్షణ కార్యమును పూర్తిగా వెరొక మార్గములో నాకు కల్పించాడు. ఆయనే నా నీరీక్షణ మరియు కేవలము ఆయన యందు విశ్వాసముంచుటయే దేవుని యొద్దకు మార్గమైయున్నది.

యేసు మరణించుటకు హేతువేమనగా :

8

# అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా నుండుటకు

*మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెననెను.*

*మార్కు. 10 : 45*

**పా**పులు రక్షించబడటానికి సాతానుకి మూల్యము చెల్లించినట్లు బైబిలు గ్రంధములో లేదు. క్రీస్తు మరణించినప్పుడు సాతానుకి మూల్యము చెల్లించబడలేదు కాని (వాడు) ఓడించబడినాడు. దేవుని కుమారుడు మనుష్యునిగ వచ్చినందున "మరణము యొక్క బలము గలవానిని, అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేసెను" (హెబ్రీ. 2:14) అక్కడ మరియొక రాజీ విధానము లేదు.

"తన ప్రాణమును విమోచన క్రయధనముగా ఇచ్చుటకు" తాను వచ్చెనని యేసు చెప్పినప్పుడు, ఎవరు మూల్యము పొందుతారన్నది ప్రాముఖ్యము కాదు. దృష్టించవలసిన విషయమేమనగా, తనయొక్క సొంత ప్రాణము మూల్యముగా చెల్లించబడినది మరియు ఆయన పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకు వచ్చుట ద్వారా ఆ మూల్యము అనేకులకు ప్రయోజనకరము అయినది.

ఈ క్రయధనమును ఎవరు పొందియున్నారని మనము అడిగినట్లయితే, నిశ్చయముగా అది దేవుడే అని బైబిలు సమాధానము చెబుతుంది. క్రీస్తు "మనకొరకు తన్నుతాను దేవునికి అర్పణముగాను బలిగాను అప్పగించుకొనెను" అని బైబిలు గ్రంథం చెబుతుంది (ఎఫెసీ. 5:2). క్రీస్తు "తన్నుతాను దేవునికి నిర్దోషినిగా అర్పించుకొనెను" (హెబ్రీ. 9:14). మనము దేవునికి వ్యతిరేఖముగా పాపముచేసి, దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నాము గనుక ప్రత్యమ్నాయముగా మనకొరకు ఒకరు మరణించవలసిన అవసరత ఏర్పడినది (రోమా. 3:23) మరియు మన పాపము వలన, "సర్వలోకము దేవుని శిక్షకు పాత్రమైనది" (రోమా 3:19). గనుక, క్రీస్తు మనకొరకు విమోచన క్రయధనముగా ఇవ్వబడుట వలన, మనము దేవుని యొక్క శిక్షనుండి విమోచించబడియున్నామని బైబిలు గ్రంధము చెబుతుంది. "కాబట్టి ఇప్పుడు క్రీస్తుయేసునందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు (రోమా. 8:1). చివరి బంధకము



అయిన "దేవుని అంత్య తీర్పు" నుండి మనము విడుదల పొందవలసియున్నది (రోమా. 2:2, ప్రకటన. 14:7)

దేవునియొక్క శిక్షకు క్రీస్తు జీవితమే విమోచన క్రయధనమైన మూల్యము. ఆయన జీవించిన జీవితము మాత్రమే కాదు గానీ, మరణము ద్వారా తాను అర్పించిన ప్రాణము. అనేక పర్యాయములు యేసు తన శిష్యులకిట్లు చెప్పెను. "మనుష్య కుమారుడు మనుష్యుల చేతికి అప్పగింప బడుచున్నాడు, వారాయనను చంపెదరు" (మార్కు. 9:31). వాస్తవానికి, యేసు తన్నుతాను "మనుష్య కుమారుడుగా (అరువది ఐదుసార్లు) పిలవబడడానికి ఇష్టపడిన కారణమేమిటనగా, దాని చుట్టూ మానవ ధర్మము గుప్తమైయున్నది. మనుష్యులు మరణించవచ్చు. అందుకే ఆయన వారిలో ఒకరుగా ఉన్నారు. అయితే ఈ విమోచనా క్రయధనము కేవలము మనుష్య కుమారుడు మాత్రమే చెల్లించవలసియున్నది. ఎందుకనగా విమోచన క్రయధనము మరణములో సమర్పించబడిన ఒక జీవితమైయున్నది.

ఈ మూల్యము ఆయన యొద్దనుండి నిర్బంధము చేయబడినది. అనగా, "మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకు వచ్చెనని" చెప్పుటలో ఆయనకు మన పరిచారము అక్కరలేదు అని దాని ఆంతర్యము. ఆయన ఇచ్చువాడు, తీసుకొనేవాడు కాదు. "ఎవడును నా ప్రాణము తీసికొనడు, నా అంతట నేనే దాని పెట్టుచున్నాను (యోహాను. 10:18). మూల్యము ఇష్ట పూర్వకముగానే చెల్లించబడినది, బలవంతము చేయబడలేదు. ఇది మనలను ఆయన ప్రేమలోనికి తీసుకొని వస్తుంది. తన ప్రాణమును ఫణంగా పెట్టి మనలను ఉచితముగా విమోచించుటకు ఎన్నుకొనెను.

ఎంతమంది కొరకు క్రీస్తు విమోచన క్రయధన మాయెను? "అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణమును ఇచ్చుటకు" వచ్చెనని ఆయన చెప్పెను. అయితే అందరూ దేవుని ఉగ్రత నుండి ఈ విమోచన క్రిందకు రాలేకపోవుచున్నారు. కానీ ఈ అవకాశము అందరికీ ఇవ్వబడినది. "దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తియు ఒక్కడే, ఆయన క్రీస్తుయేసను నరుడు. ఈయన అందరికొరకు విమోచన క్రయధనముగా తన్నుతానే సమర్పించుకొనెను. (1 తిమోతి. 2:5-6). క్రీస్తు యొక్క విమోచన క్రయధనము అనే మహాదైశ్వర్యము నుండి కలుగు రక్షణ నుండి ఎవరునూ విడిచిపెట్టబడలేదు.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 9

# మన పాపములను క్షమించుట కొరకు

*ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాదములకు క్షమాపణ మనకు కలిగియున్నది.*

*ఎఫెసీ. 1:7*

*ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము*

*మత్తయి. 26:28*

**ఒ**క ఋణస్తుడను లేదా ఒక నేరమును లేదా ఒక గాయమును మనము క్షమించినప్పుడు అది పరిష్కరించబడుటకు ఎటువంటి చెల్లింపు అవసరము లేదు. ఒక వేళ ఆ విధముగా (చెల్లించబడితే) అది క్షమాపణకు విరుద్ధము. మనము దేనినైతే నష్టపోయామో దానికి నష్టపరిహారము ఇవ్వబడినట్లయితే అక్కడ క్షమాపణకు తావులేదు. ఎందుకంటే మనకు కావలసినది పొందుకున్నాము.

క్షమాపణ కృపను తెచ్చుచున్నది. ఒక వేళ నేను నీవలన గాయపర్చబడినట్లయితే, కృప దానిని పోనిచ్చును. నేను వ్యాజ్యెమాడుట లేదు. నేను నిన్ను క్షమించాను. ఒకరికి యోగ్యత లేనప్పటికీ కృప దానినిస్తుంది. అందుకే క్షమాపణలో ఇచ్చుట ఉన్నది. క్షమాపణ అంటే మనము (ఆశించి) ఇచ్చేదికాదు. అంటే పొందుకొనే హక్కును కూడ విడచిపెట్టుకొనుట.

మనము క్రీస్తులో విశ్వాసముంచినప్పుడు దేవుడు చేసే కార్యము అదే, "ఆయనయందు విశ్వాసముంచువాడెవడో వాడు ఆయన నామము మూలముగా పాపక్షమాపణ పొందును" (అపో.కా.10:43). క్రీస్తులో మనము విశ్వాసముంచితే, మనకు వ్యతిరేకముగానున్న పాపములను ఎత్తి పట్టుకొనడు. ఇదే సాక్ష్యమును దేవుడిచ్చుచున్నాడు. "నేను నేనే నా చిత్తాను సారముగా నీ యతిక్రమములను తుడిచివేయు చున్నాను"(యెషయా. 43:25). పడమటికి తూర్పు ఎంత దూరమో ఆయన మన అతిక్రమములను మనకు అంత దూరపరచియున్నాడు" (కీర్తనలు. 103:12)

కాని ఇక్కడ ఒక సమస్య ఎదురౌతుంది. కేవలము క్షమాపణ మాత్రమే సరిపోదని మదందరికి తెలుసు. చేసిన గాయము (లేదా నష్టము) గొప్పదైనప్పుడు – హత్య లేదా అత్యాచారము లాంటిది అయినప్పుడు, దీనిని మనము స్పష్టముగా చూడగలము. ఒక



వేళ న్యాయాదిపతులు (లేదా దేవుడు) ప్రతి నరహంతకుడు మరియు అత్యాచారము చేయు వారితో "నీవు చేసిన దానికి దుఃఖపడుచున్నావా? అలాగైతే ప్రభుత్వము నిన్ను క్షమించింది. నీవు వెళ్ళవచ్చు" అని చెప్పినట్లయితే సమాజముకానీ, ప్రపంచము కానీ ఉనికిలో ఉండవు. ఇటువంటి సందర్భములలో బాదితుడు ఒకవేళ క్షమించే మనస్సు కలిగి యుండినప్పటికి, ప్రభుత్వము మాత్రము న్యాయమును పరిత్యజింపలేదు.

కాబట్టి ఇది యొక్క న్యాయతీర్పుతో ముడిపడిఉంది. ప్రతీ పాపము చాలా తీవ్రమైనది, ఎందుకంటే అది దేవునికి వ్యతిరేఖము (1వ భాగము చూడండి). మనము ఆయనను మరుగుచేసినపుడు లేదా అవిధేయత చూపినపుడు లేదా దూషించినప్పుడు దేవుని మహిమకు హాని (నష్టం) జరగుతుంది. ఒక మానవ న్యాయాదిపతి నేరస్తుల యొక్క నేరములను రద్దుచేసినట్లు, ఆయన న్యాయము మనలను అంత సులువుగా విడచిపెట్టదు. ఆయన మహిమకు కలిగిన నష్టము తప్పనిసరిగా సరిచేయబడాలి. అందువలన న్యాయము జరిగించుటలో ఆయన మహిమ మహాతేజస్సుతో ప్రకాశిస్తుంది. మరియు నేరస్తులమైన మనము సునాయాసంగా క్షమించబడి, దేవదూషణ చేసేవారు విడిచిపెట్టబడుతూ ఉంటే, దేవుని యొక్క ఘనతను ఎత్తిపట్టుట ఒక నాటకీయమైనదిగా ఋజువౌతుంది.

అందుకే క్రీస్తు శ్రమపొంది మరణించెను. "ఆ ప్రియుని యందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫెసీ. 1:7). క్షమాపణ వలన మనకు ఖర్చయినది ఏమీ లేదు. మనము క్షమించబడుతూ ఉండుట, మన ఖరీదైన విధేయతకు ఫలము మాత్రమే, వేరు కాదు. అందుకే దానిని కృప అని పిలుచుచున్నాము. కానీ యేసు యొక్క జీవితమునే దానికి ధారపోయవలసి వచ్చినది. అందుకే దానిని న్యాయవంతమైనదని పిలచుచున్నాము. ఆహా దేవుడు మన పాపములను మనకు వ్యతిరేఖముగా పట్టి ఉంచుట లేదన్న విషయము ఎంత ప్రశస్తమైనది! దేవుడు ఈ విధముగా చేయులాగున తన రక్తముచేత దీనిని సాధ్యపరచిన ఆ క్రీస్తు ఎంత సౌందర్యవంతుడు.

## యేసు మరణించుటకు హేతు వేమనగా :

# 10

# మన నీతికి ఆధారము నిచ్చుటకు

*ఆయన రక్తమువలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి*
*రోమా. 5:9.*

*కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు.*
*రోమా. 3:24*

*కాగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు లేకుండ విశ్వాసము వలననే మనుష్యులు నీతిమంతులుగా తీర్చబడుచున్నారని యెంచుచున్నాము.*
*రోమా. 3:28*

**దే**వుని ముందు నీతిమంతులుగా తీర్చబడుట మరియు దేవునిచే క్షమించబడుట అనేవి రెండూ సారూప్యమైనవి కావు. న్యాయస్థానములో నీతిమంతులుగా తీర్పు తీర్చబడుట, క్షమించబడుతూ ఉండటము లాంటిది కాదు. క్షమించబడటం అనగా, నేను నేరారోపణ చేయబడ్డాను కాని నా నేరము పరిగణలోనికి తీసుకొనబడలేదు. నీతిమంతులుగా తీర్చబడటం అనగా, నేను పరిశోధించబడి నిరపరాధిగా యెంచబడుట. నా వాదన సరియైనది. నేను నిర్దోషినని నిరూపించబడ్డాను. న్యాయాధిపతి "నిరపరాధి" అని చెప్పాడు.

నీతిమంతులుగా చేయబడుట చట్టబద్ధమైన కార్యము. దాని అర్థం, ఒకరు సరిగ్గా ఉన్నారు అని ప్రకటించుట ఇది న్యాయ తీర్పు. నీతిమంతులుగా యున్నారని చెప్పబడిన తీర్పు ఆ వ్యక్తిని నీతిమంతునిగా మార్చదు. కాని ఒక వ్యక్తి నీతిమంతుడని అది ప్రకటిస్తుంది. నిజంగా ఒక వ్యక్తి నీతిమంతుడైయున్న దాని మీద ఇది ఆధారపడి యుంటుంది. యేసు బోధను వినిన తరువాత ప్రజలు "దేవునిని న్యాయవంతుడని" ఒప్పుకొనిరి అని బైబిలు గ్రంథము చెబుతున్నప్పుడు ఈ విషయాన్ని మనము స్పష్టముగా అర్థం చేసుకొనవచ్చును (లూకా. 7:29). వారు దేవునిని న్యాయవంతునిగా చేసారు (ఆయన ఎల్లప్పుడు న్యాయవంతుడే) అని దాని అర్థం కాదు. అయితే, దేవుడు న్యాయవంతుడని వారు ప్రకటించారు (లేదా ఒప్పుకున్నారు) అని దాని అర్థం.

క్రీస్తునందు నమ్మకముంచినప్పుడు మనలో కలిగిన పరివర్తన నీతిమంతులుగా తీర్చబడటం కాదు సుమా. బైబిలు గ్రంథము దానిని శుద్ధీకరించబడుట అని పిలుస్తుంది.



మనము మంచివారుగా మారే ప్రక్రియ. నీతిమంతులుగా తీర్చబడుట అనునది అటువంటి ప్రక్రియకాదు. అది అసలు ఏ మాత్రం ఒక ప్రక్రియ కాదు. ఇది ఒక్క క్షణములోనే ఇవ్వబడిన ప్రకటన (లేదా తీర్పు) నిరపరాధి! నీతిమంతుడు! అని చెప్పే న్యాయతీర్పు.

మానవ న్యాయస్థానములో సామాన్యంగా చట్టమును ఆచరించుట ద్వారా నీతిమంతులుగా తీర్చబడతారు. అటువంటి సందర్భంలో న్యాయసభ లేదా న్యాయాధిపతి నీవు ఏమైయున్నావో దానిని ప్రకటిస్తారు. నీవు న్యాయమును కలిగియున్నావు. వారు నీకు తీర్పు తీర్చుతారు. అయితే దేవుని న్యాయసభలో మనము ఆ విధంగా న్యాయాన్ని కలిగి లేము. అందువలన, నీతిమంతులుగా తీర్చబడుట అనేది సామాన్య పరిభాషలో "నిరీక్షణ లేని స్థితి" యైయున్నది. బైబిలు గ్రంథము ఈ విధముగా చెబుతుంది, " దుష్టులు నిర్దోషులని తీర్పుతీర్చువాడు యెహోవాకు హేయులు"(సామెతలు. 17:15). అయినప్పటికీ, ఆశ్చర్యకరమైన రీతిలో క్రీస్తును బట్టి ఆయన కృపయందు నమ్మకముంచిన "భక్తిహీనులను నీతిమంతులుగా" దేవుడు తీర్చుచున్నాడు (రోమా. 4:5). హేయమైనదిగా కనిపించిన దానిని కూడ ఆయన క్షమించుచున్నాడు.

అది ఎందుకు హేయమైనది కాదు ? లేదా బైబిలు గ్రంథము చెబుతున్నట్లు, కేవలము "యేసు నందు విశ్వాసము గలవానిని నీతిమంతునిగా" దేవుడు ఎందుకు తీర్పుతీర్చుచున్నాడు? (రోమా. 3:26). ఆయనలో విశ్వాసముంచు భక్తిహీనులకు నీతిమంతులుగా తీర్చుట దేవునికి హేయము కాదు అనుటకు రెండు కారణములు కలవు. మొదటిది, మన పాపము యొక్క నేరమును రద్దు చేయుటకు క్రీస్తు తన రక్తమును చిందించెను. అందువలన ఈ విధంగా చెప్పబడుతుంది, "కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులుగా తీర్చబడి" (రోమా. 5:9). కాని అది కేవలము మన అపరాదమును తొలగిస్తుంది. అది మనలను నీతిమంతులుగా ప్రకటించుట లేదు. న్యాయము జరిగించుటలో మన ఓటమిని రద్దు చేయుట అంటే మనలను న్యాయము కలిగియున్న వానిగా ప్రకటించుట కాదు. ఒక ఉపాధ్యాయుడు, పరీక్షలలో ఉత్తీర్ణత కాని గ్రేడు 'ఎఫ్'ను రద్దు చేసాడంటే వానికి అధిక ఉత్తీర్ణత గల 'ఎ' గ్రేడును ప్రకటించాడని అర్థం కాదు. ఒక వేళ నా ఋణములను (అప్పులను) నా బ్యాంకు వారు నా ఖాతా నుండి రద్దు చేస్తున్నారంటే, వారు నన్ను ధనికునిగా ప్రకటిస్తున్నట్లు కాదు. అలాగే మన పాపములను రద్దు చేయబడుట అంటే మనలను నీతిమంతులుగా తీర్చుట అని కాదు. రద్దు చేయటం జరగాలి. అది నీతిమంతులుగా తీర్చబడడానికి ఆవశ్యకమే. అయితే అక్కడ ఇంకా ఎక్కువ సంగతి ఉంది. విశ్వాసముంచుట వలన భక్తిహీనులను నీతిమంతులుగా తీర్పు తీర్చుట దేవునికి హేయము కాదు అనుటకు అక్కడ మరియొక కారణము కూడా ఉంది. దానిని చూచుటకు తరువాత పాఠంలోకి వెళ్ళుదము.

యేసు మరణించుటకు హేతువేమనగా :

# 11

# తన విధేయత ద్వారా మనలను నీతిమంతులుగా చేయుటకు

*మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తాను తగ్గించుకొనెను.*

*ఫిలిప్పీ. 2:8*

*ఏలయనగా ఒక మనుష్యుని అవిధేయత వలన అనేకులు పాపులుగా ఏలాగు చేయబడిరో, ఆలాగే ఒకని విధేయతవలన అనేకులు నీతిమంతులుగా చేయబడుదురు.*

*రోమా. 5 :19*

*ఎందుకనగా మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను.*

*2 కొరింథీ. 5 :21*

*ధర్మశాస్త్ర మూలమైన నా నీతిని గాక, క్రీస్తునందలి విశ్వాసము వలననైన నీతి అనగా విశ్వాసమును బట్టి దేవుడు అనుగ్రహించు నీతిగలవాడనై....*

*ఫిలిప్పీ. 3 : 9*

**కే**వలము మన యొక్క అనీతిని కొట్టివేయడము వలన మాత్రమే నీతిమంతులుగా తీర్చబడుదమని కాదు. అది క్రీస్తు యొక్క నీతి నా యందు మోపబడుటయైయున్నది. దేవుని మెప్పించే నీతి నేను కలిగిలేను. దేవుని యెదుట నేను ఒప్పుకొనిన దేమంటే "ధర్మశాస్త్ర మూలమైన నా నీతిని గాక, క్రీస్తునందలి విశ్వాసము వలననైన నీతి" (ఫిలిప్పీ. 3:9)

ఇది క్రీస్తు యొక్క నీతియైయున్నది. అది నాయందు మోపబడినది. అనగా, నీతియావత్తు క్రీస్తు నాకొరకు సంపూర్ణము చేసి, ఆయన యందు విశ్వాసముంచుట వలన ఆ నీతిని నా యందు మోపాడని దాని అర్థము. ఆ విధముగా నేను నీతిమంతునిగా తీర్చబడుతున్నాను. క్రీస్తు యొక్క పరిపూర్ణమైన నీతిని చూచి, ఆయన నీతిమత్వమును నా నీతిమత్వముగా దేవుడు ప్రకటించాడు.



అందువలన, భక్తిహీనులను నీతిమంతులుగా దేవుడు తీర్చుటకు రెండు కారణములు కలవు. (రోమా. 4:5). మొదటిది, క్రీస్తు యొక్క మరణము మన అవినీతి ఋణమును తీర్చియున్నది (ముందు అధ్యాయము చూడండి). రెండవది, క్రీస్తు యొక్క విధేయత మనలను దేవుని సముఖములో నీతిమంతులుగా చేయుచున్నది. నిత్యజీవము లోనికి ప్రవేశించుటకు, కేవలము మనయొక్క అనీతి రద్దుచేయబడుట మాత్రమే కాదు దేవుడు కోరేది, కానీ మన యొక్క పరిపూర్ణమైన నీతి స్థాపించబడాలి.

క్రీస్తు పొందిన శ్రమ మరియు మరణము ఈ రెండింటికి మూలమై యున్నది. ఆయన పొందిన శ్రమ మన యొక్క అనీతికి ఆవశ్యకమైయున్నది. "మన యతిక్రమ క్రియలనుబట్టి అతడు గాయపరచబడెను, మన దోషములను బట్టి నలుగగొట్టబడెను" (యెషయా. 53:5). మరియు ఆయన శ్రమ, మరణము విధేయతను పరిపూర్ణము చేసి, మనకు ఆధారమైన నీతిని కలుగజేయు చున్నది. ఆయన "మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత" చూపెను (ఫిలిప్పీ. 2:8). ఆయన మరణము ఆయన విధేయతకు శిఖరాగ్రమైయున్నది. అందుకే బైబిలు గ్రంథము ఈ విధముగా చెబుతుంది. "ఒకని విధేయతవలన అనేకులు నీతిమంతులుగా చేయబడుదురు"(రోమా. 5:19)

అందువలన, క్రీస్తు యొక్క మరణము మనము క్షమించబడుటకు మరియు పరిపూర్ణులుగా తీర్చబడుటకు ఆధారమైయున్నది. "మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను (దేవుడు) మనకోసము పాపముగా చేసెను" (2 కొరింథీ. 5:21). పాపము లేని క్రీస్తును పాపముగా చేసెను అనగా అర్థము ఏమిటి? అనగా మనపాపము ఆయన యందు మోపబడినది, అందువలన ఆయన మనకు క్షమాపణ అయ్యెను. అలాగే (పాపులమైన) మనము క్రీస్తులో దేవుని నీతి అగుట అనగా అర్థమేమిటి? క్రీస్తు యొక్క నీతి మనయందు మోపబడినది. అందువలన ఆయన మన పరిపూర్ణతయై యున్నాడు.

తాను పొందిన శ్రమ, మరణము వలన క్రీస్తు సాధించిన కార్యము అనగా మన పాపము క్షమించబడుటకు, మనము నీతిమంతులమగుటకు ఆయన చేసిన కార్యమునుబట్టి ఆయన ఘనపరచబడును గాక! ఆయన నెరవేర్చిన ఈ మహాకార్యములనుబట్టి ఆయనను శ్లాఘించుదము, సొత్తుగా స్వీకరించుదము మరియు ఆయన యందు నమ్మకముంచెదము.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 12

# మన యొక్క శిక్షావిధిని తొలగించుటకు

*శిక్ష విధించువాడెవడు? చనిపోయిన క్రీస్తుయేసే; అంతేకాదు, మృతులలో నుండి లేచినవాడను దేవుని కుడిపార్శ్వమున ఉన్నవాడును మనకొరకు విజ్ఞాపనము కూడ చేయువాడును ఆయనే.*

*రోమా. 8:34*

**క్రీ**స్తు యొక్క శ్రమ, మరణములకు మహాగొప్ప ముగింపు ఇదే : "కాబట్టి యిప్పుడు క్రీస్తుయేసునందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు"(రోమా. 8:1). "క్రీస్తుయేసునందు" అనగా, విశ్వాసము ద్వారా ఆయనతో సంబంధమును కలిగియుండుట. క్రీస్తు నందు విశ్వాసము క్రీస్తుతో ఐక్యము చేస్తుంది అందువలన, ఆయన మరణము మన యొక్క మరణమౌతుంది మరియు ఆయన సంపూర్ణత మన యొక్క సంపూర్ణత అవుతుంది. క్రీస్తు మన శిక్షను భరించెను (ఇంకను మనము భరించవలసిన అవసరం లేదు) మరియు ఆయన మన పరిపూర్ణత ఆయెను (ఇది మనము చేయలేము).

దేవునితో ఎంతమేరకు మనము అంగీకరించబడ్డామన్నది విశ్వాసము కాదు. అది కేవలము క్రీస్తు మాత్రమే. విశ్వాసము క్రీస్తుతో మనలను ఐక్యపర్చుతుంది. కావున ఆయన నీతి మనయొక్క నీతి అవుతుంది. "మనుష్యుడు యేసు క్రీస్తునందలి విశ్వాసము వలననే గాని ధర్మశాస్త్రసంబంధమైన క్రియల మూలమున నీతిమంతుడుగ తీర్చబడడని యెరిగి మనమును ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలమూలమున గాక క్రీస్తునందలి విశ్వాసము వలననే నీతిమంతులమని తీర్చబడుటకై యేసు క్రీస్తునందు విశ్వాసముంచి యున్నాము, ధర్మశాస్త్ర సంబంధ క్రియలమూలమున ఏ శరీరియు నీతిమంతుడని తీర్చబడడు గదా." (గలతీ. 2:16) "విశ్వాసము ద్వారా నీతిమంతులముగా" తీర్చబడుట మరియు "క్రీస్తులో నీతిమంతులుగా" (గలతీ. 2:17) తీర్చబడుట రెండూ సమాంతర పదములు. మనము విశ్వాసము ద్వారా క్రీస్తులో ఉన్నాము, అందువలన నీతిమంతులుగా తీర్చబడినాము.

"మనకు శిక్షావిధి కలుగజేయు వాడెవడు?" అని ప్రశ్నించబడినప్పుడు సమాధానము నిశ్చయముగా ఉంది. ఎవరూ లేరు! అప్పుడు మూలాంశము ఇట్లు ప్రకటించుచున్నది. "చనిపోయిన క్రీస్తుయేసే" క్రీస్తు యొక్క మరణము శిక్షావిధి నుండి



మన స్వాతంత్ర్యమును భద్రము చేయుచున్నది. క్రీస్తు మరణించినంత నిశ్చయముగా మనము కూడా నిశ్చయముగా శిక్షావిధిని పొందము. దేవుని సన్నిధిలో రెండింతల అపాయము మనకు లేదు. ఒక నేరము కొరకు రెండుసార్లు మనము శిక్షించబడము. మనపాపముల కొరకు క్రీస్తు ఒక్కసారే మృతిపొందెను. ఇంక వాటి విషయంలో మనము శిక్షావిధి పొందము. అటువంటి ఒక శిక్ష లేనందువలన శిక్షావిధి తొలగించబడలేదు కానీ, అది ఇప్పటికే నెరవేర్చబడినది.

అయితే ఈ లోకము యొక్క శిక్షావిధిని గూర్చిన సంగతి ఏమిటి? "మనకు శిక్ష విధించు వాడెవడు" అనే ప్రశ్న దానికి సమాధానము కాదా? ఈ లోకము క్రైస్తవులను శిక్షించుచున్నదా? అనేక మంది హతసాక్షులున్నారు. ఎవరూ విజయవంతముగా మనకు శిక్షావిధిని కలుగజేయలేరు అనేది దీనికి జవాబు. వారు నేరము మోపగలుగుతారు కానీ అవి అంత్యము వరకు నిలువవు. " దేవుని చేత ఏర్పర్చబడిన వారిమీద నేరము మోపువాడెవడు? చనిపోయిన క్రీస్తుయేసే" (రోమా. 8:33). ఇదే ప్రకారము బైబిలు ఈ విధముగా అడుగుతుంది "క్రీస్తు ప్రేమనుండి మనలను ఎడబాపు వాడెవడు? శ్రమయైనను బాధయైనను హింసయైనను కరవైనను వస్త్రహీనతయైనను ఉపద్రవమైనను ఖడ్గమైనను మనలను ఎడబాపునా?" (రోమా. 8:35). ఇటువంటి పరిస్థితులు క్రైస్తవులకు రావని దాని అర్థము కాదు. ఇచ్చట జవాబు ఏమిటంటే "మనలను ప్రేమించినవాని ద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము" (రోమా. 8:37)

ఈ లోకము తన యొక్క శిక్షావిధిని తీసుకువస్తుంది. వారి ఖడ్గమును కూడా మన వైపునకు తిప్పెదరు. అయితే అన్నింటికంటే ఉన్నతమైన న్యాయస్థానము మనకు అనుకూలముగా తీర్పునిచ్చునని మనమెరుగుదుము. "దేవుడు మన పక్షముననుండగా మనకు విరోధియెవడు? (రోమా. 8:31). ఎవరూ లేరు. వారు మనలను తృణీకరిస్తారు, ఆయన మనలను అంగీకరిస్తారు. ఒక వేళ వారు మనలను ద్వేషించినా, ఆయన మనలను ప్రేమించును. వారు మనలను బందించినా, మన ఆత్మలను ఆయన విడుదల చేస్తాడు. వారు మనలను బాదిస్తే, ఆయన మనలను అగ్నిద్వారా శుద్ధిచేస్తాడు. వారు మనలను చంపితే, ఆయన దానిని పరలోకానికి మార్గముగా చేస్తాడు. వారు మనలను ఓడించలేరు. క్రీస్తు మరణించాడు. క్రీస్తు పునరుద్ధానమయ్యాడు. ఆయనలో మనము సజీవులము. మరియు ఆయన యందు ఏ శిక్షావిధియు లేదు. మనము క్షమించబడ్డాము మరియు నీతిమంతులుగా తీర్చబడ్డాము. "నీతిమంతులు సింహామువలె ధైర్యముగా నుందురు"(సామెతలు. 28:1).

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 13

# రక్షణకు ఆధారము కలుగునట్లు సున్నతి మరియు ఆచారములను రద్దు చేయుటకు

*సహోదరులారా, సున్నతిపొందవలెనని నేనింకను ప్రకటించుచున్నయెడల... ఆ పక్షమున సిలువవిషయమైన అభ్యంతరము తీసివేయబడును గదా?*

*గలతీ. 5:11*

*శరీర విషయమందు చక్కగా అగపడగోరువారెవరో వారు తాము క్రీస్తు యొక్క సిలువవిషయమై హింసపొందకుండుటకు మాత్రమే సున్నతి పొందవలెనని మిమ్మును బలవంతము చేయుచున్నారు.*

*గలతీ. 6:12*

**ఆ**ది సంఘములో సున్నతి యొక్క ప్రాధాన్యతను గూర్చి గొప్ప వివాదము ఉండేది. ఆదికాండము. 17:10లో దేవుడు దానిని ఆజ్ఞాపించినప్పటి నుండి దానికి విస్తృతమైన, గౌరవప్రదమైన స్థానము బైబిలు గ్రంథములో కలదు. క్రీస్తు ఒక యూదుడు. తన యొక్క పన్నెండు మంది అపొస్తులులు కూడా యూదులే. మొట్టమొదటగా క్రైస్తవత్వమును వెంబడించినది కూడ సుమారుగా అందరూ యూదులే. క్రైస్తవ సంఘము యొక్క బైబిలు గ్రంథములో యూదుల యొక్క లేఖనములు బాగమైయున్నవి. యూదుల యొక్క ఆచారసాంప్రదాయాలు క్రైస్తవ సంఘములోకి వచ్చాయి అనుట అతిశయోక్తి కాదు.

అవి (సాంప్రదాయాలు) వచ్చాయి. వాటితో పాటు వివాదమును కూడా తీసుకువచ్చాయి. సిరియాలోని అంతియొకయ వంటి యూదేతర పట్టణాలలో క్రీస్తు సందేశము వ్యాపించింది. అన్యులు క్రీస్తునందు విశ్వాసముంచారు. ఇప్పుడు ఈ ప్రశ్న అత్యవరసరమయినది. సున్నతిలాంటి ఆచారమునకు సువార్త సత్యమును ఏ విధముగా జోడించగలము? ఆయునలో మీరు విశ్వాసముంచినట్లయితే మీ పాపములు క్షమించబడతాయి, మీరు దేవుని యొదుట నీతిమంతులుగా తీర్చబడుదురు, మీ కొరకు దేవుడున్నాడు. నీకు నిత్యవజీవము ఉంది–అనే ఈ క్రీస్తు సువార్తను ఆచారములకు ఏ విధముగా వర్తింపజేయగలము?

క్షమాపణ మరియు విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుటను గూర్చి అపోస్తులులు అన్యుల మధ్యలో ప్రకటించుచున్నారు. ''ఆయున యందు విశ్వాసముంచువాడెవడో వాడు ఆయన నామమును మూలముగా పాపక్షమాపణ పొందునని



ప్రవక్తలందరు ఆయననుగూర్చి సాక్ష్యమిచ్చుచున్నారని" పేతురు ప్రకటించెను. (అపో.కా. 10:43). "కాబట్టి సహోదరులారా, మీకు ఈయన ద్వారానే పాపక్షమాపణ ప్రచురమగుచున్నదనియు, మీరు మోషే ధర్మశాస్త్రము వలన ఏ విషయములలో నీతిమంతులుగా తీర్చబడలేకపోతిరో ఆ విషయములన్నిటిలో, విశ్వసించుప్రతివాడును ఈయన వలననే నీతిమంతుడుగా తీర్చబడుననియు మీకు తెలియుగాక" (అపో.కా. 13:38–39) అని పౌలు ప్రకటించెను.

అయితే సున్నతిని గూర్చిన సంగతి ఏమిటి? యెరుషలేములో ఉన్న కొంతమంది అది అవసరమని ఆలోచిస్తున్నారు. ఈ వివాదము అంతియొకయలో తీవ్రస్థాయికి వచ్చినది. "కొందరు యూదయనుండి వచ్చి–మీరు మోషే నియమించిన ఆచారము చొప్పున సున్నతి పొందితేనేగాని రక్షణ పొందలేరని సహోదరులకు బోధించిరి" (అపో.కా.15:1) అంతట ఒక సమావేశము ఏర్పాటు చేయబడినది మరియు ఈ అంశము తర్కించబడినది.

> *"...కొందరు లేచి, అన్యజనులకు సున్నతి చేయింపవలెననియు, మోషే ధర్మశాస్త్రమును గైకొనుడని వారికి ఆజ్ఞాపింపవలెననియు చెప్పిరి... పేతురు లేచి వారితో ఇట్లనెను–సహోదరులారా, ఆరంభమందు అన్యజనులు నానోట సువార్త వాక్యము విని విశ్వసించులాగున మీలో నన్ను దేవుడేర్పరచుకొనెనని మీకు తెలియును. మరియు హృదయములను ఎరిగిన దేవుడు మనకు అనుగ్రహించినట్టుగానే వారికిని పరిశుద్ధాత్మను అనుగ్రహించి, వారిని గూర్చి సాక్ష్యమిచ్చెను. వారి హృదయములను విశ్వాసము వలన పవిత్రపరచి మనకును వారికిని ఏ భేదమును కనుపరచలేదు. గనుక మన పితురులైనను మనమైనను మోయలేని కాడిని శిష్యుల మెడమీద పెట్టి మీరెందుకు దేవుని శోధించుచున్నారు? ప్రభువైన యేసు కృపచేత మనము రక్షణ పొందుదుమని నమ్ముచున్నాము గదా? అలాగే వారును రక్షణ పొందుదురు అనెను.(అపో.కా. 15:5–12)*

ఈ వివాదములో ఇమిడియున్న లోతైన విషయమును అపోస్తులుడైన పౌలుకంటే ఎవరూ స్పష్టముగా చూడలేదు. క్రీస్తు పొందిన శ్రమ మరియు మరణము యొక్క అర్థానికి ఇది సవాలుగా మారినది. దేవుని ముందు నీతిమంతులగుటకు క్రీస్తులో విశ్వాసము మాత్రమే ఉంచితే సరిపోతుందా? లేక అక్కడ సున్నతియొక్క అవసరత కూడా ఉందా? దీనికి జవాబు చాలా స్పష్టముగా ఉంది. ఒక వేళ పౌలు సున్నతిని గూర్చి ప్రకటించిన యెడల "సిలువ విషయమైన అభ్యంతరము తీసివేయబడును" (గలతీ. 5:11). ఆచారముల యొక్క బందకములనుండి విముక్తిని కలుగజేయడమే సిలువ యొక్క అర్థము.'' ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి, క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసియున్నాడు. కాబట్టి మీరు స్థిరముగా నిలిచి మరల దాస్యమను కాడిక్రింద చిక్కు కొనకుడి" (గలతీ.5:1).

యేసు మరణించుటకు హేతువేమనగా :

# 14

# మనలను విశ్వాసములోనికి తెచ్చి, నమ్మకస్తులుగా నుంచుటకు

*ఇది నిబంధనవిషయమై అనేకులకొరకు చిందింపబడుచున్న నారక్తము*
*మార్కు. 14:24*

*నేను వారికి మేలు చేయుట మానుకుండునట్లు నిత్యమైన నిబంధనను వారితో చేయుచున్నాను, వారు నన్ను విడువకుండునట్లు వారి హృదయములలో నా యెడల భయభక్తులు పుట్టించెదను.*
*యిర్మియా. 32:40*

**బై**బిలు గ్రంధము ఒక "పాత నిబంధన" గూర్చి మరియు ఒక "క్రొత్త నిబంధన" గూర్చి చెబుతుంది. నిబంధన అనే పదము ఒక సంస్కారమును సూచిస్తుంది, ఇందులో ఇరువర్గాలు కొన్ని బాధ్యతలు ఒకరికిఒకరు చేయుటకు ఒడంబడిక ద్వారా కట్టుబడి ఉంటారు. బైబిలు గ్రంధములో దేవుడు తనంతటతానే మనషితో నిబంధన చేసాడు. ఆయన షరతులను విధించాడు. ఆయన కార్యములు ఆయన ఉద్ధేశ్యముల చేత నడిపించబడతాయి.

మోషే ధర్మశాస్త్రమును బట్టి దేవుడు ఇశ్రాయేలుతో చేసిన ఒడంబడికను "పాతనిబంధన" సూచిస్తుంది. అది ఆత్మసంబంధమైన పరివర్తనను కలిగించక పోవడమే దాని యొక్క బలహీనత. అందువలన దానికి వారు విధేయులు కాలేదు మరియు అది వారికి జీవమును ఇవ్వలేదు. అది రాతిపలకల మీద అక్షర రూపములో వ్రాయబడినది, కానీ ఆత్మపూరితముగా వారి హృదయములలో వ్రాయబడలేదు. అయితే దీనికి వేరైన "కొత్త నిబంధన" గూర్చి ప్రవక్తలు వాగ్దానము పలికిరి. అది అక్షరము కాదుగాని ఆత్మ. "అక్షరము చంపును గాని ఆత్మ జీవింపచేయును" (2 కొరింథీ. 3:6).

స్వాభావికముగా క్రొత్తనిబంధన పాతనిబంధన కంటే ప్రభావవంతమైనది. యేసు పొందిన శ్రమ, మరియు మరణముల యొక్క పునాదిమీద అది పని చేయుచున్నది. "ఆయన క్రొత్త నిబంధనకు మధ్యవర్తియై యున్నాడు." (హెబ్రీ. 9:15). ఆయన రక్తము "నిబంధన విషయమై అనేకుల కొరకు చిందింపబడినదని" యేసు చెప్పెను (మార్కు. 14:24) అనగా యేసు యొక్క రక్తము క్రొత్త నిబంధన యొక్క శక్తిని మరియు వాగ్దానమును క్రయము చేసినదని దాని అర్థము. అట్లు చేయుటకు క్రీస్తు



మరణించినందున, ఇది ఎంతో ప్రభావము కలిగి యున్నది.

అయితే తన యొక్క రక్తము వలనైన అమూల్యమైన నిబంధన షరతులు ఏమిటి? ప్రవక్త అయిన యిర్మియా ఈ విధముగా వివరిస్తున్నాడు, "ఇదిగో నేను వారితో...క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి... వారితో చేయు నిబంధనయిదే, వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను, వారి హృదయము మీద దాని వ్రాసెదను.... నేను వారి దోషములను క్షమించి వారి పాపములను ఇక నెన్నడును జ్ఞాపకము చేసికొనను" (యిర్మియా. 31:31-34). క్రీస్తు పొందిన శ్రమ మరియు మరణము ప్రజలలో అంతరంగిక మార్పును (హృదయములలో వ్రాయబడినది) మరియు వారి పాపములకు క్షమాపణ విధిగా కలిగించును.

నిబంధనను ప్రజలు తప్పిపోకుండా క్రీస్తు తనంతటతానుగా మనలో విశ్వాసమును కలిగించి తన ప్రజల యొక్క నమ్మకత్వమును భద్రపర్చుచున్నాడు. రాతిపలకల మీద కాకుండా, వారి యొక్క హృదయములమీద ధర్మవిధిని వ్రాయుట ద్వారా క్రొత్త నిబంధన ప్రజలను ఆయన ఉనికిలోనికి తెచ్చుచున్నాడు. రాతిపలక మీద వ్రాయబడిన "అక్షరము"నకు బదులుగా "జీవింపచేయు ఆత్మ"ను గూర్చి ఆయన చెబుతున్నాడు (2 కొరింథీ. 3:6). "మన అపరాధముల చేత చచ్చినవారమై యుండినప్పుడు (దేవుడు) మనలను క్రీస్తుతో కూడ బ్రతికించెను. (ఎఫెసీ. 2:5). ఇది క్రీస్తు యొక్క మహిమ యందు విశ్వాసముంచి, చూడగలగునట్లు చేయుచున్న ఆత్మ సంబంధమైన జీవితము. ఈ అద్భుతము క్రొత్త నిబంధన ప్రజలను తయారుచేయుచున్నది. క్రీస్తు తన స్వర్తకముతో వెలపెట్టికొనియున్నారు కనుక ఇది మరింత నిశ్చయము మరియు నమ్మతగినది.

మరియు అద్భుతమేమనగా, మనలో విశ్వాసము కలిగించుట మాత్రమే కాదుగాని, మన నమ్మకత్వమును భద్రముచేయుట. "నేను వారికి మేలు చేయుట మానుకుండునట్లు నిత్యమైన నిబంధనను వారితో చేయుచున్నాను. వారు నన్ను విడువకుండునట్లు వారి హృదయములలో నా యెడల భయభక్తులు పుట్టించెదను."(యిర్మియా. 32:40). క్రీస్తు మరణించుట వలన, ప్రజల హృదయములలో కార్యము చేయుట మాత్రమే కాదు గానీ, నూతన బద్రతను కలుగజేసెను. వారు ఆయనను విడువకుండునట్లు చేయును. ఆయన వారిని సంరక్షించును. వారు బద్రపర్చబడుదురు. నిబంధన రక్తము దీనికి నిశ్చయత నిచ్చుచున్నది.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 15

# మనలను పరిశుద్ధులుగాను, నిందారహితులుగాను మరియు సంపూర్ణులుగా చేయుటకు

*ఒక్క అర్పణచేత ఈయన పరిశుద్ధపరచబడు వారిని సదాకాలమునకు సంపూర్ణులనుగా చేసియున్నాడు.*

*హెబ్రీ. 10:14*

*తన సన్నిధిని పరిశుద్ధులుగాను నిర్దోషులుగాను నిరపరాధులుగాను నిలువబెట్టుటకు ఆయన మాంసయుక్తమైన దేహమందు మరణము వలన ఇప్పుడు మిమ్మును సమాధానపరచెను.*

*కొలస్సీ. 1:22*

*మీరు పులిపిండి లేనివారు గనుక క్రొత్త ముద్ద అవుటకై ఆపాతదైన పులిపిండిని తీసి పారవేయుడి. ఇంతేకాక క్రీస్తు అను మన పస్కా పశువు వధింపబడెను.*

*1 కొరింథీ. 5:7*

**జ**డత్వముగా ఉండి త్వరగా మార్పుచెందకుండుట క్రైస్తవ జీవితములో హృదయాన్ని నొప్పించే విషయము.నీవు నీ పూర్ణహృదయంతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణవివేకముతోను, నీపూర్ణబలముతోను, నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలె నన్న దేవుని పిలుపును మనము వినియున్నాము (మార్కు. 12:30) అయితే అటువంటి ప్రేమను, భక్తిని మనము చేరుకో గలుగుతున్నామా? అపోస్తలుడైన పౌలుగారితో కలసి మనము ప్రతీసారి ఇట్లు విలపిస్తున్నాము. "అయ్యో నేనంత దౌర్భాగ్యుడను? ఇట్టి మరణమునకు లోనగు శరీరము నుండి నన్నెవడు విడిపించును?" (రోమా. 7:24). మనము ఎంత దృఢసంకల్పము గలవారమైనప్పటికీ ఇంకా మనము మూలగుతునే ఉన్నాము. "ఇదివరకే నేను గెలిచితినని యైనను, ఇదివరకే సంపూర్ణ సిద్ధి పొందితిననియైనను నేను అనుకొనుటలేదు గాని, నేను దేనినిమిత్తము క్రీస్తు యేసు చేత పట్టబడితినో దానిని పట్టుకొనవలెనని పరుగెత్తుచున్నాను" (ఫిలిప్పీ. 3:12).

ఆ మాట మన యొక్క సహనము మరియు సంతోషమునకు తాళపుచెవిగా ఉన్నది. క్రీస్తుయేసు నన్ను తన సొత్తుగా చేసెను. నేను పరుగెత్తినది, సంపాదించినది



మరియు శ్రమపడినది క్రీస్తునకు చెందినదైయుండుటకు కాదు (అది ఇప్పటికే జరిగినది) గానీ ఆయన సారూప్యములో నుండుటకు ఇంకా కొరతగా ఉన్న దానిని నెరవేర్చడానికి.

మన యొక్క అసంపూర్ణతలోనే పరిపూర్ణము చెందించబడుతున్నామని యెరుగుట క్రైస్తవ జీవితములో సహనము మరియు సంతోషములకు గొప్పదైన వనరుగా ఉన్నది–మరియు ఇది క్రీస్తు యొక్క శ్రమ, మరణము నుండి కలుగుచున్నది. ఒక్క అర్పణచేత ఈయన పరిశుద్ధ పరచబడు వారిని సదాకాలమునకు సంపూర్ణులనుగా చేసియున్నాడు" (హెబ్రీ. 10:14). ఇది ఆశ్చర్యకరమైన సంగతి! ఒకే వచనములో "మనము పరిశుద్ధపరచబడుచున్నామని" మరియు "సంపూర్ణులనుగా చేసియున్నాడని" ఆయన చెబుతున్నాడు.

పరిశుద్ధపరచబడుచున్నామనగా మునుపు అసంపూర్ణులమని, ఆ ప్రక్రియ గుండా వెళుతున్నామని అర్థము. మనము పరిశుద్ధము అవుతున్నాము–అయితే ఇంకా సంపూర్ణులము కాదు. అయితే ఇచ్చట వారిని సంపూర్ణులునుగా ఇప్పటికే చేసియున్నాడని సంక్షిప్తముగా మనకు చెప్పబడినది. ఇచ్చట ఆనందకరమైన, ప్రోత్సాహకరమైన సంగతి ఏమంటే, దేవుని ఎదుట ఋజువు కాబడిన సంపూర్ణత మన అనుభవపూర్వక సంపూర్ణత కాదు గాని మన అనుభవపూర్వక అభివృద్ధియైయున్నది. శుభవార్త ఏమిటంటే, ఆమార్గములో ఉండుటయే మనము చేరుకున్నాము అనుటకు ఋజువుగా ఉన్నది.

బైబిలు గ్రంథము మరల దీనిని పులియని పిండి మరియు పులిసిన పిండి అనే పాత పరిభాషలో చిత్రీకరిస్తుంది. ఈ చిత్రీకరణలో పులిసినపిండి దుష్టత్వమునకు సాదృశ్యము. మనము పులియని పిండిలో భాగమై యున్నాము. అది ఇట్లు చెబుతుంది. "మీరు పులిపిండి లేనివారు గనుక క్రొత్త ముద్ద అవుటకై ఆపాతదైన పులిపిండిని తీసిపారవేయుడి. ఇంతేకాక క్రీస్తు అను పస్కాపశువు వదింపబడెను" (1 కొరంథీ. 5:7). క్రైస్తవులు పులియని పిండికి సాదృష్యము. మనము సంపూర్ణము చేయబడి యున్నాము. ఈ కారణము చేత "పాతదైన పులిపిండిని తీసిపారవేయాలి". మనము క్రీస్తులో పులియని పిండిగా చేయబడి యున్నాము. కాబట్టి మనము ఇప్పుడు మన అభ్యాసములో పులియని వారముగా ఉండాలి. మరొక మాటలో చెప్పాలంటే, మనము ఏమైఉండాలో ఆ విధముగా ఉండాలి.

వీటన్నిటికి మూలము ఏమిటి? "ఇంతేకాక క్రీస్తు అను పస్కా పశువు వధింపబడెను". క్రీస్తు యొక్క శ్రమలు మనపరిపూర్ణతను శ్రద్ధగా బధ్రము చేయుచున్నది అది ఇప్పుడు వాస్తవమైనది. అందువలన, మనము సంపూర్ణలమగుటకు పాపమునకు వ్యతిరేకముగా పోరాడుటలేదు కానీ మనము సంపూర్ణలమైయున్నందున పోరాడుచున్నాము. మనయొక్క సంపూర్ణత అనే పునాదిమీద మన అసంపూర్ణతకు వ్యతిరేఖముగా పోరాడుట లేదు. క్రీస్తు మరణము తాళపుచెవియైయున్నది.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# నిర్మలమైన మనస్సాక్షి నిచ్చుటకు

16

*నిత్యుడగు ఆత్మద్వారా తన్నుతాను దేవునికి నిర్దోషినిగా అర్పించుకొనిన క్రీస్తు యొక్క రక్తము, నిర్జీవ క్రియలను విడచి జీవముగల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో యెక్కువగా శుద్ధిచేయును.*

*హెబ్రీ. 9:14*

**కొ**న్ని విషయాలు ఎన్నటికి మార్పుచెందవు. చెడ్డ మనస్సాక్షి యొక్క సమస్య ఆదాము మరియు హవ్వ అంత పురాతనమైనది. వారు పాపము చేయగానే వారి మనస్సాక్షి మలినమైనది. వారి యొక్క వివేకము శిధిలమైపోయింది. దేవునితో వారి యొక్క సంబంధమును అది శిధిలము చేసినది– వారు ఆయన ముందు దాగుకొనినారు. వారిరువురి మధ్యనున్న సంబంధమును కూడ అది శిధిలము చేసినది – వారు ఒకరినొకరు నిందించుకున్నారు. వారిలో వారికున్న శాంతిని అది శిధిలము చేసింది–మొట్టమొదటిసారిగా వారిని వారు చూచుకొని సిగ్గుపడ్డారు.

పాతనిబంధన అంతటిలో, మనస్సాక్షి ఒక ప్రాముఖ్యమైన అంశమైయున్నది. అయితే పశువును బలిగా అర్పించుటవలన మనస్సాక్షి శుద్ధిచేయబడదు. " ఈ ఉపమానార్థమును బట్టి మనస్సాక్షి విషయములో ఆరాధికునికి సంపూర్ణసిద్ధి కలుగజేయలేని అర్పణలును బలులును అర్పించబడుచున్నవి. ఇవి దిద్దుబాటు కాలము వచ్చువరకు విధింపబడి, అన్నపానములతోను నానావిధములైన ప్రక్షాళనములతోను సంబంధించిన శరీరాచారములు మాత్రమైయున్నవి (హెబ్రీ. 9:9–10). క్రీస్తునకు ముంగుర్తుగా, దేవుడు పశువుల యొక్క బలియర్పణను శరీరచారమును శుద్ధిచేయుటకు – అనగా ఆచార సంబంధమైన అపవిత్రతను తొలగించుటకు సరిపోయేదిగా లెక్కించాడు కానీ మనస్సాక్షినికాదు.

ఏ పశువు యొక్క రక్తము మనస్సాక్షిని శుద్ధిచేయలేదు. ఆవిషయము వారికి తెలుసు (యెషయ 53 మరియు కీర్తనలు 51 చూడండి). అది మనకు తెలుసు. అందువలన ఒక క్రొత్త ప్రధాన యాజకుడు – దేవుని కుమారుడైన యేసు–శ్రేష్ఠమైన బలియర్పణముగా తన్నుతానే అర్పించుకొనుటకు వచ్చెను. "నిత్యుడగు ఆత్మద్వారా తన్నుతాను దేవునికి నిర్దోషినిగా అర్పించుకొనిన క్రీస్తు యొక్క రక్తము, నిర్జీవ క్రియలను విడచి జీవముగల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో యెక్కువగా



శుద్ధిచేయును" (హెబ్రీ. 9:14).

పశువుల యొక్క బలియర్పణము, అంత్యముగా దేవుని కుమారుడు బలియర్పణము చేయబడుటకు ముంగుర్తుగానున్నది, మరియు కుమారుని యొక్క మరణము పురాతన కాలములోని దేవుని ప్రజలయొక్క పాపములకు, తరువాత కాలములోని దేవుని ప్రజలకు కూడ వర్తించుచున్నది. అయితే మనము ఇప్పుడు ఆధునిక యుగములో ఉన్నాము–ఇది సాంకేతిక కాలము, ఇంటర్‌నెట్, జన్యుమార్పిడి, ఉన్నపాటున సందేశము పంపించుట, సెల్‌ఫోన్ మొదలుగునవి వినియోగించబడుచున్న కాలము– అయితే ప్రాధమికంగా మన సమస్య ఎల్లప్పుడూ ఒక్కటే, మన మనస్సాక్షి మనలను దోషారోపణ చేస్తుంది. దేవుని సన్నిధికి రావటానికి అంత మంచిగా మనము భావించము. మరియు మన మనస్సాక్షులు ఎంత ఎక్కువగా వక్రీకరించబడినప్పటికీ, ఇది మాత్రము సత్యం: ఆయన సన్నిధికి రావటానికి మనము చాలినవారము కాదు.

మనలను మనము గాయపర్చుకోవచ్చు, లేక పవిత్రనదులలో మన పిల్లలను పడవేయవచ్చు, లేక కోట్లకొలది రూపాయలను ఇవ్వవచ్చు, లేక ఒక కృతజ్ఞతాకూడికలో ఆహారమును వడ్డించవచ్చు, లేక వందరకాలుగా మనలను మనము నొప్పించుకొని, స్వయం–గాయాలను చేసుకొనవచ్చు కానీ దాని వలన వచ్చు ఫలితము ఒక్కటే: మచ్చలు మిగిలే ఉంటాయి, మరియు మరణము భయకంపితముగా ఉంటుంది. మన యొక్క మనస్సాక్షి మలినమై పోయిందని మనకు తెలుసు–అది శవమును ముట్టటవలనో, లేదా పందిమాంసము తినుట వంటి బాహ్య కారణాల వలన కాదు. వెలుపలినుండి లోపలికి పోయి మనుష్యుని అపవిత్రునిగా చేయగలుగునది ఏదియు లేదు గాని, లోపలి నుండి బయలు వెళ్లునవే మనుష్యుని అపవిత్రునిగా చేయునని యేసు చెప్పెను (మార్కు. 7:15–23). గర్వము, స్వయం–సానుభూతి, ద్వేషము, నేత్రాశ, అసూయ, ఈర్ష్య, ఇతరులది ఆశించుట, ఉదాసీనత మరియు భయము మొదలగు వాటివలన, అవి పుట్టించు క్రియల వలన మనము మలినము చేయబడుచున్నాము. ఇవన్నీ "మృతమైన క్రియలు". వాటిలో ఆత్మీయ జీవము లేదు. వాటిలో నూతన జీవము లేదు. అవి మరణము వలన కలిగినవి, తుదకు అవి మరణమునకు నడిపించును. అందువలన మన మనస్సాక్షిని బట్టి వాటిని నిరాశపూరితమైనవిగా భావిస్తాము.

ఈ ఆధునిక యుగములోనూ మరియు మిగతా అన్ని యుగములలోనూ దీనికి సమాధానము క్రీస్తు రక్తము మాత్రమే. మన యొక్క మనస్సాక్షి పైకి లేచి మనపై నిందారోపణ చేయుచున్నప్పుడు మనము ఎటువైపు తిరుగుతాము? మనము క్రీస్తు వైపు తిరుగుతాము. క్రీస్తు పొందిన శ్రమలు, మరణము వైపు – ఆయన రక్తమువైపు తిరుగుతాము. ఈ విశ్వములో ఇదొక్కటే శుద్ధిచేయు ప్రతినిధిగా ఉన్నది, మరియు ఇది మన జీవితములలో నెమ్మది కలిగిన మనస్సాక్షిని, మరణములో శాంతిని ఇస్తుంది.

యేసు మరణించుటకు హేతువేమనగా :

# 17

# మనకు మేలు కలిగించే సమస్త విషయాలను అనుగ్రహించుటకు.

*తన సొంతకుమారుని అనుగ్రహించుటకు వెనుకతీయక మన అందరికొరకు*
*ఆయనను అప్పగించినవాడు ఆయనతోపాటు సమస్తమును*
*మనకెందుకు అనుగ్రహింపడు?*
*రోమా. 8:32*

**ఈ** వాక్యాములో ఉన్న తర్కమును నేను ఇష్టపడుచున్నాను. నేను తర్కశాస్త్రమును ప్రేమించుటవలన కాదుకానీ,నా యొక్క నిజమైన అవసరత తీర్చబడు చున్నందువలన.రోమా. 8:32లో ఉన్న రెండు సమాన వాక్యభాగములు అద్భుతమైన తార్కిక సంబంధమును కలిగియున్నాయి. రెండవ భాగములో "ఆయనతో పాటు సమస్తమును మనకెందుకు అనుగ్రహింపడు?" అనే ప్రశ్న ఉన్నందువలన ఆ విషయాన్ని మనము చూడలేక పోవచ్చును. కానీ ఆ ప్రశ్నను ఒక వాక్య రూపములోకి మార్చినట్లయితే అది ఈ విధముగా వర్తిస్తుందని చూడగలము. "తన సొంతకుమారుని అనుగ్రహించుటకు వెనుకతీయక మన అందరికొరకు ఆయనను అప్పగించినందువలన ఆయనతోపాటు సమస్తమును మనకు అనుగ్రహించెను".

మరియొక మాటలో చెప్పాలంటే, ఈ వాక్యములోని రెండవభాగమును ఖచ్చితముగా నిశ్చయపర్చుటకు రెండు భాగముల జతచేయబడిఉన్నాయి. దేవుడు తన సొంత కుమారుని శ్రమలకు, మరణమునకు అప్పగించగలిగిన కఠినమైన పని చేస్తే, ఆయనతో పాటు సమస్తమును మనకు అనుగ్రహించే సుళువైన పనిని నిశ్చయముగా చేస్తాడు. ఆయన కుమారుని బలియర్పణముగా ఇచ్చుట కంటే, ఆయనతోపాటు సమస్తమును దేవుడు మనకు ఇచ్చుట మరింత నిశ్చయము. ఆయన సొంతకుమారుని "మనందరికొరకు" అప్పగించెను. ఆయనను అప్పగించినవాడు ఆయనతోపాటు సమస్తమును మనకు ఇవ్వకుండా మానుకొనగలడా? ఇది ఆలోచించలేని విషయము.

అయితే "సమస్తమును మనకు అనుగ్రహించును" అనగా అర్థము ఏమిటి? సుఖవంతమైన జీవితము కాదు. మన శత్రువుల నుండి రక్షించబడటము కూడ కాదు. ఆ తరువాత వచ్చే నాలుగు వాక్య బాగముల నుండి దీనిని మనము గ్రహించెదము. "నిన్ను బట్టి దినమెల్ల మేము వధింపబడిన వారము, వధకు సిద్ధమైన గొఱ్ఱెలమని



మేము ఎంచబడినవారము" (రోమా. 8:36). చాలా మంది క్రైస్తవులు, ఈ దినములలో కూడా, ఈ విధమైన హింసలు పొందుచున్నారు.

"శ్రమయైనను, బాధయైనను, హింసయైనను కరవైనను వస్త్రహీనతయైనను ఉపద్రవమైనను"(రోమా. 8:35) క్రీస్తు ప్రేమ నుండి మనలను ఎడబాపునా? అని బైబిలు గ్రంథము అడిగినప్పుడు, మన సమాధానము 'లేదు' (ఎడబాపనేరవు). అంటే ఈ సంగతులన్నీ క్రైస్తవులకు సంభవించవని కాదు కానీ, "మనలను ప్రేమించినవాని ద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము (రోమా. 8:37).

క్రీస్తు మనకొరకు మరణించినందువలన దేవుడు తన కృపనుబట్టి ఆయనతో పాటు "సమస్తమును" మనకు అనుగ్రహిస్తున్నాడు అనే మాటకు అర్థము ఏమిటి? మనకు మేలు కలిగించే సమస్త విషయాలను ఆయన మనకు ఇస్తున్నాడని దాని యొక్క అర్థము. ఆయన కుమారుని యొక్క సారూప్యముతో నిర్ధేశించబడిన సమస్త నిజ అవసరములను ఆయన తీర్చుచున్నాడు (రోమా. 8:29). నిత్య సంతోషము పొందుటకు సమస్త విషయములను ఆయన ఇచ్చుచున్నాడు.

ఇది బైబిలు గ్రంథములోని మరియొక వాగ్ధానము: "కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసునందు మహిమలో మీ ప్రతీ అవసరము తీర్చును" (ఫిలిప్పీ. 4:19) వంటిదే. ఈ వాగ్ధానము దాని ముందు వాక్య బాగములలో స్పష్టము చేయబడినది, "దీనస్థితిలో ఉండ నెరుగుదును; సంపన్న స్థితిలో ఉండనెరుగుదును; ప్రతి విషయములోను, అన్ని కార్యములలోను కడుపు నిండియుండుటకును ఆకలిగొనియుండుటకును, సమృద్ధి కలిగియుండుటకును లేమిలో ఉండుటకును నేర్చుకొనియున్నాను. నన్ను బలపరచు వానియందే నేను సమస్తమును చేయగలను" (ఫిలిప్పీ. 4:12-13)

క్రీస్తులో "సమస్తమును" చేయగలనని ఇది చెబుతుంది. అయితే గమనించండి సమస్తము అనగా "ఆకలిగొనియుండుట" మరియు " లేమిలో" ఉండుట కూడా ఇందులో బాగమే. దేవుడు మన ప్రతీ అవసరమును తీర్చుతాడు, మనకు నిజంగా అవసరత కలిగినప్పుడు అది తీర్చబడక శ్రమపడుచున్నప్పుడు కూడా ఆనందించే సామర్థ్యమును ఆయన కలుగజేస్తాడు. అలాగే దేవుడు మన ప్రతి అవసరతను తీర్చుతాడు, మనము ఆకలిగొని, ఆహారపు అవసరత తీర్చబడక శ్రమపడునప్పుడు తట్టుకొనే కృపను కలుగజేస్తాడు. ఆయన చిత్తము జరిగించుటకు, ఆయనను మహిమపర్చునట్లు నిత్య ఆనందము పొందుకొనునట్లు మన ప్రతి అవసరము తీర్చబడుటకు క్రీస్తు పొందిన శ్రమలు, మరణము మనకు నిశ్చయతను కలుగజేస్తున్నాయి.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

18

# నైతిక మరియు శారీరక రోగముల నుండి మనకు స్వస్థతనిచ్చుటకు

*మన సమాదానార్థమైన శిక్ష అతనిమీదపడెను అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది.*

*యెషయా. 53:5*

*జనులు దయ్యములు పట్టిన అనేకులను ఆయన యొద్దకు తీసుకొనివచ్చిరి. ఆయన మాటవలన దయ్యములను వెళ్ళగొట్టి రోగులనెల్లను స్వస్థపరచెను. అందువలన-ఆయనే మన బలహీనతలను వహించుకొని మన రోగములను భరించెనని ప్రవక్తయైన యెషయా ద్వారా చెప్పబడినది నెరవేరెను.*

*మత్తయి. 8:16-17*

**క్రీ**స్తు శ్రమపొంది, మరణించెను గనుక రోగము పూర్తిగా ఒక దినమును నాశనముచేయబడుతుంది. ఈ లోకము కొరకైన దేవుని ఉద్ధేశ్యములో రోగము మరియు మరణము అనేవి భాగము కాదు. పాపము చేయుటవలన కలిగిన దేవుని తీర్పుతో అవి సృష్టిలోనికి వచ్చియున్నవి. బైబిలు గ్రంథము ఇట్లు చెప్పుచున్నది, "ఏలయనగా సృష్టి, నాశనమునకు లోనయిన దాస్యములో నుండి విడిపింపబడి, దేవుని పిల్లలు పొందబోవు మహిమగల స్వాతంత్ర్యము పొందుదునను నిరీక్షణ కలదై, స్వేచ్ఛగా కాక దానిని లోపరచినవాని మూలముగా వ్యర్థపరచబడెను (రోమా. 8:20). నైతిక దుష్టత్వము వలన కలుగు భయోత్పాతమును చూపించుటకు ఈ లోకమును దేవుడు వ్యర్థమునకు అప్పగించెను.

ఈ వ్యర్థత్వము మరణమును కలిగియున్నది. "ఒక మనుష్యునిద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ప్రవేశించెను" (రోమా. 5:12). రోగము యొక్క మూలుగులు కూడా దానిలో ఉన్నవి. మరియు క్రైస్తవులు కూడా మినహాయించబడ లేదు; "అంతేకాదు, ఆత్మయొక్క ప్రథమ ఫలము నొందిన (అనగా, క్రీస్తునందు నమ్మకముంచినవారు) మనము కూడ దత్త పుత్రత్వము కొరకు, అనగా మన దేహము యొక్క విమోచనము కొరకు కని పెట్టుచు మనలో మనము మూలుగుచున్నాము"(రోమా. 8:23).

అయితే రోగము యొక్క దురవస్థ తాత్కలికమైనది. భాదలేని ఒక సమయము



కొరకు మనము ఎదురుచూస్తున్నాము. సృష్టిని వ్యర్థత్వమునకు అప్పజెప్పుట శాశ్వతము కాదు. తన యొక్క తీర్పు ఆరంభము నుండి కూడ దేవుడు నిరీక్షణను లక్ష్యపెడుతున్నట్లు బైబిలు గ్రంథము చెబుతుంది. ఆయన అంతిమ ఉద్ధేశ్యము ఇదే; "సృష్టి, నాశనమునకు లోనయిన దాస్యములో నుండి విడిపింపబడి, దేవుని పిల్లలు పొందగల మహిమగల స్వాతంత్ర్యము పొందుదునను నిరీక్షణ" కలిగియున్నది (రోమా. 8:21).

యేసు ఈ లోకమునకు వచ్చినప్పుడు, ఆయన యావత్ ప్రపంచానికి విడుదల కలుగజేయు పనిని కలిగియుండెను. తాను జీవించిన కాలంలో అనేక మందిని స్వస్థపరచుట ద్వారా తన ఉద్ధేశ్యమును ఆయన కనబరచెను. అనేక మంది గుంపులుగా కూడియుండినప్పుడు "రోగులనెల్లను స్వస్థపరిచిన" అనేక సందర్భాలు ఉన్నాయి. ఈ చరిత్ర యొక్క అంత్యములో జరుగుబోవు సంభవములకు ఇది ముంగుర్తుగా ఉన్నది, అప్పుడు "ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచివేయును, మరణము ఇకఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు"(ప్రకటన. 21:4)

మరణమును, రోగమును తనమీద వేసుకొని, వాటిని సమాధిలోనికి మోసుకొని పోవుట ద్వారా క్రీస్తు వాటిని ఓడించెను. పాపము విషయమై దేవుని తీర్పు వలన కలిగిన రోగము ఆయన శ్రమ, మరణము యేసు తొలగించియున్నారు. క్రీస్తు యొక్క మరణమును గూర్చి ప్రవక్త అయిన యెషయా ఈ విధముగా వివరిస్తున్నాడు; "మన యతిక్రమక్రియలను బట్టి అతడు గాయపరచబడెను, మన దోషములనుబట్టి నలుగగొట్ట బడెను, మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను, అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది" (యెషయా. 53:5). యేసు తన వీపుపై పొందిన భయంకరమైన దెబ్బల వలన ఒక రోగరహితమైన ప్రపంచమును తెచ్చెను.

దేవుడు విమోచించిన ఈ రోగములన్నియూ ఒక రోజున సృష్టినుండి తొలగించబడ్డాయి. అచ్చట ఒక నూతన భూమి ఉంటుంది. మనము నూతన శరీరములను కలిగియుంటాము. నిత్యజీవము చేత మరణము మ్రింగివేయబడతుంది (1 కొరింథీ. 15:54, 2 కొరింథీ. 5:4). "తోడేళ్ళును గొఱ్ఱెపిల్లలును కలిసి మేయును, సింహము ఎద్దువలె గడ్డి తినును" (యెషయా. 65:25). పాపము, మరణము మరియు రోగము నుండి మనలను విమోచించుటకు వధింపబడిన ఆ గొఱ్ఱెపిల్ల అయిన క్రీస్తును ప్రేమించు వారందరు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెదరు.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

19

## ఆయనలో విశ్వాసముంచు వారందరికి నిత్యజీవమిచ్చుటకు

*దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను.*

*యోహాను. 3:16*

**మ**నము సంతోషముగా ఉన్నప్పుడు మరణించాలని కోరుకొనము. మన యొక్క శ్రమలు మరి భరించలేనివి అయినప్పుడు మరణించాలని కోరిక పుడుతుంది. అటువంటి సమయములలో మనకు నిజముగా కావలసినది మరణము కాదుకానీ ఉపశమనము. మంచి సమయాలు మరలా రావాలని కోరుకుంటాము. బాధ తొలగిపోవాలని ఇష్టపడతాము. మన ప్రియులు నిద్రించిన వారు తిరిగి సమాధినుండి రావాలని కోరుకుంటాము. మనకు సంతోషకరమైన జీవితము కావాలని ఆశిస్తాము.

బాగుగ జీవించిన జీవితానికి మరణమే ముగింపు అని ఊహించుకొని నట్లయితే మనలను మనము మోసపుచ్చుకుంటున్నాము. అది మనకు శత్రువు. ఈ ప్రపంచములోని అద్భుతమైన విషయముల నుండి మనలను తప్పిస్తుంది. మరణము యొక్క మధురనామాన్ని దుష్టత్వమునకు కొంచెము స్వల్పమైన దానిగా పిలుస్తాము. మన యొక్క శ్రమలో మరణశాశనకర్త వేసే చివరి దెబ్బ మనము ఎదురుచూస్తున్న దానికి నెరవేర్పుకాదు గానీ, అది నిరీక్షణకు ముగింపు. జీవించుటకును, సంతోషముగా నుండుటకును మానవహృదయము ఎదురుచూస్తుంది.

దేవుడు మనలను ఆ విధముగా చేసాడు. "ఆయన శాశ్వతకాల జ్ఞానమును నరుల హృదయమందుంచియున్నాడు" (ప్రసంగి. 3:11). మనము దేవుని స్వరూపములో సృష్టించబడియున్నాము మరియు దేవుడు జీవమును ప్రేమించును మరియు నిత్యము జీవించును. మనము కూడా నిత్యము జీవించుటకు చేయబడ్డాము. అవును, ఆ విధంగా జీవిస్తాము. నిత్యజీవానికి వ్యతిరేఖమైనది నాశనము కాదు, దానికి (వ్యతిరేఖమైనది) నరకము. అందరికంటే ఎక్కువగా యేసు దానిని గూర్చి మాట్లాడారు, మరియు తాను ఇచ్చే నిత్యజీవమును తృణీకరించిన వారు కేవలము తుడచివేయబడుట మాత్రమే కాదుగానీ, వారు దేవుని యొక్క భయంకరమైన ఉగ్రతకు పాత్రులగుదురు.



"కుమారునియందు విశ్వాసవముంచువాడే నిత్యజీవము గలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వాని మీద నిలచియుండును"(యోహాను. 3:36).

మరియు అదిశాశ్వతకాలము వారి మీద నిలచియుండును. యేసు ఇట్లు చెప్పెను " వీరు నిత్యశిక్షకును నీతిమంతులు నిత్యజీవమునకు పోవుదురు"(మత్తయి 25:46). దేవునితో నిర్లక్ష్యంగానో లేదా అలక్ష్యంగానో వ్యవహించుటవలన కలుగు అనంతమైన ఆపదను ఇది చూపిస్తుంది. అందువలన యేసు ఈ విధముగా హెచ్చరిస్తున్నారు. "నీ కన్ను నిన్ను అభ్యంతరపరచిన యెడల దాని తీసి పారవేయుము; రెండు కన్నులు కలిగి నరకములో పడవేయబడుటకంటే ఒంటికన్ను గలవాడవై దేవుని రాజ్యములో ప్రవేశించుట మేలు. నరకమున వారిపురుగు చావదు; అగ్ని ఆరదు (మార్కు. 9:47-48).

అందువలన, నిత్యజీవము అంటే సుఖ, దుఃఖములు మిళితమైన ఈ జీవితానికి పొడిగింపు కాదు. నరకము ఈ జీవితములో చెడ్డదైన ప్రతిఫలము అయినట్లే, "నిత్యజీవము'' కూడా ఈ జీవితములో శ్రేష్ఠమైనదియైయున్నది. ఇది అత్యంత ఉన్నతమైనది మరియు పాపము, దుఃఖము గతించిపోయి, ఉప్పొంగే నిత్య సంతోషము ఉంటుంది. ఈ పతనమైపోయిన సృష్టి యొక్క దుష్టత్వము, హాని తీసివేయబడతాయి. మంచిదైనదంతయు అనగా నిజమైన నిలచియుండే సంతోషము – భద్రము చేయబడి, పరిశుద్ధపరచబడి, అధికము చేయబడుతుంది.

మనము మార్పు చెందుదుము గనుక, ఈ జీవితములో మనము పొందలేని అపరిమితమైన సంతోషమును కలిగియుండుటకు శక్తిమంతులమగుదుము. "దేవుడు తన్ను ప్రేమించువారికొరకు ఏవి సిద్ధపరచెనో అది కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు" (1 కొరింథీ. 2:9). క్రీస్తులో, నమ్మకముంచు వారికి ఇంకా మేలైనది రావలసి ఉంది అనే మాట ఇప్పుడు, ఎల్లప్పుడు మరియు జీవితములో ప్రతీక్షణమూ ఒక సత్యమైయున్నది. అన్ని విషయాలలో సంతృప్తినిచ్చే దేవుని మహిమను మనము చూసెదము. "అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము" (యోహాను. 17:3). దీని కొరకు క్రీస్తు శ్రమ పొంది, మరణించెను. అటువంటి ఆయనను మన సొత్తుగా హత్తుకొని ఎందుకు జీవించకూడదు?

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

20

# ప్రస్తుతపు దుష్టకాలము నుండి విమోచించుటకు

*మన తండ్రియైన దేవుని చిత్తప్రకారము క్రీస్తు మనలను ప్రస్తుతపు దుష్టకాలములో నుండి విమోచింపవలెనని మన పాపములనిమిత్తము తన్ను తాను అప్పగించుకొనెను. గలతీ. 1:4*

**మ**నము మరణించువరకు లేదా క్రీస్తు తన రాజ్యము స్థాపించుటకు తిరిగివచ్చువరకు మనము ''ప్రస్తుతపు దుష్టకాలము''లో బ్రతుకవలసియున్నది. అందువలన "క్రీస్తు, మనలను ప్రస్తుతపు దుష్టకాలమునుండి విమోచింపవలెనని తన్నుతాను అప్పగించుకొనెను" అని బైబిలు గ్రంధము చెప్పునప్పుడు, ఆయన ఈలోకము నుండి మనలను వెలుపలకు తీసుకువెళతాడని అర్ధము కాదు, కానీ దుష్టత్వపు శక్తినుండి మనలను విమోచిస్తాడని దాని అర్ధము. యేసు మనకొరకు ఈ విధముగా ప్రార్ధించెను; "నీవులోకమునుండి వారిని తీసుకొనిపొమ్మని నేను ప్రార్ధించుట లేదు గాని దుష్టుని నుండి వారిని కాపాడుమని ప్రార్ధించు చున్నాను" (యోహాను. 17:15).

"దుష్టునినుండి" కాపాడుమని యేసు ప్రార్ధించుటకు కారణమేమనగా, ''ప్రస్తుతపు దుష్టకాలము'' లో సాతాను మోసపుచ్చడానికి, నాశనము చేయడానికి వానికి స్వాతంత్ర్యము ఇవ్వబడినది. బైబిలు గ్రంధము ఈ విధము చెబుతుంది. "మనము దేవుని సంబంధులమనియు, లోకమంతయు దుష్టునియందున్నదనియు ఎరుగుదుము" (1 యోహాను. 5:19). ఈ దుష్టుడు ''ఈ యుగసంబంధమైన దేవత'' గా పిలవబడుచున్నాడు మరియు సత్యము విషయమై మనుష్యులకు గ్రుడ్డితనము కలుగజేయుట వాని యొక్క ప్రధాన లక్ష్యము. "క్రీస్తు మహిమను కనపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము, ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనోనేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను" (2 కొరింథీ. 4:4).

మన యొక్క ఆత్మీయ అంధకార స్థితి నుండి మనము మేల్కొనకపోతే, ''ప్రస్తుతపు దుష్టకాలముతోను దాని అధికారితోను ఏకీభవించి యుండెడివారము. "మీరు వాటిని చేయుచు, వాయుమండల సంబంధమైన అధిపతిని, అనగా అవిధేయులైన వారిని ఇప్పుడు ప్రేరేపించు శక్తికి అధిపతిని అనుసరించి, యీ ప్రపంచ ధర్మము చొప్పున మునుపు నడుచుకొంటిరి" (ఎఫెసీ. 2:2). మనకు తెలియకుండగనే, దుష్టునికి



మనము దాసులమయ్యాము. మనకు స్వాతంత్ర్యములా అనిపించినది బంధకము అయినది. ఈ ఇరవై-ఒకటవ శతాబ్ధములో నున్న వెఱ్ఱిభ్రమ, పరిహాసము, మరియు దురలవాట్లు గురించి బైబిలు గ్రంధము సూటిగా ఈ విధముగా చెబుతుంది, "తామే భ్రష్టత్వమునకు దాసులైయుండియు, అట్టివారికి స్వాతంత్ర్యము ఇత్తుమని చెప్పుదురు. ఒకడు దేనివలన జయింపబడునో దానికి దాసుడగును గదా" (2 పేతురు. 2:19).

బైబిలు గ్రంధములో స్వాతంత్ర్యమును గూర్చి ప్రతిధ్వనించే పిలుపు ఏమనగా; "మీరు ఈలోక మర్యాదను అనుసరింపక,... మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి (రోమా. 12:2). మరియొక మాటలో, స్వేచ్ఛగా ఉండండి? ఈ యుగ సంబధమైన గురువుల చేత మోసపోవద్దు. వారు నేడు ఉండి, రేపు వెళ్ళిపోవుదురు. బానిసగా మారిన ఒక వెఱ్ఱివాడు మరియొక వెఱ్ఱివానిని వెంబడించును. ఈరోజున పొడుచుకున్న పచ్చబొట్లు ముప్పది సంవత్సరముల తరువాత స్వాతంత్ర్యమునకు గుర్తుగా ఉండవు కానీ, ఈ లోకమర్యాదకు చెరగని జ్ఞాపముకముగా ఉంటాయి.

ఈ యుగసంబంధమైన జ్ఞానము నిత్యత్వదృష్టిలో వెఱ్ఱితనము, "ఎవడును తన్ను తాను మోసపరచుకొనకూడదు. మీలో ఎవడైనను ఈ లోకమందు తాను జ్ఞానినని అనుకొనిన యెడల, జ్ఞాని అగునట్టు వెఱ్ఱివాడు కావలెను. ఈ లోక జ్ఞానము దేవుని దృష్టికి వెఱ్ఱితనమే. (1 కొరింథీ. 3:18-19). "సిలువను గూర్చిన వార్త నశించుచున్న వారికి వెఱ్ఱితనము" (1 కొరింథీ. 1:18). అయితే ఈ యుగములో దేవుని యొక్క జ్ఞానము ఏమిటి? అది యేసుక్రీస్తు యొక్క గొప్ప విమోచనా మరణము. యేసును వెంబడించిన ఆ మొదటి అనుచరులు ఇట్లు చెప్పారు, "మేము సిలువవేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము... క్రీస్తు దేవుని శక్తియును దేవుని జ్ఞానమునై యున్నాడు"(1 కొరింథీ. 1:23-24)

క్రీస్తు సిలువ పైకి వెళ్ళినప్పుడు, కోట్లకొలది బంధీలను ఆయన విమోచించాడు. దయ్యము యొక్క మోసమును బహిర్గతము చేసి, వాని అధికారమును నాశనము చేసాడు. ఆయన సిలువ వేయబడుటకు సిద్ధపడుచున్న సందర్భములో "ఇప్పుడు ఈ లోకాధికారి బయటకు త్రోసివేయబడును"(యోహాను. 12:31) అని చెప్పుటలో ఆయన ఉద్ధేశ్యము ఇదే. ఓడించబడిన శత్రువును వెంబడించవద్దు. క్రీస్తును వెంబడించండి. అది చాలా వెల కలిగినది. ఈ యుగములో నీవు చెరపట్టబడిన వానిగా నుందువు. కానీ నీవు విమోచింపబడుదువు.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 21

# మనలను దేవునితో సమాధాన పరచుటకు

*ఏలయనగా శత్రువులమై యుండగా, ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధానపరచబడిన యెడల సమాధానపరచబడినవారమై, ఆయన జీవించుట చేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము.*

*రోమా. 5:10*

**పా**పియైన మానవునికి, దేవునికి మధ్య సమాధానము రెండు విధానములలో జరగవలసిన అవసరతఉంది. దేవుని పట్ల మన ఆలోచనావిధానము తిరస్కారము నుండి విశ్వాసము దిశగా మార్పు చెందవలసియున్నది. మరియు మనపట్ల దేవుని యొక్క ఉద్దేశ్యము ఉగ్రత నుండి కనికరము దిశగా మార్పు చెందవలసియున్నది. కానీ ఈ రెండు ఒక్కటి కాదు. నేను మార్పు చెందడానికి నాకు దేవుని సహాయము కావాలి; అయితే దేవునికి నాసహాయం అవసరం లేదు. నా మార్పు నాకు భయటనుండి రావలసియున్నది, కాని దేవునిలో మార్పు ఆయన స్వభావములోనే ఉంది. దేవునిలో ఎటువంటి మార్పు కలుగదు అని దాని యొక్క పూర్తి అర్థము. దేవుడు ఉద్దేశించిన కార్యము నాకు వ్యతిరేఖముగా పనిచేయుట మాని, నాకొరకు పనిచేయుటకు ప్రారంభమౌతుంది.

"మనము శత్రువులమైయుండగా" అనేది అంతటికి ప్రాముఖ్యమైనమాట. అలాగు ఉన్నప్పుడే ''ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధానపరచబడినాము" (రోమా. 5:10). మనమింక శత్రువులమైయుండగనే (ఇది జరిగెను). మరియెక మాటలో చెప్పాలంటే, మొదట దేవుడు మార్పు చెందాడు. మనము కాదు. మనము ఇంకనూ శత్రువులమే మనము ఉద్దేశ్యపూర్వకముగా వంకర మార్గములో ఉన్నామని కాదు. చాలా మంది - వారి యొక్క మనస్సాక్షి దేవునికి విరోధముగా ఉందని గ్రహించలేరు. ఈ విరోధము వారియొక్క తిరుగుబాటు తనము లేదా ఉదాసీనతతో యుక్తిగా బయలుపరచబడుతుంది. దీనినే బైబిలు గ్రంధము ఈ విధముగా వివరిస్తుంది. ''ఏలయనగా శరీరానుసారమైన మనస్సు దేవునికి విరోధమైయున్నది; అది దేవుని ధర్మశాస్త్రమునకు లోబడదు, ఏ మాత్రమును లోబడనేరదు" (రోమా. 8:7).



మనము ఆవిధముగా ఉంటుండగానే, ఉగ్రతను రేపే మన పాపములను భరించుటకు దేవుడు క్రీస్తును పంపించి, తన కనికరము మనపట్ల చూపించునట్లు అవకాశము కలిగించెను. మన పాపము యొక్క నేరారోపణ స్వభావము అనగా దేవునితో సమాధానపడుటకు ఉన్న ఆటంకమును మొదట తొలగించి మనలను ఆయనతో సమాధాన పరుచును. "దేవుడు వారి అపరాధములను వారిమీద మోపక, క్రీస్తునందు లోకమును తనతో సమాధానపరచుకొనుచు" (2 కొరింథీ. 5:19).

క్రీస్తు రాయబారులు లోకములోనికి ఈ సందేశమును తీసుకొనివెళ్ళినప్పుడు, వారు ఈ విధముగా చెబుతారు, "దేవునితో సమాధానపడుడని క్రీస్తుపక్షముగా మిమ్మును బతిమాలుకొనుచున్నాము (2 కొరింథీ. 5:20). అంటే, కేవలము మీ ధృక్పధమును మార్చుకొనటమే వారి ఉద్దేశ్యమా? కాదు, దేవుడు మొదట క్రీస్తులో చేయుకార్యము వలన వారు సమాధానపరచబడవలెననునది వారి యొక్క ఉద్దేశ్యము.

మనుషుల మధ్య సమాధానము కలిగియుండుటకు కూడా ఈ విశ్లేషణను పరిగణించవచ్చు. యేసు ఇట్లు చెప్పెను; ''నీవు బలిపీఠము నొద్ద అర్పణము అర్పించుచుండగా నీమీద నీ సహోదరునికి విరోధమేమైన కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చిన యెడల అక్కడ బలిపీఠము నెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి, మొదట వెళ్లి నీ సహోదరునితో సమాధానపడుము; అటుతురువాత వచ్చి నీ యర్పణము నర్పింపుము (మత్తయి. 5:23-24). "నీ సహోదరునితో సమాధానపడుమని" ఆయన చెప్పునప్పుడు, గమనించండి ఆ సహోదరుడే తప్పునిసరిగా తనయొక్క తీర్పును తొలగిస్తాడు. దేవుడు నీతో విరోధము కలిగియున్నట్లు, ఆ సహోదరుడు నీ మీద విరోధము కలిగియున్నాడు. "నీ సహోదరునితో సమాధానపడుము" అనగా ఆ సహోదరుని యొక్క తీర్పు నీ మీద నుండి తొలగిపోవునట్లు నీవు చేయవలసినది చేయుమని దీని అర్థము.

అయితే క్రీస్తు సువార్తను మనము వినినప్పుడు, దేవుడు ఆ కార్యమును మనపట్ల చేసెనని మనము కనుగొందుము; మనము తొలగించుకోలేని తన యొక్క తీర్పును ఆయన తోలగించెను. మనస్థానములో ఆయన క్రీస్తును ఉంచెను. "మనమింక శత్రువులమై" యుండగనె నిశ్చయమైన సమాధానమును నెరవేర్చెను. మనవైపునుండి సమాధానపరచబడుట అనగా, దేవుడు ముందుగానే దేనినైతే మనపట్ల జరిగించాడో దానిని పొందుకోవటమే, అది అత్యంత విలువైన బహుమానము పొందుకొనుటయే.

యేసు మరణించుటకు హేతువేమనగా :

# 22 మనలను దేవునియొద్దకు తెచ్చుటకు

*మనలను దేవునియొద్దకు తెచ్చుటకు, అనీతిమంతులకొరకు, నీతిమంతుడైన క్రీస్తు పాపముల విషయములో ఒక్కసారే శ్రమపడెను.*

*1పేతురు. 3:18*

*అయినను మునుపు దూరస్థులైన మీరు ఇప్పుడు క్రీస్తు యేసునందు క్రీస్తు రక్తము వలన సమీపస్థులై యున్నారు.*

*ఎఫెసీ. 2:13*

**స**మస్తమును ప్రకటించబడి నెరవేర్చబడినప్పుడు, దేవుడే సువార్తయైయున్నాడు. సువార్త అనగా "శుభవార్త". క్రైస్తవ్యము మొదటగా దైవశాస్త్రము కాదుగానీ, అది వార్తయైయున్నది. యుద్ధములో బంధీలైనవారు శతృసైన్యము దిగియున్నారు, వారు విడిపించబడుటకు కేవలము కొంతసమయము మాత్రమే పడుతుందని రహస్యమైన రేడియోల ద్వారా వినునట్లు ఇది ఉంది. వారికి కాపలా ఉన్న వారు, అంతగా ఎందుకు వారు ఆనందించు చున్నారని ఆశ్చర్యపడుదురు.

అయితే శుభవార్తలో అంత్యమునకు మిగిలిన మేలు ఏమిటి? అది ఒక విషయంతో ముగిస్తుంది: దేవుడుతానే అంత్యము. సువార్తలోని ప్రతిమాట ఆయన యొద్దకు నడిపించగలదు లేకుంటె అవి సువార్తమాటలు కాదు. ఉదాహరణకు రక్షణఅనేది కేవలము నరకము నుండి తప్పించబడటానికే అయితే, అది దేవుని కొరకు కాకపోతే అది సువార్తకాదు. అలాగే క్షమాపణ అనేది కేవలము మనస్సాక్షికి ఉపశమనము కలిగించేదే అయితే, దేవుని చేరుకోడానికి అది ఒక మార్గము కాకపోతే, అది సువార్తకాదు. నీతిమంతులుగా తీర్చబడుట అనేది కేవలము దేవునిచే అంగీకరించబడడానికి ఒక నామమాత్రమైన విషయమే అయితే, దేవునితో సహవాసము లోనికి అది నడిపించకపోతే అది సువార్తకాదు. అలాగే విమోచన అనేది కేవలము మన బంధకములను పొగొట్టేదే అయితే, అది మనలను దేవుని యొద్దకు తీసుకురాకపోతే అది సువార్త కాదు. దత్తత తీసుకొనుట కేవలము దేవుని కుటుంబములో చేర్చబడుటకే అయితే, మనలను దేవుని కౌగిలిలోకి తీసుకురాకపోతే అది సువార్త కాదు.

ఇది చాలా ప్రాముఖ్యమైనది. చాలా మంది దేవునిని హత్తుకొనుటకంటే సువార్తను ఎక్కువగా హత్తుకున్నట్లు కనిపిస్తారు. మనము నరకమును తప్పించుకోవాలని



ఉద్దేశిస్తున్నందువలన నూతన హృదయమును కలిగియుంటామని నిశ్చయత ఏమాత్రము లేదు. అది పూర్తిగా సహజమైన ఉద్దేశ్యము, సహజాతీతమైనది కాదు. మానసికముగా పశ్చాత్తాపము చెందుటకు లేదా దేవుని ఉగ్రత తొలగించుకొనుటకు లేదా దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనుటకే అన్నట్లున్నది. నూతన హృదయము పొందుకోవాలని కాదు. ఎటువంటి ఆత్మీయ పరివర్తన లేకుండా ఈ విషయాలన్నిటిని మనము అర్థము చేసుకోవచ్చును. ఈ విషయాలన్నింటికీ నీవు తిరిగి జన్మించాల్సిన అవసరం లేదు. దయ్యము (శత్రువు)నకు అవి కావాలి.

అవి కోరుకొనటము తప్పుకాదు. నిజానికి అలా కొరుకొనకపోవటము అవివేకమే. అయితే ఈ విషయాలన్నీ ఆయనను ఆనందింపజేయులాగున దేవునియొద్దకు తీసుకొని వచ్చుట, మనము మార్పుచెందియున్నామనుటకు ఋజువుగా ఉన్నది. ఈ గొప్ప విషయము కోసమే క్రీస్తు మరణించెను. "మనలను దేవునియొద్దకు తెచ్చుటకు అనీతిమంతుల కొరకు నీతిమంతుడైన క్రీస్తు ఒక్కసారే శ్రమపడెను" (1 పేతురు. 3:18).

ఇదే సువార్తకు మూలాంశము ఎందుకు అయింది? ఎందుకంటే, దేవుని యొక్క మహిమను కన్నులార వీక్షించి రుచిచూచి సంపూర్ణమైన మరియు నిత్యమైన ఆనందమును అనుభవించుటకు మనము చేయబడియున్నాము. ఒక వేళ దేనినుండి అయినా మనము అధికముగా సంతోషము పొందితే, మనము దానిని విగ్రహారాధన చేసినట్లు పరిగణించబడుతుంది మరియు దేవుడు అవమానపరచబడును. తన యొక్క మహిమ మనయొక్క ఆనందము ద్వారా ప్రత్యక్షపరచబడునట్లు ఆయన మనలను చేసెను. క్రీస్తు సువార్త అనేది, ఆయన కుమారునియొక్క జీవితము అర్పించుటవలననైయున్నది. మనము నిత్యత్వములో, అత్యధికమైన ఆనందము ఆయనలో కలిగియుండులాగున సమస్తమును జరిగించెను.

క్రీస్తు రావటానికి పూర్వమే, దేవుడు తన్నుతాను సంపూర్ణతకు నిత్య సంతోషమునకు మూలముగా ప్రత్యక్షపరచుకొనెను. "జీవమార్గమును నీవునాకు తెలియజేసెదవు. నీ సన్నిధిని సంపూర్ణ సంతోషము కలదు నీ కుడి చేతిలో నిత్యము సుఖములు కలవు" (కీర్తన. 16:11). అప్పుడు ఆయన "మనలను దేవుని యొద్దకు తెచ్చుటకు" క్రీస్తు శ్రమపొందులాగున ఈ లోకమునకు పంపించెను. అనగా, మనుష్యుడు లోతైన, నిత్యమైన సంతోషమును కలిగియుండునట్లు చేయుటకు ఆయన క్రీస్తును పంపెను. ఆయనిచ్చు ఆహ్వానము వినండి; "అల్పకాల పాపబోగము" నుండి మరలండి (హెబ్రీ. 11:25) మరియు "నిత్య సంతోషము" లోకి రండి. క్రీస్తు యొద్దకు రండి.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# మనము ఆయనకు చెందియుండునట్లు 23

*కావున నాసహోదరులారా, మనము దేవునికొరకు ఫలమును ఫలించునట్లు మృతులలో నుండి లేపబడిన క్రీస్తు అను వేరొకని చేరుటకై మీరును ఆయన శరీరము ద్వారా ధర్మశాస్త్రము విషయమై మృతులైతిరి.*
*రోమా. 7:4*

*మీరు మీ సొత్తుకారు, విలువపెట్టి కొనబడినవారు.*
*1 కొరింథీ. 6:19-20*

*తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు... జాగ్రత్తగా ఉండుడి*
*అపో.కా. 20:28*

**మీ**రు ఎవరు అనేది కాదుకాని, మీరు ఎవరికి చెందినవారు అనేది అంత్యమునకు మిగిలిన ప్రశ్న. తాము ఎవరికీ బానిసలు కాదని చాలామంది ఉద్దేశించుట సహజమే. పూర్తి స్వాతంత్ర్యమును గూర్చి వారు కలలు కంటుంటారు. అలలచేత పైకి ఎత్తబడుచున్న జెల్లీఫిష్ (ఒకరకమైన చేప) స్వేచ్ఛ కలిగియున్నట్లు భావిస్తుంది ఎందుకంటే ఒక నత్తగుల్లలా అతుక్కొని ఉండదు.

అయితే ఆ విధముగా బావించుకొంటున్న వారికి యేసు ఒకమాట చెప్పారు. "మీరు సత్యమును గ్రహించెదరు, అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని చెప్పగా" వారు "మేము అబ్రహాము సంతానము, మేము ఎన్నడును ఎవనికిని దాసులమైయుండలేదే, మీరు స్వతంత్రులుగా చేయబడుదురని యేల చెప్పుచున్నావని ఆయనతో అనిరి" అందుకు యేసు–"పాపము చేయు ప్రతివాడు పాపమునకు దాసుడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అనెను (యోహాను. 8:32-34).

పతనమైపోయి, తుదకు స్వయం-సంకల్పము కలిగియుండు మానవజాతికి బైబిలు గ్రంథము యథార్థతను ఆపాదించుటలేదు. పతనమైన లోకములో సొంత అధికారమునకు తావులేదు. పాపము మనలను ఏలుబడి చేయాలి లేదా దేవుని చేత నడిపించబడాలి. "దేనికి మీరు లోబడుదురో దానికే దాసులగుదురు... మీరు పాపమునకు దాసులైయున్నప్పుడు నీతి విషయమై నిర్బంధము లేనివారై యుంటిరి... అయినను ఇప్పుడు పాపము నుండి విమోచింపబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము" (రోమా. 6:16,20,22).



చాలాసార్లు మనము కోరుకున్నది చేయుటకు మనము స్వేచ్ఛను కలిగియుందుము.

అయితే మనము ఏ విధంగా ఉండాలో ఆవిధముగా ఉండుటకు మనకు స్వేచ్ఛలేదు. ఆ విధముగా ఉండుటకు దైవిక క్రయమూల్యమైన నూతన శక్తి మనకు కావలసియున్నది. ఆశక్తి దేవునిదే. అందుకే బైబిలు గ్రంధము ఈ విధముగా చెబుతుంది, "మీరు పాపమునకు దాసులైయుంటిరి గాని... హృదయపూర్వకముగా లోబడినవారై, పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి" (రోమా. 6:17). దేవుడు వారికి "సత్యవిషయమైన అనుభవజ్ఞానము వారికి కలుగుటకై... వారికి మారుమనస్సు దయచేయును; అందువలన సాతాను తన యిష్టము చొప్పున చెరపట్టిన వీరు వాని యురిలోనుండి తప్పించుకొని" మేలుకొనునట్లు చేయును (2 తిమోతి. 2:25-26).

మరియు క్రీస్తు మరణము ఆ శక్తిని విడుదల చేయగలిగిన దైవిక క్రయమూల్యమైయున్నది. "మీరు మీ సొత్తుకారు, విలువపెట్టి కొనబడినవారు" (1 కొరింథీ. 6:19-20). మరియు ఆయనయందు విశ్వాసముంచు వారికి ఆయన చెల్లించిన క్రయమూల్యము ఏమిటి? "దేవుడు తన స్వరక్తమిచ్చి (వారిని) సంపాదించెను" (అపో.కా. 20:28).

ఇప్పుడు మనము స్వేచ్ఛను కలిగియున్నాము. సొంత అధికారమును కలిగియుండుటకు కాదుగానీ, మేలైనది కొరుకొనుటకే. మనయొక్క ప్రాచీన-స్వయం యొక్క మరణము క్రీస్తు మరణముగా చేయబడినప్పుడు ఒక నూతనమైన జీవిత విధానము తెరవబడుతుంది. జీవముగల క్రీస్తుతో కలిగియున్న సంబంధములు, నియమనిబంధనలకు బదులుగా వస్తాయి. మరియు ధర్మశాస్త్రము యొక్క దాసత్వమునకు బదులు ఫలభరితమైన స్వేచ్ఛ వస్తుంది. "మనము దేవునికొరకు ఫలమును ఫలించునట్లు మృతులలో నుండి లేపబడిన క్రీస్తు అను వేరొకని చేరుటకై మీరును ఆయన శరీరము ద్వారా ధర్మశాస్త్రము విషయమై మృతులైతిరి" (రోమా. 7:4)

ధర్మశాస్త్రమునుండి మరియు పాపము నుండి మనము విమోచింపబడునట్లు క్రీస్తు శ్రమపడి, మరణించెను. ఇచ్చట మన యొక్క విధేయత భారముగా మార్పుచెంది ఫలమును ఫలించునట్లు స్వేచ్ఛనిస్తుంది. జ్ఞాపకముంచుకో, నీవు నీ సొత్తుకాదు. ఎవరికి చెందుతావు? నీవు క్రీస్తునకు చెందినట్లయితే ఆయన యొద్దకు వచ్చి చేరుము.

# 24

# మనము పరిశుద్ధ స్థలములో ప్రవేశించునట్లు నిశ్చయత నిచ్చుటకు

*ఆయన రక్తము వలన పరిశుద్ధస్థలము నందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది.*
*హెబ్రీ. 10:19-20*

ఇశ్రాయేలు వారు దేవునిని ఆరాధించుటకు, వచ్చు "ప్రత్యక్షగుడారము" యొక్క అర్థము గొప్ప మర్మముగా పాతనిబంధనలో గుప్తమైయున్నది. ఆమర్మము సూచన ప్రాయముగా తెలియజేయబడినది కాని అది స్పష్టముగా లేదు. ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి బయలువెడలి సీనాయి పర్వతమునకు వచ్చినప్పుడు, కదులుతూ ఉండే ప్రత్యక్ష గుడారమును దాని యొక్క భాగములను నకిషీతో ఏ విధముగా నిర్మించాలో చాలా వివరముగా దేవుడు సూచించాడు. దానిని గూర్చి గుప్తమైన విషయము ఇదే, "కొండమీద నీకు కనుపరచబడిన వాటి రూపము చొప్పున వాటిని చేయుటకు జాగ్రత్తపడుము" (నిర్గమ. కా. 25:40).

అయితే, 1,400 సంవత్సరముల తరువాత క్రీస్తు ఈ లోకములోనికి వచ్చినప్పుడు ఈ ప్రత్యక్షగుడారము యొక్క రూపము పరలోకములో ఉన్న దానికి "ఛాయ" లేదా "నకలు" గాయున్నట్లు మరియెక్కువగా బయలుపరచబడినది. పరలోకములో వాస్తవమైన దానికి భూసంబంధమైన రూపముగా ప్రత్యక్ష గుడారము ఉన్నది. అందుకే క్రొత్త నిబంధనలో ఈ విధముగా చదువుతాము; "మోషే గుడారము అమర్చబోయినప్పుడు కొండమీద నీకు చూపబడిన మాదిరిచొప్పున సమస్తమును చేయుటకు జాగ్రత్తపడుము; అని దేవునిచేత హెచ్చరింపబడిన ప్రకారము ఈ యాజకులు పరలోక సంబంధమగు వస్తువుల ఛాయారూపకమైన గుడారమునందు సేవ చేయుదురు" (హెబ్రీ 8:5).

అందువలన పాతబంధనలో ఇశ్రాయేలు వారి యొక్క ఆరాధనా క్రమము, మరియెక్కువ వాస్తవికతను సూచించుచున్నది. బలిపశువు రక్తమును అనేక పర్యాయములు తీసుకొని దేవుని కలుసుకొనుటకు ప్రత్యక్షగుడారములో గదులు ఉన్నట్లు, పరలోకములో అత్యంత పరిశుద్ధమైన స్థలములు కలవు, అందులోనికి క్రీస్తు (అనేక పర్యాయములు కాకుండా) ఒక్కసారే తన సొంత రక్తముతో ప్రవేశించెను.



*"అయితే క్రీస్తు... ప్రధాన యాజకుడుగా వచ్చి, తానే నిత్యమైన విమోచన సంపాదించి, హస్తకృతము కానిది అనగా ఈ సృష్టి సంబంధము కానిదియు, మరి ఘనమైనదియు, పరిపూర్ణమైనదియు నైన గుడారము ద్వారా, మేకల యొక్కయు కోడెలయొక్కయు రక్తముతోకాక, తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను" (హెబ్రీ. 9:11-12).*

దేవుని యొక్క సన్నిధియైన అతిపరిశుద్ధ స్థలములలోకి క్రీస్తుతో కలసి వెళ్ళుటకు మనకు మార్గము తెరువబడియున్నట్లు ఈ వాక్యమును అన్వయించవచ్చును. మునుపు అయితే కేవలము యూదుడైన యాజకుడు మాత్రమే పరిశుద్ధ స్థలముల యొక్క ఛాయ మరియు నకలుగా ఉన్న దేవుని సన్నిధిలోనికి వెళ్ళగలిగెడివాడు. దేవుని మహిమ ప్రత్యక్ష పర్చబడే అతిపరిశుద్ధ స్థలములోనికి "సంవత్సరమునకు ఒక్కసారి మాత్రమే ప్రధానయాజకుడు వెళ్ళగలిగేవాడు" (హెబ్రీ. 9:7). ఇతరుల ప్రవేశము నిషేధించే తెరలు దేవుని మహిమను నిలచి యుండే స్థలమును భద్రపరుచుటకు ఉండెడవి. క్రీస్తు సిలువలో తన ప్రాణమును విడచినప్పుడు "దేవాలయపుతెర పై నుండి క్రింది వరకు రెండుగా చినిగెను; భూమి వణకెను; బండలు బద్దలాయెను" అని బైబిలు గ్రంధము చెబుతుంది (మత్తయి. 27:51).

దాని అర్థము ఏమిటి? దాని యొక్క తాత్పర్యము ఈ మాటలలో ఇవ్వబడినది; "యేసు మనకొరకు ప్రతిష్ఠించిన మార్గమున, అనగా నూతనమైనదియు, జీవముగలదియు, అయిన శరీరము అను తెరద్వారా యేర్పరచబడినదియునైన మార్గమున, ఆయన రక్తమువలన పరిశుద్ధ స్థలమునందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది". (హెబ్రీ. 10:19-20). క్రీస్తు లేకుండా దేవుని యొక్క పరిశుద్ధ స్థలము మనకు మూసివేయబడియున్నది. ఆయన మహిమ పరచబడేవారు కాదు, మనము కూడ మన పాపము వలన దహించవేయబడెడివారము. కానీ ఇప్పుడు క్రీస్తునుబట్టి, ఆయన సన్నిధికి వెళ్ళి దేవుని పరిశుద్ధతతో మన హృదయములను నింపుకొనుచున్నాము. ఆయనిక అవమాన పరచబడడు. మనము ఇంకను దహించబడము. క్రీస్తు అన్ని విషయాలలో మనలను భద్రపరచుచున్నందున, దేవుడు ఘనపరచబడును మరియు మనము నిత్యమైన భయభక్తితో నిలువబడుదుము. అందువలన, ఆయన యొద్దకు వచ్చుటకు భయపడవద్దు. అయితే క్రీస్తు ద్వారా రండి.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 25

# దేవునిని కలుసుకొను స్థలముగా మన కొరకు ఆయనుండుటకు

*యేసు–ఈ దేవాలయమును పడగొట్టుడి, మూడు దినములలో దాని లేపుదునని వారితో చెప్పెను. యూదులు – ఈ దేవాలయము నలువదియారు సంవత్సరములు కట్టిరే; నీవు మూడు దినములలో దానిని లేపుదువా అనిరి. అయితే ఆయన తన శరీరమను దేవాలయమును గూర్చి యీ మాట చెప్పెను.*

*యోహాను. 2:19–21*

"**న**న్ను చంపండి మీరు దేవునిని కలసికొనుటకు నేను భూదిగంతముల వరకు వ్యాపించిన స్థలమై ఉంటాను". యోహాను. 2:19–21 వచన భాగాన్ని నేను పైవిధముగా క్లుప్తీకరించుచున్నాను. "ఈ దేవాలయమును పడగొట్టుడి, మూడు దినములలో దానిని లేపుదునని" అనినప్పుడు యెరుషలేము దేవాలయమును గూర్చి యేసు ఆరోపిస్తున్నట్లు వారు భావించారు. కానీ ఆయన దానిని తన శరీరమునకు అన్వయించారు.

యూదుల దేవాలయమునకు, తన శరీరమునకు మధ్య సంబంధమును యేసు ఎందుకు తీసుకువచ్చారు? దేవునిని కలుసుకునే స్థలమైన దేవాలయపు స్థానమును తానే తీసుకున్నారు. దేవుని కుమారునిగా మానవ శరీరములో వచ్చుట ద్వారా ఆచార సాంప్రదాయాలు మరియు ఆరాధనా విధానంలో ప్రాముఖ్యమైన మార్పు కలిగినది. క్రీస్తే కడవరి గొఱ్ఱెపిల్లగా, కడవరి యాజకునిగా, కడవరి దేవాలయమైయున్నారు. అవన్నీ గతించపోతాయి, ఆయన మిగిలియుంటారు.

ఏదైతే మిగిలియుంటుందో అది శాశ్వతముగా మంచిదిగా ఉంటుంది. తనను గూర్చి యేసుఇట్లు చెప్పెను "దేవాలయముకంటె గొప్పవాడిక్కడ నున్నాడని మీతో చెప్పుచున్నాను" (మత్తయి. 12:6). మహిమ పరిశుద్ధ స్థలమును నింపినప్పుడు దేవాలయము అరుదుగా దేవుని యొక్క నివాసస్థలముగా ఉండెడది. కానీ క్రీస్తును గూర్చి బైబిలు గ్రంథము ఇట్లు చెబుతుంది. "దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తు నందు నివసించుచున్నది" (కొలస్సీ. 2:9). దేవుని యొక్క సన్నిధి యేసు మీదకి వచ్చుచూ పోవుచునుండుట వంటిది ఇది కాదు. ఆయన దేవుడు, ఆయనను మనము కలుసుకున్నప్పుడు దేవుని కలుసుకుంటున్నాము.

దేవుడు తన ప్రజలను అసంపూర్ణమైన మధ్యవర్తుల ద్వారా దేవాలయములో



కలుసుకొనేవాడు. అయితే క్రీస్తునుగూర్చి ఈ విధముగా చెప్పబడినది, "దేవుడొక్కడే, దేవునికి ని నరులకను మధ్యవర్తియు ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు" (1 తిమోతి. 2:5). ఆరాధనలో దేవునిని కలుసుకోవాలంటే, మనము వెళ్ళాల్సిన ఒకే ఒక స్థలము ఉంది, అది యేసుక్రీస్తు చెంతకు వెళ్ళుటయే. ముస్లింలు మరియు యూదులు కలిగియున్నట్లు క్రైస్తవత్వము ఒక బౌగోళిక కేంద్రమును కలిగిలేదు.

ఒక సందర్భములో వ్యభిచారముతో నిండియున్న ఒక స్త్రీని యేసు ఎదుర్కొనినప్పుడు, ఆమె తన మాటలను మార్చి ఇట్లు చెప్పింది. "మా పితరులు ఈ పర్వతమందు ఆరాధించిరి గాని ఆరాధింపవలసిన స్థలము యెరూషలేములో ఉన్నదని మీరు చెప్పుదురని ఆయనతో అనగా" ప్రత్యుతరముగా యేసు ఆమెతో ఇట్లనెను, "అమ్మా, ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమందు ఈ పర్వతము మీదనైనను యెరుషలేములో నైనను మీరు తండ్రిని ఆరాధింపరు". ఇచ్చట బౌగోళిక అంశము ప్రాముఖ్యముకాదు. అయితే ఏమిటి ప్రాముఖ్యము? యేసు ఇంకా ఇట్లు చెప్పారు. "అయితే యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది; అది ఇప్పుడు వచ్చేయున్నది" (యోహాను. 4:20–23).

అక్కడున్న పరిస్థితినంతటిని యేసు పూర్తిగా మార్చేసారు. ఈ పర్వతము మీద లేదా పట్టణములోను కాదు గానీ ఆత్మతోను సత్యముతోను ఆరాధిస్తారు అని చెప్పారు. ఈ లోకములోని బౌగోళిక అవధులను తొలగించడానికి ఆయన వచ్చారు. ఇప్పుడు దేవాలయము లేదు. యెరుషలేము ఇప్పుడు కేంద్రము కాదు. క్రీస్తే కేంద్రము. మనము దేవుని చూడగలుగుతున్నామా? యేసు చెప్పెను. "నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడు" (యోహాను. 14:9) దేవుని చేర్చుకోవాలనుకుంటున్నామా? యేసు చెప్పెను, "నన్ను చేర్చుకొనువాడు నన్ను పంపినవాని చేర్చుకొనును"(మత్తయి. 10:40). ఆరాధనలో దేవుని సన్నిధిని కోరుకుంటున్నామా? బైబిలు గ్రంథము ఇట్లు చెబుతుంది, "కుమారుని ఒప్పుకొనువాడు తండ్రిని అంగీకరించువాడు" (1 యోహాను. 2:23). తండ్రిని మనము ఘనపరచాలనుకుంటున్నామా? యేసు చెప్పెను, "కుమారుని ఘనపరచని వాడు ఆయన పంపిన తండ్రిని ఘనపరచడు" (యోహాను. 5:23).

క్రీస్తు మరణించి తిరిగి లేచుటవలన, సర్వమానవావళి క్రీస్తులో దేవుని సమీపించు స్థలమై, పాతదైన దేవాలయ స్థానాన్ని పూరించారు. ఉన్నపాటున ఆయన యొద్దకు నీవు రావచ్చును. నీ కెంత విశ్వాసమో, అంత దగ్గరగా ఆయన ఉన్నాడు.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 26

# పాతనిబంధన యాజకత్వమును ముగింపునకు తెచ్చి, నిత్యము ప్రధానయాజకునిగా నుండుటకు

*మరియు ఆ యాజకులు మరణము పొందుటచేత ఎల్లప్పుడును ఉండ సాధ్యము కానందున, అనేకులైరి గాని ఈయన నిరంతరము ఉన్నవాడు గనుక మార్పులేని యాజకత్వము కలిగిన వాడాయెను. ఈయన తన ద్వారా దేవుని యొద్దకు వచ్చువారి పక్షమున, విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తిమంతుడైయున్నాడు... ఈయన ఆ ప్రధాన యాజకులవలె మొదట తన సొంత పాపముల కొరకు తరువాత ప్రజల పాపముల కొరకును దినదినము బలులను అర్పింపవలసిన అవసరము గలవాడు కాడు; తన్నుతాను అర్పించుకొన్నప్పుడు ఒక్కసారే యీ పనిచేసి ముగించెను.*

*హెబ్రీ. 7: 23-27*

*అందువలన నిజమైన పరిశుద్ధ స్థలమును పోలి హస్తకృతమైన పరిశుద్ధ స్థలములలో క్రీస్తు ప్రవేశింపలేదు గాని, యిప్పుడు మనకొరకు దేవుని సముఖమందు కనబడుటకు పరలోకమందే ప్రవేశించెను. అంతేకాదు, ప్రధానయాజకుడు ప్రతి సంవత్సరము తనదికాని రక్తము తీసికొని పరిశుద్ధస్థలములోనికి ప్రవేశించినట్లు, ఆయన అనేక పర్యాయములు తన్ను తాను అర్పించుకొనుటకు ప్రవేశింపలేదు. అట్లయిన యెడల జగత్తు పునాది వేయబడినది మొదలుకొని ఆయన అనేక పర్యాయములు శ్రమపడవలసి వచ్చును. అయితే ఆయన యుగముల సమాప్తియందు తన్నుతానే బలిగా అర్పించుకొనుటవలన పాపనివారణ చేయుటకై యొక్కసారే ప్రత్యక్షపరచబడెను. హెబ్రీ. 9:24-26*

*మరియు ప్రతి యాజకుడు దినదినము సేవచేయుచు, పాపములను ఎన్నటికిని తీసివేయలేని ఆ బలులనే మాటిమాటికి అర్పించుచు ఉండును. ఈయనయైతే పాపముల నిమిత్తమై సదాకాలము నిలచు ఒక్కబలిని అర్పించి, దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడాయెను.*

*హెబ్రీ. 10:11-12*



అందరికొరకు "ఒక్కసారే" అనే పదము క్రైస్తవ సత్యములో శ్రేష్ఠమైనది. ఇది "ఇఫాపక్స్" అనే గ్రీకు పదము నుండి వచ్చినది, దాని అర్థము: "అన్ని కాలాలవారికి యొక్కసారే" చేయబడినది. అనగా ఒక కార్యము నిశ్చయముగా జరిగినదని దాని అర్థము. ఆ కార్యము నెరవేర్చినది గొప్పది గనుక మాటిమాటికి అది చేయవలసిన అవసరం లేదు. దానిని తిరిగి చేయుటకు ఉద్దేశించిన ఏ పని అయినా "ఒక్కసారే" నెరవేర్చబడిన దానికి అప్రతిష్ఠ కలుగజేసేదిగా ఉంటుంది.

విచారకరమైన వాస్తవమేమిటంటే, ఇశ్రాయేలులో ప్రధాన యాజకులు సంవత్సరము వెంబడి సంవత్సరము తన సొంత పాపముల నిమిత్తము మరియు ప్రజలందరి పాపము నిమిత్తము బలిఅర్పించుచుండెడివారు. అంటే అక్కడ క్షమాపణ లేదు అని నా ఉద్దేశ్యము కాదు గాని, దేవుడు – తన ప్రజలు ఉపశమనము పొందులాగును ఈ బలియర్పణలను ఏర్పాటుచేసెను. వారు పాపము చేసియున్నారు. మరియు ఆ పాపము భరించులాగున ఒక ప్రత్యమ్నాయము వారికి కావాలి. దేవుడు తన కనికరము చేత పాపభూయిష్ఠమైన యాజకుల పరిచర్యను మరియు ప్రత్యమ్నాయ పశు బలిని దేవుడు అంగీకరించెను.

అయితే దానికి ఒక చీకటి కోణము ఉంది. అది మాటిమాటికి జరిగించబడాలి. బైబిలు గ్రంథం ఈ విధంగా చెబుతుంది, "అయితే ఆ బలులు అర్పించుట చేత ఏటేట పాపములు జ్ఞాపకమునకు వచ్చుచున్నవి" (హెబ్రీ. 10:3). వారి యొక్క చేతులు ఒక ఎద్దు (బలిపశువు) మీద ఉంచి వారి యొక్క పాపములు దానికి వర్తింపజేసినప్పుడు,ఆ కార్యము మరలా చేయవలసిన అవసరత ఉందని ప్రజలకు తెలుసు. మానవుల పాపముల నిమిత్తము బలిఅర్పించాలి. ఎద్దులు మరియు మేకలు నైతిక జీవితమును కలిగిలేవు మరియు మనుష్యుని యొక్క దోషాన్ని భరించలేవు. "ఎడ్లయొక్కయు మేకలయొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" (హెబ్రీ. 10:4)

కానీ, యాజకులయొక్క అసంపూర్ణ కార్యమనే కారు మేఘమునకు వెండిపూతలాంటి నిరీక్షణ అక్కడ ఉన్నది. ఈ అసంపూర్ణమైన వాటిని దేవుడు అంగీకరించాడంటే, ఒకానొక దినమున ఈ యాజకులు చేయలేని దానిని యోగ్యుడైన తన దాసుని (కుమారుని) పంపించి నెరవేర్చుటకు ఆయన ఉద్దేశించెనని–అందువలన ఒక్కసారే వారి పాపము తొలగించబడుతుంది.

ఆయనే యేసుక్రీస్తు అంటే (అదే ఆయన ప్రత్యేకత). ఆయన కడవరి యాజకుడు మరియు కడవరి బలియర్పణఅయ్యాడు. ఆయన పాపము లేనివాడు, తన నిమిత్తము తాను బలి అర్పించుకొనలేదు. ఆయన నిత్యుడు గనుక మరలా ఆ స్థానాన్ని భర్తీ చేయవలసిన అవసరము లేదు. ఆయన మనుష్యుడు గనుక మానవుల పాపమును భరించగలడు. అందుకే తనకొరకు తాను బలులను అర్పించుకొనలేదు; తన్నుతాను కడవరి బలియర్పణగా సమర్పించుకొనెను, అక్కడ మరియొకని అవసరము లేదు. దేవునికిని మనకును మధ్యవర్తి యొక్కడే ఉన్నాడు. మనకు ఇంకెవరూ అవసరం లేదు. ఆహా, క్రీస్తు ద్వారా మాత్రమే దేవుని సమీపించువారు ఎంత సంతోషము నొందుదురు!

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

27

# సహానుభావము కలిగి, సమయోచితమైన సహాయము చేయు యాజకునిగా నుండుటకు

*మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడుగాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను.గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము.*

హెబ్రీ. *4:15-16*

**త**న్ను తాను సిలువలో బలియర్పించుకొనుట ద్వారా క్రీస్తు మనకు యాజకుడు అయ్యాడు (హెబ్రీ. 9:26). దేవునికి మనకు మధ్యవర్తి ఆయనే. విధేయత మరియు శ్రమ ఎంతో పరిపూర్ణమైనవి అందువలన దేవుడు ఆయనను త్రోసిపుచ్చలేదు. అందువలన, ఆయనద్వారా దేవునిని మనము సమీపిస్తే, దేవుడు మనలను త్రోసిపుచ్చడు.

అయితే అది మరింత మేలును చేకూర్చుతుంది. తాను సిలువను పొందేమార్గములో ప్రతీ మనుష్యుడు శోధించబడునట్లే ముప్పది సంవత్సరములు క్రీస్తు కూడా శోధింపబడెను. యధార్థం, ఆయన యెన్నడూ పాపము చేయలేదు. అయితే ఆయన మనకంటే కఠినమైన శోధనలు గుండా వెళ్ళారని పండితులు చెబుతారు. ఒక వేళ ఒకవ్యక్తి శోధనలకు లొంగిపోయినట్లయితే శోధన యొక్క తీవ్రత మరియు ధాడి ఎక్కువగా ఉండదు. ఎందుకంటే శోధన యొక్క తీవ్రత ఎక్కువగుతుండగానే మనము పట్టబడుదము. అయితే యేసు ఎన్నడు శోధనకు లొంగిపోలేదు. చివరివరకూ ఎంతో శోధించబడి ఒత్తిడిగుండా వెళ్ళినా శోధన సహించారు, యెన్నడు లోబడలేదు. పూర్ణ ఒత్తిడితో శోధించబడుట అంటే ఏమిటో ఆయన యెరుగును.

జీవితాంతము తాను శోధించబడి దూషించబడి, విడిచిపెట్టబడుట వలన శోధన, శ్రమగుండా వెళ్ళె ప్రజలతో సహానుభవము నొందెను. ఎవ్వరూ అంత ఎక్కువగా శోధింపబడలేదు. ఎవ్వరూ ఆయనంతగా దూషింపబడలేదు. ఎవ్వరూ అంతలా శోధనకు పాత్రులు కాలేదు లేదా దానిని ఎదిరించలేదు. అయితే అపోస్తులుడైన పేతురు ఇట్లు చెప్పెను, "ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు; ఆయన శ్రమపెట్టబడియు బెదిరింపక, న్యాయముగా తీర్పుతీర్చు దేవునికి తన్ను తాను అప్పగించుకొనెను" (1 పేతరు. 2:22-23).



అందువలన బైబిలు గ్రంథము ఇట్లు చెబుతుంది, "మన బలహీనతల యందు మనతో సహానుభవము లేనివాడు కాడు" (హెబ్రీ. 4:15). ఇది ఆశ్చర్యకరమైనది. లేపబడిన దేవుని కుమారుడు తండ్రి కుడి పార్శ్వమున ఆశీనుడై, ఈ విశ్వమంతటి మీద అధికారమును కలిగియుండిన-ఆయనను దుఃఖముతో భారముతో సమీపించినప్పుడు మన దుఃఖము లేదా బాధను ఆయన అనుభవపూర్వకముగా యెరిగియున్నారు.

ఇది ఎటువంటి తేడాను కలుగజేస్తుంది? యేసు యొక్క సహానుభవమునకు మనము ప్రార్థనలో ధైర్యముగా నుండుటకు మధ్య సంబంధము కలిగించుట ద్వారా బైబిలు గ్రంథము జవాబిస్తుంది. అది ఈ విధముగా చెబుతుంది. "మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు... గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము" (హెబ్రీ. 4:15-16).

ఈ విషయాన్ని ఈ విధముగా ఆలోచించవచ్చు మానసికంగా అంతర్యుద్ధము కలిగి ఆయన సన్నిధికి మనము వచ్చినట్లయితే దేవుని సన్నిధిలోకి మనము ఆహ్వానించిబడినట్లు కనిపించదు. మనము దేవుని పరిశుద్ధత మరియు సంపూర్ణతను అనుభవిస్తాము కాబట్టి స్వచ్ఛంగా మనకు సంబంధించినది ఆయన సన్నిధికి సరిపోయేదిగా కనిపించదు. అయితే యేసు మనతో "సహానుభవము" కలిగియున్నాడని మనము జ్ఞాపకము చేసుకుంటాము. మనతో పాటే ఆయన అనుభవిస్తారు, మనకు వ్యతిరేఖమైన అనుభవము మాత్రము కాదు. క్రీస్తు యొక్క సహానుభవము అనే గ్రహింపు మనము ధైర్యముగా ఆయనను సమీపించుటకు వీలు కలుగుజేయచున్నది. మన మొర ఆయన ఎరుగును. మన అవసరతను మనము ఎరిగి ధైర్యముగా ఆయన సన్నిధిలోకి వచ్చునట్లు పిలచుచున్నాడు. అందువలన జాన్ న్యూటన్ గారి పాతదైన కీర్తనను జ్ఞాపకము చేసుకుందుము.

*మీరు రాజు యొద్దకు వచ్చుచున్నారు.*
*పెద్ద మొత్తము లో విజ్ఞాపనలు తెచ్చుచున్నారు;*
*ఆయన కృప, మరియు శక్తి మహోన్నతమైనవి*
*దానిని మించి ఎవరూ అడుగలేరు.*

యేసు మరణించుటకు హేతువేమనగా :

# 28

# పితృపారంపర్యమైన మన వ్యర్థప్రవర్తన నుండి విడిపించుటకు

*పితృపారంపర్యమైన మీ వ్యర్థ ప్రవర్తనను విడిచిపెట్టునట్లుగా వెండి బంగారములవంటి క్షయ వస్తువుల చేత మీరు విమోచింపబడలేదు గాని అమూల్యమైన రక్తము చేత, అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తు రక్తము చేత, విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా.*

*1 పేతురు. 1:18-19*

**పా**శ్చాత్య దేశాలలో లౌకికవాదులు మరియు ఆత్మలను ఆరాధించే ప్రాచీన తెగలవారు ఇటువంటి వాటిని కలిగియున్నారు. పితృపారంపర్య బంధము నుండి కలుగు శక్తిలో వారు నమ్మకముంచుచున్నారు. దానిని వారు వేరువేరు పేర్లతో పిలచుచున్నారు. ఆత్మలను ఆరాధించువారు వాటిని పితరుల ఆత్మలని మరియు శాపము వెరొక తరము పైకి వస్తుందంటారు. లౌకికవాదులు వంశపారంపర్యమును గూర్చి లేదా దూరాచారమునుగూర్చి, పద్ధతులనుగూర్చి, మానసికముగా దూరమైన తల్లిదండ్రులను గూర్చి మాట్లాడుతారు. ఈ రెండు సంధర్భాలలో కూడా పితృపారంపర్యమును గూర్చి దానివలన కలుగు శాపము మరియు మనోవేదనము గూర్చిన అంశము ఉంటుంది. భవిష్యత్తు నిరర్ధకముగాను, సంతోషములేని శూన్యముగాను అగపడుతుంది.

అప్పుడు బైబిలు గ్రంథము చెప్పినదేమంటే " పితృపారంపర్యమైన మీ వ్యర్థ ప్రవర్తనను విడచిపెట్టునట్లుగా... క్షయవస్తువుల చేత మీరు విమోచింపబడలేదు. ఇది ఖాలియైన, అర్థము లేని, ఉపయోగముకాని, చివరకు నాశనమునకు నడిపించే జీవితమును సూచించుచున్నది. అది చెప్పునదేమనగా, "మీ వ్యర్థ ప్రవర్తన" పితరులతో సంబంధము కలిగియుంది. అది ఏ విధముగా ఉందో చెప్పుటలేదు. అయితే ప్రాముఖ్యమైన విషయమేమంటే, ఈ వ్యర్థ ప్రవర్తన నుండి మనము ఏ విధంగా విమోచింపబడగలము. విడిపించు వాని యొక్క శక్తి విడుదల పరిధిని తెలియజేయుచున్నది.

పితృపారంపర్యమైన వ్యర్థప్రవర్తననుండి విమోచన "వెండి బంగారముల వంటి క్షయవస్తువుల చేత" కలుగుట లేదు. మన యొక్క విమోచన కొరకు చెల్లించబడిన



అత్యంత విలువైన వస్తువులుగా బంగారము, వెండి సూచించబడుతున్నాయి. అయితే మనందరికి తెలుసు అవి వ్యర్థమైనవి. అత్యధిక ధనవంతులు వ్యర్థమైన వాటికి బానిసలైపోతున్నారు. ధనవంతుడైన ఒక తెగ నాయకుడు తనపైన ఉన్న పితృపారంపర్య శాపము వలన పీడించబడవచ్చును. ఒక మంచి కంఫెనీ అధ్యక్షుడు తన వెనుకటి చరిత్రనుబట్టి తెలియని కొన్ని శక్తులనుండి నడిపించబడ వచ్చును. ఇది తన కుటుంబమును పోగొట్టుకొనునట్లు చేయును. వెండి బంగారములు సహాయము చేయుటకు పనికిరావు. క్రీస్తు పొందిన శ్రమ, ఆయన మరణము మనకు కావలసిన దానిని ఇచ్చును. బంగారము వెండి కాదు గాని, "అమూల్యమైన రక్తము అనగా నిర్దోషమును, నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తు రక్తము" సహాయము చేయును. క్రీస్తు మరణించుటను బట్టి, మనకు మన పితరులకు మధ్య ఉన్న సంబంధముపట్ల దేవుడు ఒక దృష్టిని కలిగియున్నాడు. వారి యొద్దనుండి వంశపారంపర్యంగా పొందిన వ్యర్థ ప్రవర్తననుండి మనలను విమోచించుట ఆయన ఉద్ధేశ్యమైయున్నది. క్రీస్తు మరణించుటకు అది ఒక గొప్ప కారణమై యున్నది.

నీ పాపములు క్షమించబడి, నీవు క్రీస్తు యొక్క నీతిని ధరించుకొనినట్లయితే, ఏ శాపమునీకు వ్యతిరేఖముగా నిలువబడదు మరియు ఈ విశ్వమును చేసిన సృష్టికర్త నిన్ను ప్రేమించి, విమోచించును. యేసు యొక్క శ్రమ, మరణములే విమోచనకు మూలకారణమని బైబిలు గ్రంథము ఎందుకు చెబుతుందంటే, "నిజముగా యాకోబులో మంత్రము లేదు, ఇశ్రాయేలులో శకునము లేదు" (సంఖ్యా. కా. 23:23). యేసు మరణించినప్పుడు, ఆయనలో విశ్వాసముంచు వారందరి కొరకు పరలోకపు ఆశీర్వాదములు కొనబడ్డాయి. మరియు దేవుడు ఆశీర్వదించినప్పుడు, ఎవరూ శపించలేరు.

తల్లిదండ్రులచేత చేయబడినది, యేసుబాగు చేయలేని ఏ గాయము అక్కడ లేదు. యేసు విమోచనా స్వస్థత ''క్రీస్తు యొక్క అమూల్యమైన రక్తముగా'' పిలవబడుచున్నది. "అమూల్యమైన" అనుమాట అనంతమైన విలువను సూచించుచున్నది. అందువలన ఈ విమోచన అనంతముగా స్వేచ్ఛను కలుగజేయుచున్నది. ఏ బంధము దీనికి వ్యతిరేఖముగా నిలువబడలేదు. అందువలన బంగారము, వెండి నుండి మన దృష్టిని తోలగించి దేవుని బహుమానమును హత్తుకొనెదము.

యేసు మరణించుటకు హేతువేమనగా :

# 29

# పాపదాసత్వము నుండి విడుపించుటకు

*మనలను ప్రేమించుచు తనరక్తము వలన మన పాపముల నుండి మనలను విడిపించినవానికి మహిమయు ప్రభావమును యుగయుగములు కలుగును గాక, ఆమెన్, ఆయన మనలను తన తండ్రియగు దేవునికి ఒక రాజ్యముగాను యాజకులనుగాను జేసెను.*

*ప్రకటన. 1: 5-6*

*కావున యేసు కూడ తన స్వరక్తముచేత ప్రజలను పరిశుద్ధపరచుటకై గవిని వెలుపట శ్రమ పొందెను.*

*హెబ్రీ. 13:12*

**మ**న పాపము మనలను రెండు విధములుగా, నాశనము చేయుచున్నది. ఇది దేవుని ముందు మనలను నేరస్తులుగా చేస్తుంది, అందువలన మనము తీర్పుకుపాత్రులగు చున్నాము మరియు అది మనము అసహ్యంగా ప్రవర్తించునట్లు చేసి, దేవుని స్వరూపము కనబర్చుటకు బదులు కురూపము నిచ్చుచున్నది. అది నేరారోపణతో మనలను అధోగతిపాలు చేసి, ప్రేమ లేని దాసత్వములోకి నెట్టుతుంది.

యేసు రక్తము ఈ రెండు బాదలనుండి మనలను విడిపిస్తుంది. అది దేవుని నీతిని సంతృప్తి చేస్తుంది, అందువలన న్యాయముగా మనపాపములు క్షమించబడతాయి. మరియు అది పాపము యొక్క శక్తిని జయించినది గనుక ప్రేమ లేనితనమునకు దాసులముకాము. మన పైన ఉన్న దేవుని ఉగ్రతను క్రీస్తు ఎవిధంగా భరించాడొ, మరియు మన యొక్క నేరాన్ని ఏవిధంగా తొలగించాడొ మనము చూచియున్నాము. అయితే క్రీస్తు యొక్క రక్తము పాపదాసత్వము నుండి మనలను ఏవిధముగా విమోచిస్తుంది?

ఆయన బలమైన మాదిరిగా మనకున్నారు కాబట్టి స్వార్థం నుండి మనము విడిపించబడులాగున ప్రేరేపించబడుచున్నాము అనేది దీనికి జవాబు కాదు. అవును, నిజమే యేసు మనకు మాదిరి మరియు అది బలవంతమైనది. ఆయనను మనము అనుకరించాలని తాను ఉద్దేశించారు; "మీరు ఒకరినొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్తఆజ్ఞ ఇచ్చుచున్నాను; నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరినొకరు ప్రేమింపవలెను" (1 యోహాను. 13:34). అయితే అనుకరించమని పిలిచిన పిలుపు



విమోచన శక్తిని కలిగిలేదు. అంతకంటే మరింతలోతైనది వెరొకటి కలదు.

పాపము మన జీవితములలో చాలా శక్తివంతముగా ప్రభావము చూపుచున్నది గనుక మనము దేవుని శక్తితో మాత్రమే విమోచింపబడగలము, మన సొంత చిత్తబలము వలన అయ్యేడిది కాదు. అయితే మనము పాపులము కాబట్టి ఈ విధముగా ప్రశ్నించవలసియున్నది. దేవుని యొక్క అధికారము విమోచించుటకు ఉద్దేశించబడినదా లేక తీర్పుతీర్చుటకా? అక్కడే క్రీస్తు పొందిన శ్రమలు ప్రస్తావనకు వస్తాయి. మన దోషశిక్షను తోలగించడానికి క్రీస్తు మరణించినప్పుడు, పరలోకములో నుండి కరుణ ప్రవాహము యొక్క దారను మనమీదకు ప్రోక్షించెను. అందువలన మనము పాపము యొక్క అధికారము నుండి విడుదల పొందుచున్నాము.

మరియొక మాటలో, దేవుని కనికరముచొప్పున పాపము యొక్క అధికారము నుండి విడుదల కలుగుటకు ముందు పాపదోషము, దేవుని ఉగ్రత నుండి విడుదల కలుగుతుంది. ఈ రెండింటి విషయములో చెప్పబడిన సంక్లిష్టమైన బైబిలు మాటలు : నీతిమంతులుగా జేయబడుట ముందువస్తుంది మరియు దానిని అనుసరించి "శుద్ధీకరించబడుట" జరుగుతుంది. ఈ రెండూ వేరైనవి. ఒకటి ఉన్నపాటున (నీతిమంతులుగా) ప్రకటించుట, రెండవది కొనసాగుతూ పరివర్తన చెందే విషయము.

ఇప్పుడు, క్రీస్తునందు విశ్వాసముంచు వారికి, దేవుని యొక్క అధికారము దోషారోపణ చేయుఉగ్రతలో లేదుకాని, విడుదల కలిగించే ఆయన కనికరములో ఉంది. ఈ పరివర్తనను దేవుడు తన పరిశుద్ధాత్మ ద్వారా కలిగించుచున్నాడు. అందుకే, "ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము" వంటివి ఆత్మఫలములుగా పిలవబడుచున్నవి (గలతీ. 5:22-23). అందును బట్టి బైబిలు గ్రంథము ఆశ్చర్యకరమైన వాగ్దానము చేయుచున్నది, "మీరు కృపకే గాని ధర్మశాస్త్రమునకు లోనైనవారు కారు గనుక పాపము మీ మీద ప్రభుత్వము చేయదు" (రోమా. 6:14). అయితే కృపకులోనైయుండుట వలన సర్వశక్తివంతమైన దేవుని అధికారము ప్రేమలేని తనమును నాశనము చేస్తుంది (ఇది ఒక్కసారి కాదు కానీ క్రమక్రమంగా జరుగతుంది). మన స్వార్థమును జయించుటలో జఢత్వముగా లేముగానీ, దృఢమైన అధికారము మనకు ఇవ్వబడినది. ఇది దేవుని కృపయే. అందువలన గొప్ప అపోస్తులుడైన పౌలు ఇట్లు చెప్పెను, " వారందరికంటె నేనెక్కువగా ప్రయాసపడితిని. ప్రయాసపడినది నేను కాను, నాకు తోడైయున్న దేవుని కృపయే" (1 కొరింథీ. 15:10). అత్యంత కృప గలిగిన దేవుడు, క్రీస్తునందు విశ్వాసము ద్వారా, దోషారోపణ మరియు పాపము యొక్క దాసత్వము నుండి మనలను విమోచించును గాక.

యేసు మరణించుటకు హేతువేమనగా :

30

# మనము పాపము విషయమైచనిపోయి, నీతి విషయమై జీవించునట్లు

*మనము పాపముల విషయమై చనిపోయి, నీతివిషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను*

*1 పేతురు. 2:24*

**ఇ**ది క్రొత్తగా ఉంది, క్రీస్తు మన పాపములు నిమిత్తము, మన స్థానములో మరణించుట అనగా మనము మరణించుటయే. మనకు ప్రత్యమ్నాయముగా మరియొకరు మరణించుట వలన మరణము తప్పించుకున్నామని మనము భావిస్తుంటాము. అవును, మనము మరణమును తప్పించుకొన్నాము. అది దేవుని నుండి వేరుచేయబడిన నిత్య మరణము. యేసు చెప్పెను, " నేను వాటికి నిత్యజీవము నిచ్చుచున్నాను గనుక అవి ఎన్నటికిని నశింపవు" (యోహాను. 10:28). "బ్రతికి నా యందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు" (యోహాను. 11:26). యేసు మరణము యొక్క అర్థము ఏమనగా, "అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను. 3:16).

అయితే అక్కడ మరియొక కోణము ఉంది. అదేమనగా క్రీస్తు మన స్థానములో మన పాపము నిమిత్తము మరణించారు గనుక మనము (పాపము విషయములో) చనిపోవాలి. "మనము పాపముల విషయమై చనిపోయి....ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రాను మీద మోసికొనెను" (1 పేతురు. 2:24). మనము జీవించులాగున ఆయన మరణించాడు మరియు మనము (పాపము విషయంలో) చనిపోవులాగున ఆయన మరణించాడు. క్రీస్తు మరణించినప్పుడు, నేను, క్రీస్తులో విశ్వాసిగా ఆయనతో మరణించాను. బైబిలు గ్రంథము ఈ విషయాన్ని స్పష్టము చేసింది; "ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమైన యెడల..." (రోమా. 6:5). "అందరి కొరకు ఒకడు మృతిపొందెను గనుక అందరును మృతిపొందిరనియు" (2 కొరింథీ. 5:14)

గంభీరమైన ఈ విధానములో క్రీస్తుతో ఐక్యము చేయబడ్డామనుటకు విశ్వాసమే ఆధారము. విశ్వాసులు "క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నారు" (గలతీ. 2:20). ఆయన మరణము గూర్చి వెనక్కి ఒక్కసారి చూచినట్లయితే, దేవుని దృష్టిలో మనము ఆయనతో ఉన్నామని గ్రహించవచ్చును. మన పాపములు ఆయన మీద మోపబడ్డాయి, మనము పాత్రులమైయున్న మరణము ఆయనలో మనకు కలుగుచున్నది. క్రీస్తుతో మరణించామనుటకు సాదృశ్యముగా బాప్తిస్మము ఉంది. "మనము బాప్తిస్మమువలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి" (రోమా. 6:4). నీరు ఒక సమాధివంటిది. నీటిలోకి మునుగుట మరణానికి సాదృశ్యము. పైకి వచ్చుట నూతన జీవానికి సాదృశ్యము. ఇదంతయు దేవుడు విశ్వాసముద్వారా చేయు కార్యానికి సాదృశ్యముగా ఉంది. "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలోనుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి" (కొలస్సీ. 2:12)

నేను క్రీస్తుతో కూడా మరణించుట అనేది, క్రీస్తు నా పాపము నిమిత్తము మరణించిన దానికి నేరుగా సంబంధము కలిగియున్నది. "మనము పాపము విషయములో చనిపోయినట్లు.... ఆయన తానే మనపాపములను మ్రాను మీద మోసికొనెను". దీనర్థమేమంటే, యేసును నా రక్షకునిగా నేను హత్తుకొనినప్పుడు, ఒక పాపిగా నా సొంత మరణమును నేను హత్తుకొనుచున్నాను. నా పాపము యేసుని సమాధిలోనికి తెచ్చినది మరియు నన్ను కూడా సమాధిలోకి ఆయనతోపాటు తెచ్చినది. విశ్వాసము పాపమును హంతకునిలా చూస్తుంది. అది యేసుని సంహరించింది. నన్నుకూడా సంహరించింది.

అందువలన, క్రైస్తవునిగా మారుట అనగా పాపము విషయములో మరణించుట. పాపాన్ని ప్రేమించిన ప్రాచీన స్వభావము యేసుతో మరణించింది. పాపము అందవిహీనముగా మారిన ఒక వేష్య లాంటింది. అది నా రాజును మరియు నన్ను సంహరించినది. అందువలన, విశ్వాసి పాపము విషయమై మృతి చెందును. మరియెన్నడు దాని యొక్క ఆకర్షణలచేత అణచివేయబడరు. పాపము, నా స్నేహితుని చంపిన వేశ్య, దానికి ఫిర్యాదు లేదు. ఆమె ఒక శత్రువైనది.

నా నూతన జీవితము ఇప్పుడు నీతి యొక్క అధికారము క్రింద ఉంది. "మనము పాపముల విషయమై చనిపోయి నీతి విషయమై జీవించునట్లు,ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రాను మీద మోసికొనెను" (1 పేతురు. 2:24). నన్ను ప్రేమించి, నా కొరకు తన్నుతాను అర్పించుకొనిన, క్రీస్తు సౌందర్యము నా ప్రాణము యొక్క అభీష్టమైయున్నది. మరియు ఆయన సౌందర్యము పరిపూర్ణ నీతిమత్వమైయున్నది. నేను ఇప్పుడు ప్రేమించి విధేయత చూపిస్తున్న (మీరు కూడా నాతో ఏకీభవించమని కోరుతున్నాను.) ఆజ్ఞ ఏమనగా: "మరియు మీ అవయవములను దుర్నీతి సాధనములుగా పాపమునకు అప్పగింపకుడి, అయితే మృతులలో నుండి సజీవులమనుకొని, మిమ్మును మీరే దేవునికి అప్పగించుకొనిడి, మీ అవయవములను నీతి సాధనములుగా దేవునికి అప్పగించుడి" (రోమా. 6:13)

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 31

# మనము ధర్మశాస్త్ర విషయమై మృతిచెంది దేవునికొరకు ఫలించునట్లు

*మనము దేవునికొరకు ఫలమును ఫలించునట్లు మృతులలోనుండి లేపబడిన క్రీస్తు అను వేరొకని చేరుటకై మీరును ఆయన శరీరము ద్వారా ధర్మశాస్త్రము విషయమై మృతులైతిరి.*

*రోమా. 7 : 4*

**క్రీ**స్తు మనకొరకు మరణించినప్పుడు, ఆయనతోపాటు మనము మరణించాము. మనము క్రీస్తుతో పాటు ఐక్యపరచబడినట్లుగా మన విషయంలో దేవుడు చూసాడు. మన పాపము కొరకైన ఆయన మరణము, ఆయనలో మన మరణమైయున్నది. (ముందు అధ్యాయమును చూడండి). అయితే పాపము ఒక వాస్తవమే, అది యేసుని, మనలను సంహరించినది. దేవుని ధర్మశాస్త్రము కూడా అదే చేసినది. పాపము చేయుటద్వారా ధర్మశాస్త్రమును ఉల్లంఘించితే కూడ ధర్మశాస్త్రము మరణశిక్ష విధిస్తుంది. ఒకవేళ అచ్చట ధర్మశాస్త్రము లేకపోతే, అచ్చట శిక్ష ఉండదు. "ఏలయనగా... ధర్మశాస్త్రము లేని యెడల అతిక్రమమును లేకపోవును" (రోమా. 4:15). అయితే, "సర్వలోకము దేవుని శిక్షకు పాత్రమగునట్లును, ధర్మశాస్త్రము చెప్పుచున్న వాటినన్నిటిని ధర్మశాస్త్రమునకు లోనైనవారితో చెప్పుచున్నదని యెరుగుదుము (రోమా. 3:19).

ధర్మశాస్త్రము యొక్క శాపము నుండి తప్పించుకొను వీలు లేదు. అది న్యాయమైనది మనము దోషులము విడుదలకు అచ్చట ఒకే ఒక మార్గము ఉన్నది: ఎవరోఒకరు శిక్షను భరించవలసి యున్నది. అందుకే యేసు వచ్చాడు. "క్రీస్తు మనకోసము శాపమై మనలను ధర్మశాస్త్రము యొక్క శాపము నుండి విమోచించెను" (గలతీ. 3:13-14).

అందువలన, మనము క్రీస్తులో ఉండినట్లయితే ధర్మశాస్త్రము యొక్క దోషారోపణ మనపైనుండదు. మనపై ప్రభుత్వము చేయు దాని అధికారము రెండింతలు విరుగగొట్టబడినది. ఒకవైపున, ధర్మశాస్త్రమునకు ఆవశ్యకమైన దానిని మనపక్షముగా క్రీస్తు నెరవేర్చుట చూడవచ్చును. ఆయన ధర్మశాస్త్రమును పాటించుట వలన కలుగు ఫలితము మన ఖాతాకు జమచేయబడినది (11వ అధ్యాయము చూడండి). మరోకవైపు, ధర్మశాస్త్రము యొక్క అపరాధముగా క్రీస్తు రక్తము చెల్లించబడినది. అందుకే దేవునితో



సరిగానుండుట అంటే ధర్మశాస్త్రముపై ఆధారపడుట కాదని బైబిలు గ్రంథము స్పష్టముగా బోధించుచున్నది.

"ఏలయనగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలమూలముగా ఏ మనుష్యుడును ఆయన దృష్టికి నీతిమంతుడని తీర్చబడడు" (రోమా 3:20). "మనుష్యుడు యేసుక్రీస్తునందలి విశ్వాసము వలననేగాని ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలమున నీతిమంతుడుగా తీర్చబడడు" (గలతీ. 2:16). ధర్మశాస్త్రమును పాటించుట ద్వారా దేవుని దృష్టిలో నీతిమంతులుముగా ఉందుమన్న నిరీక్షణ మనకు లేదు. మన నిరీక్షణ రక్తము మరియు క్రీస్తు యొక్క నీతిమత్వమైయున్నది, దీనిని మనము కేవలము విశ్వాసము ద్వారా మనదిగా చేసికొనియున్నాము. "కాగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు లేకుండ విశ్వాసము వలననే మనుష్యులు నీతిమంతులుగా తీర్చబడుచున్నారని యెంచుచున్నాము" (రోమా. 3:28)

ఒక వేళ ధర్మశాస్త్ర విషయమై మృతముగా నుండి, అదిమనకు ఎన్నటికిని యజమానుడిగా కాకపోతే, మనము దేవునిని ఎట్లు సంతోషింపజేయుదుము? ధర్మశాస్త్రము దేవుని పరిశుద్ధతను, ఔన్నత్యమును వ్యక్తపరచుట లేదా (రోమా. 7:12)? బైబిలు ప్రకారము దీనికి సమాధానము ఏమంటే, ఒత్తిడిచేసి, దోషారోపణ చేయు ధర్మశాస్త్రమును అంటిపెట్టుకొనుట కంటే ఇప్పుడు మనకు ఇవ్వబడిన క్రీస్తుకు చెందినవారమైయుండాలి. మునుపైతే, రాతిపలకల మీద వ్రాయబడిన అక్షరము వలన బాహ్యము నుండి నీతిగా నుండుటకు ఒత్తిడి చేయబడ్డారు. కానీ ఇప్పుడు మనము క్రీస్తుతో సంబంధము కలిగియుండుటకు ఆశపడుకొలది నీతి మనలో ఉద్భవిస్తుంది. ఆయన ఇప్పుడే ఉన్నాడు, వాస్తవమైయున్నాడు. తన ఆత్మ ద్వారా మన బలహీనతలలో మనకు సహాయము చేయుచున్నాడు. జీవము గలవాడు మృతమైన మరణకరమైన స్థానాన్ని పూరించుచున్నాడు. "అక్షరము చంపును గాని, ఆత్మ జీవింపు చేయును" (2 కొరింథీ. 3:6). (14వ అధ్యాయం చూడండి.)

అందువలన, ఆత్మఫలములు ఫలించుటయే విధేయతకు మార్గము, ధర్మశాస్త్రమును పాటించుట వలన కాదని బైబిలు గ్రంథము చెబుతుంది. "మనము దేవునికొరకు ఫలమును ఫలించునట్లు మృతులలో నుండి లేపబడిన క్రీస్తు అను వేరొకని చేరుటకై మీరును ఆయన శరీరము ద్వారా ధర్మశాస్త్ర విషయమై మృతులైతిరి" (రోమా. 7:4). మనము ధర్మశాస్త్రమును పాటించుట విషయంలో మృతి చెందాము కాబట్టి ఆత్మఫలములు ఫలించుటలో జీవించుదుము. ఫలములు సహజముగా చెట్లలో ఫలిస్తాయి. ఆ చెట్టు మంచిదైతే మంచిఫలములు ఫలిస్తాయి. మరియు ఆ చెట్టు ఈ సందర్భములో, యేసుక్రీస్తుతో జీవముగల ప్రేమ సంబంధమునకు సాదృశ్యముగాయున్నది. ఇందుకొరకే ఆయన మరణించాడు. ఇప్పుడు ఆయన పిలుస్తున్నాడు: "నా యందు విశ్వాసముంచండి". ప్రేమఫలము ఫలించులాగున ధర్మశాస్త్రము విషయమై మృతి చెందండి.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 32

# మనము మనకొరకు గాక క్రీస్తుకొరకు జీవించునట్లు శక్తి నిచ్చుటకు

*జీవించువారికమీదట తమకొరకు కాక, తమనిమిత్తము మృతిపొంది తిరిగి లేచిన వానికొరకే జీవించుటకు ఆయన అందరికొరకు మృతిపొందెననియు నిశ్చయించుకొనుచున్నాము.*

*2 కొరింథీ. 5:15*

**క్రీ**స్తును హెచ్చించుటకే క్రీస్తు మరణించెనన్న మాట చాలామందిని కలవరపరుస్తుంది. ప్రాముఖ్యంగా (2 కొరింథీ. 5:15) మనము క్రీస్తు కొరకు జీవించులాగున ఆయన మరణించెనని చెబుతుంది. మరియొక మాటలో, ఆయన మరియెక్కువగా హెచ్చింపబడులాగున క్రీస్తు మనకొరకు మరణించెనని దీని అర్థము. గ్రుడ్డిగా చెప్పాలంటే, క్రీస్తు క్రీస్తు కొరకు మరణించెను.

అది ఇప్పుడు సత్యమైనది. ఇది మాటల గారడీకాదు. పాపము యొక్క ముఖ్యసంగతి ఏమిటంటే; మనము దేవుని మహిమపర్చలేకపోవడము-అనగా ఆయన కుమారుని కూడా మహిమపర్చలేక పోవుటయైయున్నది. (రోమా. 3:23). అయితే క్రీస్తు ఆ పాపమునంతటిని భరించి దానిని నుండి మనలను విమోచించెను. అందువలన, మనపాపము ద్వారా ఆయన మీద కుప్పగా పోసిన అవమానమును తన మరణములో భరించెను. ఈ విషయాన్ని మార్చుటకు ఆయన మరణించెను. క్రీస్తు, క్రీస్తు యొక్క మహిమకొరకు మరణించెను.

ఈ సత్యము మనుష్యులను కలవరపర్చుటకు కారణమేమంటే, ఇది అంతా వ్యర్థముగా కనబడుతుంది. ఇది ప్రేమపూర్వకముగా చేయదగిన కార్యముగా కనిపించదు. బైబిలు గ్రంథము చెప్పునట్లు, క్రీస్తు మనలను ప్రేమించుట వలన శ్రమపొందెను అనే దానికి ఇది వ్యతిరేఖముగా నున్నట్లు కనబడుతుంది. అయితే, నిజానికి ఇది రెండింటిని దృఢపర్చుతుంది. క్రీస్తు తన సొంత మహిమకోసము మరణించాడు, అలాగే తన ప్రేమను చూపుటకు మరణించాడు అనేవి రెండు సత్యాలు మాత్రమే కాదు, అవి రెండు ఒక్కటిగానే ఉన్నాయి.

క్రీస్తు అద్వితీయుడు. ఎవరూ ఇటువంటి కార్యన్ని నెరవేర్చి నేను ప్రేమిస్తున్నానని చెప్పలేరు. ఈ విశ్వమంతటిలో క్రీస్తు మాత్రమే దేవుడైయుండి, మనుష్యుడైయున్నాడు.



అందుకే ఆయన అనంతమైన గొప్పవాడు. తన యొక్క విషయాలన్నిటిలో ఆయన అనంత సౌంధర్యవంతుడు. ఆయన అనంతమైన జ్ఞానము కలిగినవాడు, న్యాయవంతుడు, మంచివాడు మరియు బలవంతుడు. "ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునై" యున్నాడు, (హెబ్రీ. 1:3). ఈ భూమి మీద మనము పొందుకున్న వాటన్నిటికంటే ఆయనను చూచుట మరియు యెరుగుట ఎంతో తృప్తినిచ్చుచున్నది. ఆయనను ఎరిగినవారు ఇట్లు చెప్పుదురు :

> *అయినను ఏవేవి నాకు లాభకరములై యుండెనో వాటిని క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొంటిని. నిశ్చయముగా నా ప్రభువైన యేసు క్రీస్తును గూర్చిన అతి శ్రేష్ఠమైన జ్ఞానము నిమిత్తమై సమస్తమును నష్టముగా ఎంచుకొనుచున్నాను... ఆయన శ్రమలో పాలివాడగుట యెట్టిదో యెరుగు నిమిత్తమును, సమస్తమును నష్టపరుచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను (ఫిలిప్పీ. 3:7-11).*

"ఆయనకొరకు మనము జీవించునట్లు క్రీస్తు మరణించెను" అనగా "ఆయనకు మనము సహాయము చేస్తున్నామని" అర్థము కాదు. "(దేవుడు) తనకుఏదైనను కొదువ యున్నట్టు మనుష్యుల చేతులతో సేవింపబడువాడు కాడు." (అపో.కా. 17:25). అయితే క్రీస్తు "మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదుగాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెను (మార్కు. 10:45). మన సహాయము పొందుకోవటానికి క్రీస్తు మరణించలేదు కానీ, ఆయన యొక్క అనంతమైన మహోన్నత్వమును స్వాభావికముగా మనము యెరిగియుండాలని మరణించెను. విషపూరితమైన సుఖభోగములనుండి మనలను తప్పించి, తన సౌందర్యములో ఉండే మహానందమును కలిగియుండునట్లు చేసాడు. ఈ విధముగా మనము ప్రేమించబడ్డాము మరియు ఆయన ఘనపర్చబడ్డాడు. ఇవి ఒకదానితో ఒకటి పోటిపడే విషయాలు కాదు. అవన్నీ ఒక్కటే.

నేను వెళ్లవలసి ఉన్నది, నేనువెళ్లి ఆదరణకర్త, పరిశుద్ధాత్మను పంపిస్తానని యేసు తన శిష్యులతో చెప్పెను (యోహాను. 16:7). ఆ ఆదరణకర్త వచ్చిన తరువాత దేనిని చేస్తాడో దానిని ఆయన వారికి వివరించెను; "ఆయన... నన్ను మహిమపరచును" (యోహాను. 16:14). క్రీస్తు మరణించి, పునరుత్థానుడయ్యాడు గనుక ఆయనను చూచి మహిమ పరుచుదుము. ఈ లోకములో ఇదే గొప్ప సహాయము. ఇది ప్రేమయైయున్నది. యేసు ప్రార్థించిన అతి ప్రేమపూరిత ప్రార్థన ఇదే: "తండ్రీ, నేనెక్కడఉందునో అక్కడ నీవు నాకు అనుగ్రహించిన వారును నాతో కూడ ఉండవలెననియు, నీవు నాకు అనుగ్రహించిన నా మహిమను వారు చూడవలెననియు కోరుచున్నాను" (యోహాను. 17:24). ఇందుకే క్రీస్తుమరణించెను. తనను తానే అప్పగించుకొని, శాశ్వతమైన సంతోషము నిచ్చుటకు క్రీస్తు శ్రమపొంది మరణించుటయే-ప్రేమ.

యేసు మరణించుటకు హేతువేమనగా :

33

# మనము ఆయన సిలువలో అతిశయించుటకు

*అయితే మన ప్రభువైన యేసు క్రీస్తు సిలువయందు తప్ప మరి దేనియందును అతిశయించుట నాకు దూరమవును గాక; దానివలన నాకు లోకమును లోకమునకు నేనును సిలువవేయబడి యున్నాము.*

*గలతీ. 6:14*

**ఇ**ది శ్రేష్ఠమైనదిగా ఉంది. శిలువయందు మాత్రమే అతిశయించుట! నిజంగా? అక్షరార్థముగా కేవలం సిలువలో? బైబిలు గ్రంథము ఇతర విషయములలో అతిశయించుటను గూర్చి కూడా మాట్లాడుతుంది. మనము దేవుని మహిమయందు అతిశయపడుచున్నాము (రోమా 5:2). మన శ్రమలయందును అతిశయపడుదము (రోమా. 5:3). "నా బలహీనతలయందే బహు సంతోషముగా అతిశయపడుదును (2 కొరింథీ. 12:9) క్రీస్తు ప్రజలయందు అతిశయించుట (1 థెస్సలోనిక. 2:19) ఇచ్చట "కేవలము" అనే మాటకు అర్థం ఏమిటి?

దీని అర్థము ఏమిటంటే మిగతావిషయాలలో అతిశయపడుట సిలువయందు అతిశయపడుటయే. ఒకవేళ, మహిమ యొక్క నిరీక్షణలో మనము అతిశయపడితే, ఆవిధంగా అతిశయపడుట క్రీస్తు సిలువయందు అతిశయపడుటయే. ఒకవేళ, క్రీస్తు పిల్లల విషయంలో అతిశయపడితే, అది సిలువలో అతిశయపడుటయే. సిలువ యందు అతిశయించుట అనగా, సిలువ మాత్రమే న్యాయబద్ధముగా అతిశయించునట్లు చేస్తుంది కాబట్టి న్యాయబద్ధమైన ప్రతి అతిశయము సిలువను ఘనపరచాలి.

ఎందుకు? ఎందుకనగా, ప్రతి మంచి విషయము - వాస్తవానికి, మంచిగా మార్చబడిన ప్రతీ చెడ్డ సంగతి కూడా - క్రీస్తు యొక్క శిలువ ద్వారా మనకు ఇవ్వబడుచున్నది. క్రీస్తు నందు విశ్వాసము కలిగినవారు మినహాయించి, పాపుల తీర్పును పొందుతారు. అవును, అవిశ్వాసులైన వారికి ఎన్నో ఆహ్లాదకరమైన సంగతులు ఉంటాయి. అయితే బైబిలు గ్రంథము భోదించేదేమిటంటే, సహజముగా వారికి కలిగే ఈ ఆశీర్వాదములు కూడా, ఒకవేళ అవి క్రీస్తు పొందిన శ్రమకు కృతజ్ఞతగా స్వీకరించకపోయినట్లయితే, చివరకు అవి దేవుని తీర్పును తెస్తాయి. (రోమా. 2:4-5).

అందువలన, క్రీస్తులో విశ్వాసముంచిన బిడ్డలముగా మనము అనుభవిస్తున్న ప్రతి సంతోషము ఆయన మరణము వలనైనదని గ్రహించాలి. ఆయన శ్రమలు దోషభరితులైన పాపులు పొందవలసిన తీర్పును మ్రింగి వేసింది, మరియు క్షమించబడిన పాపులు ఆనందించే ప్రతిదానిని అది కొనియున్నది. అందువలన ఈ విషయాలన్నిటిలో అతిశయించుట, క్రీస్తు యొక్క సిలువనందు అతిశయించుటయై యున్నది. మనము క్రీస్తును కేంద్రముగాను, సిలువను ఆనందముగా ఎంచవలసియుండగా, మనము అట్లుఉండుటలేదు ఎందుకంటే, ప్రతి మేలును, ప్రతీ కీడును దేవుడు మేలుకొరకై మార్చుతున్నాడని, క్రీస్తు శ్రమలవలన వాటిని క్రయపరచియున్నాడన్న విషయాన్ని మనము ధ్యానించుటలేదు.

మనము స్వాభావికముగా సిలువ-దృష్టి కలవారముగా ఎట్లు అయ్యేదము? క్రీస్తు మరణించినప్పుడు ఆయనతో పాటు మనము మరణించామనే సత్యమును గ్రహించవలసియున్నది (31వ అధ్యాయమును చూడండి). అపోస్తులుడైన పౌలు ఈ విషయాన్ని గ్రహించినప్పుడు ఆయన చెప్పెను, "నాకు లోకమును లోకమునకు నేనును సిలువ వేయబడియున్నాము" (గలతీ. 6:14). క్రీస్తును కేంద్రముగా కలిగి సిలువయందు అతిశయపడుటకు ఇది మూలమైయున్నది.

క్రీస్తులో నీవిశ్వాసాన్ని ఉంచినప్పుడు, ఈ లోకము యొక్క తీవ్రమైన ఆకర్షణ బద్ధలైపోతుంది. ఈ లోకానికి నీవు శవముగా ఉంటావు. మరియు ఈ లోకముకు శవముగా ఉంటుంది. దీనిని మరింత అనుకూలముగా చెప్పాలంటే, నీవు "క్రొత్తసృష్టి"యైయున్నావు (గలతీ. 6:15). "నీవు" అనబడే పాతది చనిపోయింది. "నీవు" అనబడేక్రొత్తది జీవించినది ఆ "నీవు" అనేది క్రీస్తులో విశ్వాసమువలన కలిగినది. ఈ విశ్వాసమునకు గుర్తుఏమిటంటే ఈ లోకములో అన్నింటికంటే క్రీస్తును సొత్తుగా కలిగియుండుట. తన యొద్దకురమ్మని ఆకర్షిస్తున్న ఈ లోకప్రేమ చనిపోయింది.

లోకము విషయంలో మృతిచెందుట అనగా, ఈ లోకములో న్యాయబద్ధమైన ప్రతీ సంతోషము క్రీస్తు ప్రేమకు రక్త-చిహ్నముగా మరియు సిలువలో అతిశయించుటకు ఒక అవకాశముగా ఉన్నదని అర్థము. మనయొక్క హృదయాలు సిలువ యొక్క ఆశీర్వాద ప్రవాహముచే కొనిపోబడుచుండగా ఈ లోకాను సారమైన ఆశీర్వాదము మృతమైనది మరియు క్రీస్తు సిలువ వేయబడుటయే సమస్తమునకు మూలము.

యేసు మరణించుటకు హేతువేమనగా :

34

# విశ్వాసము ద్వారా ఆయనలో జీవింపజేయుటకు

*నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నాకొరకు తన్నుతాను అప్పగించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాను.*

*గలతీ. 2:20*

**ఈ** లేఖన భాగములో ప్రతికూల విషయాలు ఇచ్చట తేటగా కనబడుతున్నాయి. "నేను సిలువ వేయబడియున్నాను" కానీ "నేను జీవించుచున్నాను". కానీ, ఇవి రెండు విరుద్ధమైన సంగతులు కావు, ఒకదాని తరువాత ఒకటి జరిగేవే అంటావేమో. మొదట క్రీస్తుతో మరణించాను; తరువాత ఆయనతో పాటు లేపబడ్డాను మరియు ఇప్పుడు జీవించుచున్నాను." అని ఉంది అని నీవు అనవచ్చు. నిజమే. కానీ, "జీవించువాడను నేనుకాను" అయిననూ "నేనిప్పుడు జీవించుచున్నాను" అనే మాటలను గూర్చిన సంగతి ఏమిటి?

ఇక్కడున్న ప్రతికూల విషయాలు పరస్పరము విరుద్ధమైనవి కావు. అవి ఆవిధంగా కన్పిస్తాయి. అక్కడ పౌలు ఉద్దేశ్యమేమంటే, అక్కడ "నేను" అనే ఒకరు మరణించారు మరియు "నేను" అనే వేరొకరు జీవిస్తున్నారు. క్రైస్తవునిగా మారడం అంటే దాని అర్థం అదే. ప్రాచీనమైన "స్వయం" మృతి చెందినది. ఒక నూతన "స్వయం" సృష్టించబడినది లేదా "లేపబడినది". "కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి" (2 కొరింథీ. 5:17). "మనము మన అపరాధముల చేత చచ్చినవారమై యుండినప్పుడు..... (దేవుడు) మనలను క్రీస్తుతో కూడ బ్రతికించెను... ఆయనతో కూడా లేపెను (ఎఫెసీ. 2:57).

మన ప్రాచీన స్వభావాన్ని" తనతో పాటు సమాధిలోకి తీసుకువెళ్లి, దానిని అంతమొందించటమే క్రీస్తు మరణం యొక్క లక్ష్యమైయున్నది. "ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్థకమగునట్లు, మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువ వేయబడెనని యెరుగుదుము" (రోమా. 6:6). మనము క్రీస్తులో నమ్మకముంచినట్లయితే, ఆయనతో మనము ఐక్యపరచబడ్డాము



మరియు మన ప్రాచీన స్వభావము క్రీస్తుతో కూడా మరణించునట్లు దేవుడు లెక్కిస్తాడు. నూతన స్వభావము
పొందుటయే ముఖ్య ఉద్ధేశ్యమైయున్నది.

అయితే ఈ నూతన స్వభావము ఎవరు? ఈ రెండు స్వభావాలకు మధ్య ఉండే తేడా ఏమిటి? నేను నేనేనా? ఈ అధ్యాయము ప్రారంభంలో ఉన్న లేఖనభాగము నూతన స్వభావమును రెండు విధములుగా వివరిస్తుంది: ఒకటి ఊహాతీతమైనదిగా ఉంది, మరియొకటి స్పష్టముగా ఉంది. మొదటిగా, క్రీస్తు నాలో జీవించుటయే నూతన స్వభావము అని చెబుతుంది; "ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తేనాయందు జీవించుచున్నాడు" ఈ నూతన స్వభావము క్రీస్తు సన్నిధి మనలో ఉండుటవలన కలిగి, ప్రతీ సమయములో మనకు సహాయము చేయుచున్నదని నా ఉద్దేశ్యము. ఆయన ఎల్లప్పుడూ తన జీవమును నాలోనికి పంపించుచున్నాడు. ఆయన ఏ పనికొరకైతే పిలుచుకున్నాడో దానికొరకు నన్ను ఎల్లప్పుడు బలపరుచుచున్నాడు. అదే విషయాన్ని బైబిలు గ్రంథము చెబుతుంది; "నన్ను బలపరచు వానియందే నేను సమస్తమును చేయగలను" (ఫిలిప్పీ. 4:13). "అందు నిమిత్తము నాలో బలముగా, కార్యసిద్ధి కలుగజేయు ఆయన క్రియాశక్తిని బట్టి నేను పోరాడుచు ప్రయాసపడుచున్నాను" (కొలస్సీ. 1:29). అంతా నెరవేర్చబడినప్పుడు, నూతన స్వభావము ఇట్లు చెబుతుంది, "క్రీస్తు నాద్వారా చేయించినవాటిని గూర్చియేగాని మరి దేనిని గూర్చియు మాటలాడ తెగింపను" (రోమా. 15:18-19).

అట్లు గలతీ పత్రిక 2:20, ప్రాచీన స్వభావం యొక్క మొట్టమొదటి విధము గూర్చి మాట్లాడుతుంది. క్రీస్తునాలో నివాసముండుట, అనగా క్రీస్తునన్ను పోషించుట, క్రీస్తు నన్ను బలపరచుటయైయున్నది. క్రీస్తు మరణించి తెచ్చినది అదే. క్రైస్తవుడనగా అర్థము అదే. నూతన స్వభావమును గూర్చిమాట్లాడుతున్న రెండవ విధము ఇదే: క్షణక్షణము క్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారా జీవించుట, "నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్నుతాను అప్పగించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాను."

నూతన స్వభావము యొక్క ఈ రెండవ వివరణ లేకపోతే, క్రీస్తు నుండి దినదినము సహాయము అనుభవించుట గూర్చి మనకు తెలియకయుండెడిది. ఇప్పుడైతే మనకు జవాబు ఉన్నది: విశ్వాసము. దైవికముగా, క్రీస్తు మనయందు నివాసముండి, ఏ విధముగా మనము జీవించాలి ఆయన బోధించాడో ఆవిధముగా జీవించుటకు శక్తినిచ్చుచున్నాడు. ఇది ఆయన కార్యము. అయితే మనవైపునుండి, క్షణక్షణము ఆయన యందు విశ్వాసము ద్వారా ఆయన మనతో ఉండి, మనకు సహాయము చేయుచున్న అనుభవము కలిగియుందుము. ఆయన మనతో నివాసముండి, సహాయము చేస్తాడు అనుటకు ఋజువుగా ఆయన శ్రమపొంది మరణించుట ఒక సత్యమైయున్నది.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 35

# వివాహము యొక్క గూడార్థమును తెలుపుటకు

*పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి... దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను.*

*ఎఫెసీ. 5:25.*

**క్రీ**స్తు సంఘమును ప్రేమించినట్లు భర్త తన భార్యను ప్రేమించాలని మరియు క్రీస్తుకు క్రైస్తవులు స్పందించునట్లుగా భార్య, తన భర్తకు స్పందించాలని, వివాహము పట్ల దేవుడు అటువంటి ఉద్దేశ్యము కలిగియున్నాడని బైబిలు గ్రంథము వర్ణించుచున్నది. క్రీస్తును ఈ లోకమునకు పంపించునప్పుడు దేవుని మదిలో ఈ ఉద్దేశ్యము ఉంది. వివాహము యొక్క అర్థము కనబరచులాగున క్రీస్తు పెండ్లి కుమార్తె కొరకు వచ్చెను మరియు ఆమెకొరకు మరణించెను.

భర్తలు తన భార్య చేతులలో శ్రమపొందాలని ఈ సాదృశ్యము యొక్క ఉద్దేశ్యము కాదు, కానేకాదు. ఇది నిజమే, ఒక విధంగా ఇది యేసుకు జరిగింది. ఆయన తన ప్రజలను – ఒక వధువును–ఉనికిలోకి తీసుకురావటానకి శ్రమ పొందెను మరియు ఆప్రజలే ఆయన శ్రమ పొందుటకు కారణమయ్యారు. తన శిష్యులే తనకు తృణీకరించుట ఆయనకు మరియెక్కువ బాధ కలిగించింది. అయితే సాదృశ్యముగా తీసుకోవలసిన అంశమేమిటంటే, తన మరణము పొందే స్థాయివరకూ యేసు వారిని ప్రేమించాడు, వారిని విడిచిపెట్టలేదు.

ఆదాము హవ్వలు యేకమవబడకమునుపు మరియు క్రీస్తు వచ్చుటకు మునుపే దేవుడు వివాహము పట్ల ఒక ఆలోచన కలిగియున్నాడు. ఈ విషయాన్ని ముందే మనము యెరిగియున్నాము. ఏలయనగా క్రీస్తు యొక్క అపోస్తులుడు వివాహము యొక్క మర్మమును వివరించినప్పుడు బైబిలు గ్రంథ ప్రారంభమునకు వెళ్లి ఆదికాండము 2:24నుండి ఎత్తిచూపాడు; "కాబట్టి పురుషుడు తన తండ్రిని తన తల్లిని విడచి తన భార్యను హత్తుకొనును; వారు ఏక శరీరమైయుందురు". వెంటనే ఆ తరువాత వాక్యములో తాను ఎత్తిచూపిన మాట యొక్క తాత్పర్యము చెప్పుచున్నాడు: "ఈ మర్మము గొప్పది; అయితే నేను క్రీస్తును గూర్చియు సంఘమునుగూర్చియు చెప్పుచున్నాను" (ఎఫెసీ. 5:31–32).



తన యొక్క ప్రజలతో క్రీస్తు ఏ విధమైన సంబంధమును కలిగియున్నాడో వివాహము చూపుతుందని దేవుడు తన మదిలో ఉద్దేశించాడు అనేదే దీని భావము. వివాహము "మర్మము"గా ఎందుకు చెప్పబడినదంటే, క్రీస్తు వచ్చేంతవరకూ వివాహము యొక్క అసలు లక్ష్యము బయలుపరచబడలేదు. క్రీస్తు యొక్క ప్రేమ తన ప్రజలపట్ల ఈ లోకములో మరింత స్పష్టముగా కనిపించులాగున వివాహము ఉద్దేశించిబడినట్లు మనము ఇప్పుడు చూడవచ్చు.

ఆదినుండి ఈ విషయము దేవుని మదిలో ఉంది, కనుక క్రీస్తు మరణమును ఎదుర్కొన్నప్పుడు ఈ విషయము ఆయన మదిలో ఉన్నది. ఆయన శ్రమకు ప్రభావము చూపిన అనేక విషయములలో వివాహము యొక్క గుఢార్థమును బయలుపరచుట ఒకటి. ఆయన పొందిన శ్రమలన్నీ, ప్రత్యేకముగా పురుషులకు సందేశములైయున్నవి; అందువలన ప్రతీపురుషుడు తన భార్యను ప్రేమింపబద్ధుడైయున్నాడు.

ఆదిలో దేవుడు ఆ విధముగా సంకల్పించక పోయినప్పటికీ, ఇప్పుడైతే వివాహములు చాలా మట్టుకు దుఃఖపూరితంగా మారాయి. పాపము ఈ విధంగానే కార్యము చేస్తుంది. ఒకరినొకరు చెడ్డగా పరిగణించుకొనేటట్లు చేస్తుంది. అయితే దానిని మార్చటానికి యేసు శ్రమపడి, మృతినొందెను. ఈ మార్పుతో పాటు స్త్రీలు వారి బాధ్యతలను కలిగియున్నారు. అయితే పురుషులకు క్రీస్తు ప్రత్యేకమైన బాధ్యతనిచ్చియున్నాడు. అందుకే బైబిలు గ్రంథము చెబుతుంది. "పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి.. దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను" (ఎఫెసీ. 5:25).

పురుషులు క్రీస్తుయైయున్నారని కాదు. వారు ఆవిధంగా ఉండటానికి పిలవబడ్డారు. మరియు ఆ పోలిక చొప్పున ఉండాలి అనగా, ఆమెను నిందించకుండా లేదా భయపెట్టకుండా తన భార్య మేలు కొరకై శ్రమపడటానికి కూడా సిద్ధపడి యుండుట. బయటనుండి ఆమెకు హాని కలిగించే వాటిని గూర్చి శ్రద్ధ వహించాలి, ఒక వేళ ఆమె నుండే కొన్ని నిందలు కలిగినా, నిరాశకలిగినా భరించవలనియున్నది. ఇటువంటి ప్రేమ సాధ్యమే ఎందుకంటే స్త్రీ, పురుషులు ఇద్దరి కొరకు క్రీస్తు మృతిబొందెను. వారి పాపములు క్షమించబడినవి. ఒకరి పాపము కొరకు ఒకరు శ్రమపడవలసి అవసరము లేదు. క్రీస్తు శ్రమను భరించెను. ఇప్పుడు క్షమించబడిన వారుగా వారిద్దరు కీడును మేలుగా మార్చుకొనవలెను.

# 36

# సత్క్రియల పట్ల ప్రజలు ఆసక్తి కలిగియుండునట్లు చేయుటకు

*ఆయన సమస్తమైన దుర్నీతినుండి మనలను విమోచించి, సత్క్రియలయందాసక్తి గల ప్రజలను తన కోసరము పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్నుతానే మనకొరకు అర్పించుకొనెను.*

*తీతుకు. 2:14*

**మ**నము క్షమించబడి, దేవుని చేత అంగీకరించబడుటకు మన సత్కార్యములు కారణం కాదనేది క్రైస్తవత్వము యొక్క ప్రాముఖ్య సత్యమైయున్నది. అయితే ఆ సత్కార్యములు చేయుటయందు ఆసక్తి కలిగి యుండునట్లు పురికొల్పబడుచున్నాము. బైబిలు గ్రంథము చెబుతుంది, "మన క్రియలనుబట్టి కాక తన స్వకీయ సంకల్పమును బట్టియు మనలను రక్షించెను" (2 తిమోతి 1:9). సత్క్రియలను ఆయనకు మనము కనబరచాలని క్రీస్తు శ్రమపొంది, మరణించలేదు కానీ ఆయన "ప్రజలను తన కోసము పవిత్రపరుచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తానే మనకొరకు" మరణించెను (తీతుకు. 2:14).

కృప యొక్క అర్థము ఇదే. మన క్రియల మూలముగా దేవుని యొద్ద నీతిమంతులముగా నిలువబడలేము. అది ఉచిత బహుమానమైయున్నది. దానిని విశ్వాసము ద్వారా మనము పొందెదము, అది మన గొప్ప సొత్తుగా కాపాడుకొనెదము. అందుకే బైబిలు గ్రంథము ఇట్లు చెప్పుచున్నది. "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు; ఇది మీ వలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియలవలన కలిగినదికాదు గనుక ఎవడును అతిశయపడ వీలు లేదు" (ఎఫెసీ. 2:8-9). క్రీస్తు శ్రమపొంది, మరణించెను గనుక మనము అంగీకరించబడడానికి సత్క్రియలు కారణము కాదు, కాని అవి ప్రభావమును చూపిస్తాయి.

అయితే, ఆ తరువాత వచ్చే వాక్యము " సత్ క్రియలు చేయుటకై, మనము క్రీస్తు యేసునందు సృష్టించబడిన వారమై" యున్నామని చెప్పుట అతిశయోక్తి కాదు (ఎఫెసీ. 2:10). మనము సత్క్రియలు చేయుటకు సమర్థులమైయుండాలని క్రీస్తు ఉద్దేశ్యము కాదు గానీ, వాటిని చేయుటకు ఆసక్తి కలిగియుండాలి. అందుకే బైబిలు గ్రంథము "ఆసక్తి" కలిగియుండాలని చెబుతుంది. సత్క్రియలు మనము చేయునట్లు



క్రీస్తు మరణించెను. ఆసక్తి అంటే తృష్ణ అని అర్థము. సత్క్రియలు సగం హృదయంతో చేయాలనో లేక కేవలము నామకార్థముగా చేయాలనో క్రీస్తు మరణించలేదు. మనలో సత్క్రియలను గూర్చి ఆసక్తి పుట్టించాలని ఆయన మరణించెను. కేవలము చెడుతనము విసర్జించుటయే క్రైస్తవ పరిశుద్ధత కాదు గానీ, మంచిని కూడ వెంబడించాలి. మనము సత్క్రియలు చేయుటకు ఆసక్తి కలిగియుండునట్లు అత్యంత విలువైన మూల్యమును యేసు చెల్లించుటకు కారణము ఉంది. దానికి సంబంధించిన ప్రాముఖమైన కారణమును ఈ మాటలలో ఇవ్వబడినది, "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారియెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" (మత్తయి. 5:16). క్రైస్తవుల యొక్క సత్క్రియలవలన దేవుడు మహిమపరచబడును. ఆ మహిమ కొరకే క్రీస్తు శ్రమపొంది, మరణించెను.

దేవుని క్షమాపణ, మరియు అంగీకారము మనలను భయము, గర్వము మరియు లోభము నుండి విడిపించునప్పుడు, మనము ప్రేమింపబడినట్లుగానే ఇతరులను కూడ ప్రేమించుటకు ఆసక్తితో నింపబడుదుము. క్రీస్తుతో మనము భద్రపరచబడి యున్నందున మన జీవితాలను, ఆస్తులను కోల్పోవుటకైనా తెగించెదము. ఈ ప్రకారము మనము ఇతరులను ప్రేమించనట్లయితే, స్వయం - హెచ్చింపు మరియు స్వయం-భద్రత వంటి వాటికి మన స్వభావము విరుద్ధముగా ఉంటుంది. మనయొక్క జీవితాన్ని పరివర్తన చెందించే సొత్తు, భద్రత అయిన దేవుని వైపు మనదృష్టి మరల్చబడుతుంది.

మరియు ఈ "సత్క్రియలు" ఏమైయున్నాయి? వాటియొక్క పరిధిని సంకుచితము చేయకుండా, బైబిలు గ్రంథము ఉద్దేశించునదేమనగా: అత్యవసరములో ఉన్నవారికి, ముఖ్యంగా ఎవరైతే కొంచెము కలిగి మిక్కిలి శ్రమపడుచున్నారో వారికి, సహాయము చేయుట. ఉదాహరణకు, బైబిలు గ్రంథము చెబుతుంది." అవసరమును బట్టి సమయోచితముగా సత్క్రియలను శ్రద్ధగా చేయుటకు నేర్చుకొనవలెను" (తీతుకు. 3:14). ఇటువంటి ప్రజలుగా మనలను తయారు చేయాలని యేసు మరణించెను-పేదవారికి మరియు నశిస్తున్న వారికి సహాయము చేయుటకు ఆసక్తి కలిగియుండే వారికొరకు. ఈ లోకములో అది ఎంత మూల్యముతో కూడిన దైనప్పటికీ, శ్రేష్ఠమైన జీవితము ఇదే; వారు సహాయము పొందుతారు, మనము ఆనదించుతాము, దేవుడు మహిమ పరచబడతాడు.

యేసు మరణించుటకు హేతువేమనగా :

# 37

## తన మితానుభవమును మరియు విలువైన ప్రేమను మనము వెంబడించునట్లు పిలుచుటకు

ఎవడైనను అన్యాయముగా శ్రమపొందుచు, దేవుని గూర్చిన మనస్సాక్షి కలిగి, దుఃఖము సహించిన యెడల అది హితమగును... మేలు చేసి బాధపడునప్పుడు మీరు సహించిన యెడల అది దేవునికి హితమగును; ఇందుకు మీరు పిలవబడితిరి.

1 పేతురు. 2:19-21

మీరు అలసట పడకయు మీ ప్రాణములు విసుకకయు ఉండునట్లు, పాపాత్ములు తనకు వ్యతిరేకముగ చేసిన తిరస్కారమంతయు ఓర్చుకొనిన ఆయనను తలంచుకొనుడి. మీరు పాపముతో పోరాడుటలో రక్తము కారునంతగా ఇంక దానిని ఎదిరింపలేదు.

హెబ్రీ. 12:3-4

క్రీస్తుయేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగిన వాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను... ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపిన వాడై, తన్నుతాను తగ్గించుకొనెను.

ఫిలిప్పీ. 2:5-8

**అ**నుకరించటము రక్షణపొందటము కాదు. అయితే రక్షణ అనుకరణను తెస్తుంది. క్రీస్తు మనకు మొదట మాదిరిగా ఇవ్వబడలేదు గాని రక్షకుడుగా ఇవ్వబడ్డారు. విశ్వాసియొక్క అనుభవములో, మొదట క్రీస్తు యొక్క క్షమాపణ వస్తుంది, తరువాత క్రీస్తు మాదిరి వస్తుంది. క్రీస్తు యొక్క స్వయ అనుభవములో ఈ రెండు ఒకేసారి జరగటం మనము చూడవచ్చు; మన పాపములకొరకు ఆయన పొందిన ఆ శ్రమ ప్రేమ యొక్క మాదిరిని కలుగజేయుచున్నది.

నిజానికి, క్రీస్తు యొక్క క్షమాపణను మనము అనుభవించినప్పుడు మాత్రమే ఆయన మనకు ఒక మాదిరిఅవుతారు. ఆయన శ్రమలు ప్రత్యేకమైనవి గనుక ఈ



మాట తప్పుగా అనిపిస్తుంది. అవి అనుకరించలేనివి. క్రీస్తు చేసినట్లుగా దేవుని కుమారుడు మాత్రమే "మనకొరకు" శ్రమపడగలడు. ఇంకెవరూ మోయలేని రీతిలో ఆయన మన శ్రమలను మోసికొనెను. ఆయన ప్రత్యమ్నాయముగా శ్రమపొందినవాడు. దీనిని మనము ఎన్నటికీ అనుకరించలేము. ఇది అందరి కొరకు ఒక్కసారే నెరవేర్చబడెను, అ నీతి మంతుల కొరకు నీతిమంతుడు (శ్రమపడెను). దైవికమైన, ప్రత్యమ్నాయముగా ఆయన పాపులకొరకు పొందిన శ్రమలు అనుకరించలేనివి.

ఎదిఏమైనా, ఈ ప్రత్యేకమైన శ్రమలు, పాపులను క్షమించి, నీతిమంతులుగా చేసిన తరువాత, యేసు మాదిరిగా జీవించులాగున ప్రజలను మార్పుచెందిస్తుంది– ఆయనవలె పాపములను క్షమించుటకు కాదుగాని ప్రేమించుటలో ఆయనవలె ఉండుట. ఇతరలకు మేలు కలుగునట్లు శ్రమపడుటయందు ఆయన వలె నుండుట. ఆయన వలే కీడుకు ప్రతి కీడు చేయకుండుట. దీనత్వము మరియు సాత్వికములో ఆయన వలె ఉండుట. ఆయన వలె సహనము కలిగియుండుట. ఆయన వలె సేవా తత్వము కలిగియుండుట. యేసు ప్రత్యేకరీతిలో శ్రమపొందెను, అందువలన ప్రేమ విషయమై మనము ఆయనతో పాటు శ్రమపడవలసియున్నది.

క్రీస్తు అపోస్తులుడైన పౌలు, విశ్వాసమూలముగా మొదట క్రీస్తు నీతిలో తరువాత సేవలో ఆయన శ్రమలో పాలివాడగుటతన ఆశ అని చెప్పుచున్నాడు. "క్రీస్తును సంపాదించుకొని, ధర్మశాస్త్రమూలమైన నా నీతినిగాక, క్రీస్తునందలి విశ్వాసము వలననైన నీతి, అనగా విశ్వాసమును బట్టి దేవుడు అనుగ్రహించు నీతిగలవాడనై...ఆయన మరణ విషయములో సమానానుభవము గలవాడనై... ఆయన శ్రమలలో పాలివాడనగుచున్నాను (ఫిలిప్పీ. 3:9-10). నీతిమంతులుగా తీర్చుబడుట ముందు జరిగి, అనుకరణను సాధ్యపరుచుతుంది. నీతిమంతులుగా చేయుటకు క్రీస్తు పొందిన శ్రమలు, (సువార్త) ప్రకటనలో మనము శ్రమపడునట్లు వీలును కలుగజేస్తుంది. ఇతరులకొరకైన మన శ్రమ దేవుని ఉగ్రతను తొలగించలేదు. అనగా క్రీస్తు పొందిన శ్రమలవలన దేవుని ఉగ్రత తీసివేయబడుటలో ఉండే విలువను అది చూపిస్తుంది. ఇది ప్రజలను ఆయనవైపు నడిపిస్తుంది.

"అందుచేత ఏర్పరచబడిన వారు నిత్యమైన మహిమతో కూడ క్రీస్తు యేసు నందలి రక్షణ పొందవలెనని నేను సమస్తమును ఓర్చుకొనుచున్నానని" (2 తిమోతి. 2:10) అని బైబిలు గ్రంథము చెప్పుచున్నప్పుడు దాని అర్థము ఏమనగా, మన అనుకరణ వలన ఆయన మాత్రమే రక్షించునని ప్రజలు సూచించబడుదురు. మన శ్రమలు ప్రాముఖ్యమైనవే, గానీ క్రీస్తు మాత్రమే రక్షించును. అందువలన, ఆయన ప్రేమను మనము అనుకరించెదము గాని ఆయన స్థానాన్ని తీసుకోరాదు.

యేసు మరణించుటకు హేతువేమనగా :

# 38

# సిలువ వేయబడిన అనుచరుల సమూహమును తయారు చేయుటకు

*ఎవడైనను నన్ను వెంబడింప గోరినయెడల తన్నుతాను ఉపేక్షించుకొని, ప్రతిదినము తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపవలెను.*

*లూకా. 9:23*

*తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపనివాడు నాకు పాత్రుడు కాడు.*

*మత్తయి. 10:38.*

**క**ల్వరి మార్గములో అనుచరలను తయారు చేయడానికి క్రీస్తు మరణించెను. తాను సిలువ వేయబడిన కొండపేరు కల్వరి. తన జీవిత మార్గము ఆయనను అక్కడకు నడిపించినదని ఆయన యెరుగును. నిజానికి, ఆయన అక్కడకు "వెళ్ళుటకు మనస్సు స్థిరపరచుకొనెను" (లూకా. 9:51). తన మరణ కార్యమును ఏదీ ఆపలేదు. అది ఎక్కడ, ఎప్పుడు జరుగనుందో ఆయన యెరుగును. యెరుషలేము వెళ్ళు మార్గములో హేరోదు రాజు వలన ప్రమాదము ఉందని కొంతమంది ఆయనను హెచ్చరించినప్పుడు, హేరోదు దేవుని ప్రణాళికను నాశనము చేస్తాడనే ఆలోచనను ఆయన తిరస్కరించాడు. "మీరు వెళ్లి ఆ నక్కతో ఈలాగు చెప్పుడి – ఇదిగో నేడును రేపును నేను దయ్యములను వెళ్లగొట్టుచు (రోగులను) స్వస్థపరచుచునుండి మూడవ దినమున పూర్ణసిద్ధి పొందెదను" (లూకా. 13:32). అన్నియు ప్రణాళిక చొప్పున జరుగుచుండెను. మరియు చివరి ఘడియ వచ్చినప్పుడు, తాను మరణించిన ముందురోజు రాత్రి శత్రుమూక ఆయనను పట్టుకొనినప్పుడు ఆయన వారితో "ప్రవక్తల లేఖనములు నెరవేరునట్లు ఇదంతయు జరిగెనని చెప్పెను" (మత్తయి. 26:56).

ఒక విధముగా, అందరము యేసును కలుసుకొనే మార్గమే కల్వరి. ఆయన ఆ మార్గములో నడచి, మరణించి, పునరుద్ధానుడయ్యాడు మరియు ఇప్పుడు తాను తిరిగి వచ్చేంతవరకూ పరలోకములో రాజ్యమేలుచున్నాడు. కానీ ఈ దినమున ఒక వ్యక్తిని క్రీస్తు కలుసుకొనేది కల్వరి మార్గములోనే అదే సిలువ మార్గము. ఆయన కల్వరి మార్గములో ఎవరినైనా కలుసుకున్న ప్రతిసారి ఆయన చెప్పునదేమంటే, "ఎవడైనను నన్ను వెంబడింపగోరినయెడల తన్నుతాను ఉపేక్షించుకొని, ప్రతిదినము తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపవలెను" (లూకా. 9:23). క్రీస్తు సిలువకు వెళ్లుటలో ఆయన



యొక్క ఉద్దేశ్యమేమనగా, గొప్ప అనుచరుల గుంపు ఆయనను వెంబడించాలి. దీనికి కారణము యేసు మరలా మృతిపొందాలని కాదుగానీ, మనము మృతిపొందాలి. మీ సిలువను మోసుకొని నన్ను వెంబడించండి అని పిలుచుటలో ఆయన ఉద్ధేశ్యమేమనగా, మీరు వచ్చి మరణించండి. దారుణమైన శిక్ష అమలు చేయబడే స్థలమే సిలువయైయున్నది. యేసు దినములలో సిలువను ఆభరణముగా ధరించుట ఊహించలేనిదిగా ఉండవచ్చు. అది ఒక విద్యుత్ కుర్చీ లేక ఉరితాడు ధరించునట్లుగా ఉంటుంది. ఆ అనుభవము అయితే ఆయన మాటలు భీకరమైన ప్రభావమను కలిగించియుండాలి; "తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపనివాడు నాకు పాత్రుడు కాడు (మత్తయి. 10:38).

కాబట్టి ఈ రోజున ఆమాటలు ఆదరణకలుగజేస్తున్నాయి. ఆమాటల యొక్క అర్థము ఏమనగా, యేసును నా రక్షకునిగా మరియు ప్రభువుగా చేసికొని ఆయనను వెంబడించినప్పుడు కనీసము పాతదైన స్వయం–నిర్ణయాలు, స్వయం– ఆకర్షణలు సిలువవేయబడాలి. ప్రతి దినము పాపమునకు మృతిపొంది, దేవునికొరకు జీవించుచున్నానని జ్ఞప్తికి తెచ్చుకోవాలి. ఇదే జీవిత మార్గమైయున్నది, "అటువలె మీరును పాపము విషయమై మృతులుగాను, దేవుని విషయమై క్రీస్తుయేసునందు సజీవులుగాను మిమ్మును మీరే యెంచుకొనుడి" (రోమా 6:11)

అయితే కల్వరి మార్గములో అనుచరులుగా వెళ్లడమంటే మరియెక్కువైనది. దాని అర్థము ఏమనగా, యేసు మరణించాడు అందువలన మనము ఆయనపై మోపబడిన నిందను భరించాలి. "కావున యేసు.. గవిని వెలుపట శ్రమపొందెను. కాబట్టి మనమాయన నిందను భరించుచు శిబిరము వెలుపలికి ఆయన యొద్దకు వెళ్లుదము" (హెబ్రీ 13:12–13). అయితే కేవలము నింద మాత్రమే కాదు. ఒకవేళ అవసరమైతే హతసాక్షులు అవ్వాలి. యేసు యొక్క అనుచరులను గూర్చి బైబిలు గ్రంథము ఈ విధంగా తెలియజేస్తుంది; "వారు గొఱ్ఱెపిల్ల రక్తమును బట్టియు, తామిచ్చిన సాక్ష్యమును బట్టియు వానిని జయించియున్నారు గాని, మరణము వరకు తమ ప్రాణములను ప్రేమించిన వారు కారు (ప్రకటన 12:11). దేవుని గొఱ్ఱెపిల్ల రక్తము చిందించినది కాబట్టి ఆయన రక్తములో విశ్వాసముంచుట ద్వారా మరియు మనము రక్తము కార్చుటవలన దుష్టుని జయించుచున్నాము. యేసు ఈ కల్వరి మార్గములో రమ్మని పిలుచుచున్నాడు. ఇది చాలా కఠినమైన శ్రేష్ఠమైన జీవితము. రండి.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

39

# మరణభయము అనే బంధకము నుండి విడిపించుటకు

*కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు గలవారైనందున ఆ ప్రకారమే మరణము యొక్క బలము గలవానిని, అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతయు మరణభయము చేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును ఆయన కూడ రక్తమాంసములలో పాలివాడాయెను.*

హెబ్రీ. *2:14-15.*

**యే**సు, సాతానుని నరహంతకుడని పిలచెను. "ఆది నుండి వాడు నరహంతకుడై యుండి సత్యమందు నిలచినవాడు కాడు; వానియందు సత్యమే లేదు... వాడు అబద్ధికుడును అబద్ధమునకు జనకుడునైయున్నాడు" (యోహాను. 8:44). అయితే చంపడము వాడి ముఖ్య ఉద్దేశ్యము కాదు. నరకమేవాని ఉద్ధేశ్యము. నిజానికి, తన అనుచరులందరూ విలాసవంతమైన జీవితము జీవించాలని కోరుకుంటాడు శ్రమపడుచున్న పరిశుద్ధులను గేలిచేసి, నరకము యొక్క భయంకరమైన సంగతులను మరుగుచేస్తాడు.

మనుష్యులను నరకములోనికి నెట్టే శక్తి వానికి లేదు, గానీ వాడు ప్రేరేపించే పాపము మరియు వాడు చెప్పే అబద్ధములలోనే ఉంది. ఒక వ్యక్తిని నరకములోనికి నెట్టే ఒకే ఒక విషయమేమిటంటే, క్షమించబడని పాపము. మంత్రము, ఇంద్రజాలము, క్షుద్రసాధనాలు, శపించుట, చిల్లంగితనము, కర్ణపిశాచములు వంటివి ఒక వ్యక్తిని నరకములోనికి నెట్టలేవు (దేవుడు క్షమిస్తాడు). ఇవన్నియు దుష్టుని యొక్క గుర్తులు మరియు కార్యములైయున్నవి. ఒకే ఒక్క మరణాయుధం వాడు కలిగియున్నదేమంటే–మనలను మోసపుచ్చుట క్రీస్తును హెచ్చించుట కంటే స్వయం – హెచ్చింపు కోరదగినదని, నీతి కంటే పాపము చెప్పుట వాడి ప్రధానమైన అబద్ధము. వాని చేతిలో నుండి ఆ ఆయుధమును తీసివేస్తే, నిత్య మరణము యొక్క శక్తి వానికి ఇంకెంత మాత్రము ఉండదు.

ఆ పనిని చేయడానికే యేసు వచ్చారు – సాతాను యొక్క చేతినుండి ఆ ఆయుధమును తీసి వేయాలనే. ఇది చేయుటకు క్రీస్తు మన పాపములను ఆయన మీద వేసుకొని, వారికోసము శ్రమపొందెను. అది జరిగినప్పుడు, మనలను నాశనము



చేయుటకు ఆ ఆయుధములు పనిచేయవు. నిందిస్తున్నారా? అవును. హేళన చేస్తున్నారా? అవును.కానీ నరకములోనికి నెడతారా? లేదు. మన స్థానములో క్రీస్తు శాపమును పొందెను. సాతాను ప్రయత్నిస్తాడు, కానీ మనలను నాశనము చేయలేడు. దేవుని ఉగ్రత తొలగించబడినది. ఆయన కృప మనకు కవచమైయున్నది. మరియు సాతాను మనలను అధిగమించలేడు.

ఈ విడుదలను పూర్తి చేయడానికి, క్రీస్తు మానవ స్వభావమును పొందవలసియున్నది, ఎందుకంటే అలాకాకుంటే, ఆయన మరణమును అనుభవించలేడు. దేవుని కుమారుని యొక్క మరణము మాత్రమే మరణము యొక్క బలము గలవానిని నాశనము చేయగలదు. అందువలన బైబిలు గ్రంథము చెబుతుంది, "కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు (=మానవ స్వభావము) గలవారైనందున ఆ ప్రకారమే (=మానవ స్వభావము కలిగి) మరణము యొక్క బలము గలవానిని, అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకును, ..... ఆయన కూడ రక్తమాంసములలో పాలివాడాయెను (హెబ్రీ. 2:14). క్రీస్తు పాపముల నిమిత్తము మరణించునప్పుడు వాని యొక్క ఒక్కే ఒక్క ఆయుధమైన–క్షమించబడని (ఒప్పుకొనని) పాపమును తీసికొనెను.

ఈ విధముగా చేయుటలో భయమునుండి విడుదల కలుగజేయడమే క్రీస్తు యొక్క ముఖ్య ఉద్దేశ్యము. ఆయన మరణించి, విడుదల కలుగజేసెను, ''జీవితకాలమంతయు మరణభయము చేత దాస్యమునకు లోబడిన వారిని విడిపించుటకు" (హెబ్రీ 2:15). మరణ భయము మనలను దాసులుగా చేస్తుంది. అది మనలను పిరికివారిగాను మొద్దుగా చేస్తుంది. మనలను విమోచించుటకు యేసు మరణించెను. స్వయం–అభిమానము ప్రేమతో మరణభయమును నాశనము చేసినప్పుడు, స్వయం–భద్రత, చీకాకు విరుగగొట్టబడతాయి. తన జీవితము ఇచ్చుటకు కూడా వెనుకాడని, క్రీస్తు వంటి ప్రేమ కలిగియుండునట్లు విడుదల చేయబడుదుము.

దుష్టుడు మన శరీరమును చంపును గానీ, మన ఆత్మను వాడు ఇంకెంత మాత్రము చంపలేడు. క్రీస్తులో అది క్షేమముగా ఉంది. మరియు మర్త్యమైన ఈ శరీరముకూడా ఒక దినమున లేపబడుతుంది; "మృతులలో నుండి యేసును లేపినవాని ఆత్మ మీలో నివసించినయెడల, మృతులలో నుండి క్రీస్తుయేసును లేపినవాడు చావునకు లోనైన మీ శరీరములను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మ ద్వారా జీవింపజేయును" (రోమా. 8:11). అందరికంటే మనము స్వతంత్రులుగా చేయబడ్డాము. ఈ స్వాతంత్ర్యము ఎందుకు ఇవ్వబడినదో బైబిలు గ్రంథము స్పష్టముగా తెలియజేయుచున్నది, "సహోదరులారా, మీరు స్వతంత్రులుగా ఉండుటకు పిలువబడితిరి. అయితే ఒక మాట, ఆ స్వాతంత్ర్యమును శారీరక్రియలకు హేతువు చేసికొనక, ప్రేమకలిగినవారై యొకనికొకడు దాసులైయుండుడి" (గలతీ. 5:13).

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

40

# మరణానంతరము ఆయనతో మనముండునట్లు

*మనము మేలుకొని యున్నను నిద్రపోవుచున్నను తనతో కూడ జీవించు నిమిత్తము ఆయన మనకొరకు మృతి పొందెను.*
*1 థెస్సలోనీక. 5:10*

*నామట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము... ఈ రెంటి మధ్యను ఇరుకునబడియున్నాను. నేను వెడలిపోయి క్రీస్తుతో కూడ నుండవలెనని నాకు ఆశయున్నది. అది నాకు మరిమేలు.*
*ఫిలిప్పీ. 1:21,23.*

*ఇట్లు ధైర్యము గలిగి యీ దేహమును విడిచిపెట్టి ప్రభువునొద్ద నివసించుటకు ఇష్టపడుచున్నాము.*
*1 కొరింథీ. 5:8.*

**బై**బిలు గ్రంథము మన దేహములను చెడ్డదిగా చూడదు. దేహమనేది సంతోషముగా విడిచిపెట్టుకొనవలసిన బరువు అని బావించే ప్రాచీన గ్రీకు మతములు వంటిది క్రైస్తవ్యము కాదు. లేదు, మరణమే శత్రువు. మన దేహములు మృతిపొందినప్పుడు, ప్రశస్తమైన దానిని మనము పోగొట్టుకొనుచున్నాము. క్రీస్తు దేహమునకు కాదు గానీ శరీరత్వమునకు వ్యతిరేఖము. బైబిలు స్పష్టముగా చెప్పేదేమంటే; "దేహము జారత్వము నిమిత్తము కాదు గాని, ప్రభువు నిమిత్తమే; ప్రభువు దేహము నిమిత్తమే" (1 కొరింథీ. 6:13). ప్రభువు దేహము నిమిత్తమే! అను మాట అద్భుతమైనది.

అయితే దేహము లేకుండా జీవము మరియు మనస్సాక్షి లేవు అని చెప్పేంత వరకూ మనము వెళ్లకూడదు. బైబిలు గ్రంథము ఈ విషయమును బోధించుట లేదు. కేవలము శరీరమును విమోచించుటకు మాత్రమే క్రీస్తు మరణించెను అయితే శరీరము లేకపోయినా ఆయనతో పాటు మనము ఉండునట్లు, ఆత్మను తన కొరకై బంధించుకొనెను. మరణము, జీవము పట్ల ఇది ఒక గొప్ప ఆదరణయైయున్నది, మరియు క్రీస్తు మరణించాడు గనుక మనము ఈ నిరీక్షణ యందు సంతోషించెదము.

ఒక విధముగా, మరణము ద్వారా దేహమును కోల్పోవుట వలన ఒకరకమైన ఖాళీగా ఉంటుందని బైబిలు గ్రంథము బోధించుచున్నది; "గుడారములో (=దేహము) నున్న మనము భారము మోసికొని మూల్గుచున్నాము" ఇది తీసి వేయవలెనని కాదు గాని... ఆ నివాసమును దీనిపైన ధరించుకొనగోరుచున్నాము" (2 కొరింథీ. 5:4). మరియొక మాటలో, మధ్యలో సమాధిలోనికి వెళ్లకుండా మనము నేరుగా ఇక్కడనుండి పునరుత్థాన దేహమునకు మార్పు చెందెదము. క్రీస్తు తిరిగి వచ్చునప్పుడు సజీవులైన వారు పొందుకునే అనుభవము అదే. అయితే వేరొకవిధముగా, మన యొక్క ఆత్మలు పరలోకములో ఉండి మరియు మన దేహములు సమాధిలో ఉండే ఆ మధ్య సమయమును గూర్చి బైబిలు గ్రంథము ప్రసిద్ధి చేస్తుంది. ఇది చివరి మహిమ కాదుగాని ఇది మహిమకరమైనది. మనము ఈ విధంగా చదివెదము, "బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము" (ఫిలిప్పీ 1:21). "లాభము" ! అవును, కొంతకాలమువరకు దేహమును కోల్పోవుట. ఒక విధముగా, "తీసివేయబడుట". అయితే అన్నిటికంటే ఎక్కువగా ఇది "లాభమై" యున్నది. ఎందుకు? ఎందుకంటే క్రైస్తవులకు మరణమంటే క్రీస్తు గృహమునకు చేరుటయే, అపోస్తులుడైన పౌలు చెప్పుచున్నట్లు; నేను వెడలిపోయి క్రీస్తుతో కూడ నుండవలెనని నాకు ఆశయున్నది, అది నాకు మరి మేలు" (ఫిలిప్పీ 1:23).

"మరిమేలు" ! అయినను అన్ని విధాల అది మేలైనది కాదు. ఈ దేహము ఆరోగ్యముగా, మహిమలో లేపబడినప్పుడు అది వస్తుంది. అయినప్పటికి "మరిమేలు" క్రీస్తుతో పాటు మరింత చేరువుగా, మరియెక్కువగా ఆయనతో "నివాసము" చేయుదము. అందుకే ఆది క్రైస్తవులు ఇట్లు చెప్పారు: "యీ దేహమును విడచిపెట్టి ప్రభువునొద్ద నివసించుటకు ఇష్టపడుచున్నాము" (2 కొరింథీ. 5:8). క్రీస్తులో విశ్వాసముంచిన మనము మరణించినప్పుడు ఉనికిని కోల్పోము. "ఆత్మ విశ్రాంతి"లాంటి ఒక స్థితికి మనము వెళ్లము. మనము క్రీస్తుతో కూడా ఉండుటకు వెళ్లుదుము. మనము ఆయన నివాసములో ఉన్నాము. అది మరిమేలైనది. అది లాభమే.

క్రీస్తు శ్రమ పొందిన గొప్ప హేతువులలో ఇది ఒకటి. ''మనము మేలుకొనియున్నను నిద్రపోవుచున్నను తనతో కూడ జీవించునిమిత్తము ఆయన మన కొరకు మృతిపొందెను" (1 థెస్సలోనిక 5:10). నిద్రించుచున్నట్లు, దేహము సమాధిలో ఉంటుంది. అయితే మనము పరలోకములో క్రీస్తుతో కూడ నివసించెదము. అయితే దానిని క్లుప్తముగా చెప్పాలంటే, క్రీస్తుతో కూడనుండుట మాటలకందనంత శ్రేష్ఠమైనది.

# 41

# మరణము నుండి మన పునరుత్థానము బద్ధపరచుటకు

*మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమైన యెడల, ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యముగల వారమై యుందుము.*
*రోమా. 6:5*

*మృతులలో నుండి యేసును లేపిన వాని ఆత్మ మీలో నివసించిన యెడల, మృతులలో నుండి క్రీస్తు యేసును లేపినవాడు చావునకులోనైన మీ శరీరములను కూడ మీలో నివసించుచున్న తన ఆత్మ ద్వారా జీవింపజేయును.*
*రోమా. 8:11*

*మనమాయనతో కూడ చనిపోయినవారమైతే*
*ఆయనతో కూడ బ్రదుకుదుము*
*2 తిమోతి. 2:11*

**క్రీ**స్తు యొక్క సమాధిలోపల మరణము యొక్క తాళపుచెవి వ్రేలాడదీయబడినది. వెలుపలినుండి క్రీస్తు ఎన్నో అద్భుతమైన కార్యలు చేసాడు- పండ్రెండు సంవత్సరముల బాలికను లేపుట, ఇద్దరు మనష్యులను మరణం నుండి లేపుట-అయితే మరలా వారు మరణిస్తారు (మార్కు 5:41-42, లూకా 7:14-15, యోహాను 11:43-44). మరలా మరణించకుండా ఎవరైనా మృతులలో నుండి లేపబడాలి అంటే, క్రీస్తు వారికొరకు మరణించి, సమాధిలోకి ప్రవేశించి, ఆతాళపుచెవి తీసికొని, లోననుండే మరణమను ద్వారమును తెరచెను.

యేసు యొక్క పునరుత్థానము దేవుని యొక్క బహుమానమును తన ప్రజల యొక్క పాపములు తుడచివేయటలో సంపూర్ణముగా విజయవంతమైనదనుటకు ఋజువుగా ఉన్నది, మరియు దేవుని ఉగ్రతను తొలగించుచున్నది. "అందువలన" అనే మాటలో దీనిని మనము చూడవచ్చును. క్రీస్తు "మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్నుతాను తగ్గించుకొనెను. అందుచేతను... దేవుడు ఆయనను అధికముగా" హెచ్చించెను (ఫిలిప్పీ. 2:8-9). సిలువ మీద నుండి దేవుని కుమారుడు "సమాప్తమైనదని" చెప్పెను. (యోహాను 19:30). మరియు పునరుత్థానమగుట ద్వారా, తండ్రియైన దేవుడు "ఇది వాస్తవముగా సమాప్తమయ్యెను" అని చెప్పెను. మన పాపముల కొరకు మూల్యం చెల్లించబడుట, మనలను నీతిమంతులుగా చేయుట మరియు దేవుని నీతిని సంతృప్తి పరుచుట అనే కార్యములు యేసు మరణములో నెరవేర్చబడినవి.



ఇప్పుడు, ఆయన యొద్దకు విశ్వాసముతో వచ్చువారందరికీ మరణము యొక్క తాళపుచెవిని సమాధిలో నుండి తీసుకొని ద్వారమును తెరువజేయగల అధికారము మరియు హక్కు ఆయన కలిగియున్నారు. ఒక వేళ పాపము పరిహరించబడితే, మరియు నీతి ఇవ్వబడితే మరియు, దేవుని నీతి సంతృప్తపరచబడితే, క్రీస్తును గాని ఆయన ప్రజలను గానీ ఏవీ సమాధిలో ఉంచలేవు. అందుకే యేసు ఎలుగెత్తి చెప్పెను, "మృతుడనైతిని గాని ఇదిగో యుగయుగములు సజీవుడనై యున్నాను. మరియు మరణము యొక్క... తాళపుచెవులు నా స్వాధీనములో ఉన్నవి" (1:18).

యేసునకు చెందియుండటమంటే మరణములో నుండి ఆయనతో పాటు లేపబడుటయే అనే సత్యమును బైబిలు గ్రంధము చెబుతుంది. " ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమైన యెడల, ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యముగలవారమై యుందుము (రోమా 6:5). "యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించిన వారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును" (1 థెస్సలోనీక 4:14). "దేవుడు ప్రభువును లెపెను; మనలను కూడ తన శక్తివలన లేపును.

క్రీస్తు మరణమునకు మరియు మన పునరుత్థానమునకు మధ్య సంబంధము ఇచ్చట ఉంది: "మరణపుముల్లు పాపము; పాపమునకున్న బలము ధర్మశాస్త్రమే" (1 కొరింథీ 15:56). అనగా, మనమందరము పాపము చేసాము, మరియు ధర్మశాస్త్రము పాపులను నిత్య మరణమనే శిక్షావిధి కలుగజేస్తుంది. అయితే వాక్యము ఈ విధంగా కొనసాగుతుంది; "మన ప్రభువైన యేసు క్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక" (57వ వచనం). మరియొక మాటలో, ధర్మశాస్త్రము కొరునది యేసు యొక్క జీవము మరియు మరణములలో నెరవేర్చబడినది. కాబట్టి, పాపములు క్షమించబడినవి. అందువలన, పాపము యొక్క ముల్లు తొలగించబడినది. కాబట్టి, క్రీస్తు నందు విశ్వాసముంచు వారు నిత్యమరణమనే శిక్షను పొందరు, కానీ "మృతులు అక్షయులుగా లేపబడుదురు". అప్పుడు "విజయమందు మరణము మ్రింగివేయబడెను" అని వ్రాయబడిన మాటలు నెరవేర్చబడతాయి (1 కొరింథీ 15:52,54). ఆనందించండి, క్రీస్తు చెంతకు రండి. ఆయన మిమ్మును ఆహ్వానించుచున్నాడు; "పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును" (యోహాను. 11:25).

యేసు మరణించుటకు హేతువేమనగా :

42

# ప్రధానులను, అధికారులను నిరాయుధులనుగా చేయుటకు

*మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి... ఆయన ప్రధానులను అధికారులను నిరాయుధులనుగా చేసి, సిలువచేత జయోత్సవముతో వారిని పట్టితెచ్చి బాహటముగా వేడుకకు కనుపరచెను.*

*కొలస్సీ. 2 :14-15.*

*అపవాది యొక్క క్రియలను లయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను*

*1 యోహాను. 3:8.*

**బై**బిలు గ్రంథములో "ప్రధానులు, అధికారము" మానవ ప్రభుత్వమునకు ఆరోపించవచ్చును. అయితే, క్రీస్తు "ప్రధానులను అధికారులను నిరాయుధులనుగా" చేసెను మరియు "బాహటముగా వేడుకకు కనపరచెను" మరియు "జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి" అని చదువుతున్నప్పుడు, అవి ఈ లోకమును బాధించుచున్న దయ్యపు శక్తులని ఆలోచన చేసుకోవాలి. ఈ దుష్టశక్తులను గూర్చి స్పష్టముగా చెప్పబడిన వాక్యభాగములలో ఎఫెసీ 6:12 ఒకటి. అది చెప్పునదేమనగా క్రైస్తవులు, "పోరాడునది శరీరులతో కాదు, గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకారసంబంధులగు లోకనాదులతోను ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము".

సాతానుడు "ఈ లోక అధికారిగా" మూడుసార్లు పిలవబడ్డాడు. యేసుక్రీస్తు తన జీవితపు చివరి ఘడియలలో ఉన్నప్పుడు ఆయన ఇట్లు చెప్పెను. "ఇప్పుడు ఈ లోకమునకు తీర్పు జరుగుచున్నది'' ఇప్పుడు ఈ లోకాధికారి బయటకు త్రోసివేయబడును" (యోహాను 12:31). "ఈ లోక అధికారియైన" దుష్టుడు యేసు యొక్క మరణము ద్వారా నిశ్చయముగా ఓడించబడెను. మరియు సాతాను వెళ్లిపోవుట వలన, వాని యొక్క పతనమైన దూతలు కూడ వెళ్లిపోవును. క్రీస్తు మరణించినపుడు నిశ్చయమైన ఓటమి దెబ్బను వారందరు పొందారు.

వారు ఉనికిలో లేరని కాదు. ఇప్పుడు కూడా వారితో మనము పోరాడుచున్నాము. అంతిమ విజయము మనదే అని మనమెరుగుదుము.ఒక మహా ఘటసర్పము యొక్క తల నరకబడి, రక్తము కారి చనిపోయేంత వరకూ కొట్టబడియుండుటను ఇది



పోలియున్నది. యుద్ధము గెలవబడినది. అయితే వాడు చేయు నష్టమును గూర్చి మనము ఇంకనూ జాగ్రత్తగా ఉండాలి.

యేసు మరణములో, దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దాని మీది చేవ్రాతను తుడిచివేసెను" (కొలస్సీ. 2:14, 7వ అధ్యాయము చూడండి). ఈ విధముగా ఆయన "ప్రధానులను అధికారులను నిరాయుధులనుగా చేసి,... బాహటముగా వేడుకకు కనపరెచెను". మరియొక మాటలో, క్రీస్తు మన ఋణములను రద్దుచేసినందున, దేవుని ధర్మశాస్త్రము మనమీద ఇంకెంతమాత్రము దోషారోపణ చేయదు గనుక సాతానుడు మనలను నిందించుటకు వానికి స్థానము లేదు.

దేవుని ప్రజలపై క్రీస్తు యెదుట నేరారోపణ చేయుట దుష్టునియొక్క ప్రధాన కార్యము. సాతాను అనే మాటకు "అపవాది లేదా నేరారోపణ చేయువాడని" అర్థము. అయితే, క్రీస్తు మరణించినప్పుడు ఏమి జరిగిందోవినండి. అపోస్తులుడైన యోహాను చెప్పిన మాటలు ఇవి: "మన సహోదరుల మీద నేరము మోపువాడైన అపవాది పడద్రోయబడియున్నాడు గనుక ఇప్పుడు రక్షణయు శక్తియు రాజ్యమును మన దేవునివాయెను; ఇప్పుడు అధికారము ఆయన క్రీస్తుదాయెను" (ప్రకటన. 12:10). ప్రధానులను, అధికారులను నిరాయుధులనుగా చేసి ఓడించుట అంటే ఇదే.

ఇప్పుడు క్రీస్తులో, దేవుని ప్రజలకు వ్యతిరేఖముగా చేయబడిన ఏ నేరారోపణ నిలువబడదు. "దేవుని చేత ఏర్పరచబడిన వారిమీద నేరము మోపువాడెవడు? నీతిమంతులుగా తీర్చువాడు దేవుడే" (రోమా 8:33). మనుష్యుడు గాని లేదా సాతానుడు గాని నేరారోపణ చేయలేరు. న్యాయ సంబంధమైన వివాదము ముగించబడినది. క్రీస్తే మన నీతిమత్వము. మన మీద నేరము మోపువాడు నిరాయుధుడైనాడు. ఒక వేళ పరలోకపు సన్నిధిలో వాడు మాటలాడటానికి ప్రయత్నిస్తే సిగ్గువాని ముఖమును కప్పుతుంది. ఆహా! లోకములో క్రీస్తుకు సేవచేసి, ప్రజలను ప్రేమించుటకు వెదకుట ఎంత ధైర్యము మరియు స్వేచ్ఛ గలిగిన సంగతి! క్రీస్తులో ఉన్నవారికి ఏ శిక్షా విధియు లేదు. దుష్టుని యొక్క శోధనలనుండి వెనుకకు మరలుదము. వాని వాగ్దానములు అబద్ధమైనవి మరియు వాని శక్తి తీసివేయబడినది.

యేసు మరణించుటకు హేతువేమనగా :

43

# సువార్తలో ఉన్న దేవుని శక్తిని బయలుపరచుటకు

*సిలువను గూర్చిన వార్త, నశించుచున్న వారికి వెఱ్ఱితము గాని*
*రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి.*
*1 కొరింథీ. 1:18.*

*సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి,*
*మొదట యూదునికి, గ్రీసుదేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు*
*అది దేవుని శక్తియైయున్నది.*
*రోమా. 1:16.*

**సు**వార్త అంటే శుభవార్త అని అర్థము. అది దైవశాస్త్రము కావటానికి మునుపు అది వార్తయైయున్నది. ఒక ప్రాముఖ్యమైన జరిగిన సంగతిని తెలియజేయడమే వార్త. ప్రజలందరు సంతోషించునట్లు జరిగిన ఒక విషయమును ప్రకటించుటయే సువార్త. సువార్త అనేది శ్రేష్ఠమైన వార్త ఎందుకంటే, అది తెలియజెప్పే విషయము ప్రజలకు సదా ఆనందము కలుగజేస్తుంది.

క్రీస్తు యొక్క మరణము మరియు పునరుత్థానమును సువార్త తెలుపుతుంది. అపోస్తులుడైన పౌలు సువార్తయొక్క శ్రేష్ఠతను ఇట్లు స్పష్టము చేయుచున్నాడు:

> *"నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచుచున్నాను... అదేమనగా, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి పొందెను, సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను... అటుపిమ్మట ఐదువందలకు ఎక్కువైన సహోదరులకు ఒక్క సమయమందే కనబడెను. వీరిలో అనేకులు ఇప్పటివరకూ నిలచియున్నారు" (1 కొరింథీ 15:1-7).*

సువార్త యొక్క ముఖ్యాంశము ఏమనగా, "క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను.... సమాధిచేయబడెను. ఐదువందలకు ఎక్కువైన సహోదరులకు కనబడెను". వీరిలో అనేకమంది సాక్షులు ఇప్పటివరకు నిలచియున్నారు అనునది సువార్తలో యధార్థ సత్యమును చూపించుచున్నది. ఆయన ఉద్దేశ్యమేమనగా, తన పాఠకులు జీవించుచున్న కొంతమంది సాక్షులను కనుగొని, సంశయములను



తీర్చుకొనవచ్చును. సువార్త అనేది యదార్థ విషయాల యొక్క వార్తయైయున్నది. మరియు ఆ యదార్థ విషయాలు పరీక్షించబడినవి. యేసు యొక్క మరణము, భూస్థాపన మరియు పునరుత్థానమును గూర్చిన సాక్ష్యులు అక్కడఉన్నారు. అయితే విచారకరమైన విషయమేమంటే, అనేకమందికి ఈ సువార్త వెఱ్ఱితనముగా కనిపిస్తుంది. పౌలు చెప్పెను. "సిలువను గూర్చిన వార్త, నశించుచున్న వారికి వెఱ్ఱితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి" (1 కొరింథీ. 1:18). ఈ శక్తిని బయలుపరచటానికే క్రీస్తు మరణించెను. " సువార్త ... నమ్ము ప్రతివానికి... రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది" (రోమా 1:16).

క్రీస్తు మరణము శుభవార్తగా అందరూ ఎందుకు చూడలేకపోతున్నారు? దానిని నమ్మటానికి ముందు అది సత్యమైనదని, మంచిదని చూడాలి. కాబట్టి ప్రశ్న ఏమిటంటే: కొంతమంది దానిని సత్యముగాను, మంచిగాను చూడ గలిగి, మరికొందమంది దానిని ఆవిధముగా ఎందుకు చూడలేకపోతున్నారు? దానికి ఒక జవాబు 2 కొరింథీ. 4:4. లో ఇవ్వబడినది "ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనోనేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను". దానితో పాటు, పాపముతో నిండిన మానవ స్వభావము ఆత్మీయ సత్యమును గ్రహించుటలో మృతమైయున్నది. "ప్రకృతి సంబంధియైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు, అవి అతనికి వెఱ్ఱితనముగా ఉన్నవి" (1 కొరింథీ. 2:14).

ఎవరైనా సువార్తను సత్యమైనదిగా మంచిదిగా చూస్తున్నారంటే, సాతాను కలిగించే గ్రుడ్డితనమును, ప్రకృతి సంబంధమైన మృత స్వభావమును దేవుని శక్తి చేత అధగమించారని అర్థము. అందును బట్టి బైబిలు గ్రంధము చెబుతుంది, అనేక మందికి సువార్త వెఱ్ఱితనముగా ఉండినప్పటికీ, "పిలువబడిన వారికే క్రీస్తు దేవుని శక్తియును దేవుని జ్ఞానమునైయున్నాడు" (1 కొరింథీ. 1:24). ప్రకృతి సంబంధమైన మృత స్వభావము మరియు సాతాను గ్రుడ్డితనము తొలగించుట దేవుని కనికరమైయున్నది, అందువలన క్రీస్తును సత్యముగా, మంచిగా చూడగలుగు చున్నాము. ఈ కనికరమైన కార్యము క్రీస్తు రక్తము చిందించుట ద్వారా ఇచ్చిన బహుమానమైయున్నది. ఆయన వైపు చూడండి, క్రీస్తు సువార్తను చూచి హత్తుకొనుటకు సహాయము చేయునట్లు దేవునికి ప్రార్థన చేయండి.

యేసు మరణించుటకు హేతువేమనగా :

# 44

# జనముల మధ్య ద్వేషమును తొలగించుటకు

*ఆయన మన సమాధానమైయుండి మీకును మాకును ఉండిన ద్వేషమును, అనగా విధిరూపకమైన ఆజ్ఞలుగల గల ధర్మశాస్త్రమును, తన శరీరమందు కొట్టివేయుట చేత మధ్య గోడను పడగొట్టి, మన ఉభయులను ఏకముచేసెను. ఇట్లు సంధిచేయుచు ఈ యిద్దరినీ తన యందు ఒక్క నూతన పురుషునిగా సృష్టించి తన సిలువ వలన ఆ ద్వేషమును సంహరించి, దాని ద్వారావీరిద్దరిని ఏక శరీరముగా చేసి, దేవునితో సమాధానపరచవలెనని యిలాగు చేసెను. గనుక ఆయన యే మనకు సమాధానకారకుడైయున్నాడు.*

*ఎఫెసీ. 2:14–16.*

క్రొత్త నిబంధనలో యూదులు మరియు అన్యులు (యూదులు కానివారు) మధ్య ఉండే అసూయ, ఈర్ష్య మరియు ఒత్తిడిని కలిగించే వైకిరి, ఈ దినమున మన మధ్య ఉండే వర్గ, ప్రాంతీయ జాతీయ ద్వేషముల కంటే మిక్కిలి తీవ్రమైనవి. కేఫా (కొన్నిసార్లు పేతురు అని పిలులబడెను) మరియు పౌలుకు మధ్య అంతియొకయలో ఏది జరిగినదో అది ఈ వివాదములకు ఒక ఉదాహరణ. పౌలు ఆ వృత్తాంతాన్ని ఇట్లు చెప్పుచున్నాడు : "అయితే కేఫా అంతియొకయకు వచ్చినప్పుడు అతడు అపరాధిగా తీర్చబడెను. గనుక నేను ముఖాముఖిగా అతనిని ఎదిరించితిని; ఎలయనగా యాకోబు నొద్ద నుండి కొందరు రాకమునుపు అతడు అన్య జనులతో భోజనము చేయుచుండెను. గాని వారు రాగానే సున్నతి పొందిన వారికి భయపడి వెనుక తీసి వేరై పోయెను". (గలతీ. 2:11–12).

యేసుక్రీస్తులో స్వేచ్ఛ కలిగి పేతురు నివసించుచుండెను. ఆయన యూదయ క్రైస్తవుడై యుండగా యూదేతర క్రైస్తవులతో బోజనము చేయుచుండెను. అక్కడ వేరు చేయు గోడ ఏర్పడినది. ద్వేషమును అధికమించబడినది. దీనిని నేరవేర్చడానికే యేసు మరణించెను. అయితే అప్పుడు యూదుల సాంప్రదాయలములయందు శ్రద్ధ కలిగిన కొందరూ అంతియొకయకు వచ్చిరి. కేఫా విశ్మయమునొందాడు. వారి విమర్శలకు భయపడ్డాడు. కాబట్టి అన్య క్రైస్తవుల నుండి ఆయన వేరైపోయాడు.



ఇది జరుగుట అపోస్తుడైన పౌలు చూశాడు. ఆయనేమి చేసాడు? అంతస్థులను చూశాడా? అతిధులుగా వచ్చిన సాంప్రదాయ యూదుల మరియు స్వేచ్ఛ కలిగిన యూదా క్రైస్తవుల మధ్య సమాధానము కొనసాగిస్తాడా? పౌలు ప్రవర్తించిన తీరు ఈ వచనములో కనుగొనవచ్చు: " వారు సువార్త సత్యము చొప్పున క్రమముగా నడుచుకొనక పోవుట నేను చూచి నప్పుడు" (గలతీ. 2:14). ఇది చాలా క్లిష్టమైన మాట. వర్గ మరియు ప్రాంతీయ భేదములు సువార్తకు సంబంధించినవా! కేఫా భయపడి అన్య క్రైస్తవులతో సహవాసము మానుకొనుట "సువార్త సత్యము చొప్పున క్రమముగా నడుచుకొనకపోవుట". ఈ గోడను పడగొట్టటానికి క్రీస్తు మరణించెను. అయితే కేఫా దానిని తిరిగి కట్టుచున్నాడు.

కాబట్టి పౌలు అంతస్థులకు చోటు ఇవ్వలేదు, మరియు సువార్తను ఉపేక్షించే సమాధానమును ఆయన కొనసాగించలేదు. కేఫాను బహిరంగంగానే ఎదుర్కొన్నాడు, "నీవు యూదుడవైయుండియు యూదులవలెకాక అన్య జనులవలెనే ప్రవర్తించుచుండగా, అన్య జనులు యూదులవలె ప్రవర్తింపవలెనని యెందుకు బలవంతము చేయుచున్నావు"? (గలతీ. 2:14). మరియెక మాటలో యూదేతర క్రైస్తవులలో కేఫా వేరైనందున ఒక మృతమైన సూచన వారికి ఇచ్చినట్లుయింది, అదేమనగా: మీరు పూర్తిగా అంగీకరించబడాలి అంటే యూదులుగా మారాలి? ఈ సంగతిని నిర్మూలించడానికే క్రీస్తు మరణించాడు.

యేసు మరణించుట వలన జనములందరు (దేవునితో) సమాధానపరచబడుటకు ఒక నూతన మార్గము ఏర్పరచెను. సాంప్రదాయాలు, వర్గభేదాలు ఆనందముగా కలసిఉండుటకు స్థానము కాదు. క్రీస్తే ఆస్థానమైయున్నారు. ఆయన ధర్మశాస్త్రమును సంపూర్ణముగా నెరవేర్చెను. మనుష్యులను వేరు చేసే అన్ని విషయాలు ఆయనలో ముగించబడినాయి–యేసుక్రీస్తు సువార్త మినహాయించి, అన్ని మతములు సమానమే అని చెప్పుట ద్వారా ఆయా వర్గాలలో నిత్యమై ఐక్యత నెరవేర్చుట అసాధ్యమైనది. యేసు క్రీస్తు దేవుని కుమారుడు. దేవుడు ఆయనను పాపులను రక్షించుటకు మరియు ఆయావర్గాల వారిని సమాధాన పరచుటకు ఒకే ఒక్క మార్గముగా పంపించెను. ఒకవేళ దీనిని మనము ఉపేక్షించినట్లయితే, ప్రజల మధ్య నిత్య ఐక్యత మరియు నిత్య నిరీక్షణ యొక్క పునాదిని మనము తక్కువచేస్తున్నట్లే. శిలువలో మరణించుట ద్వారా ఒక ప్రదేశానికి కాదుగానీ, యావత్ జగత్తుకు సంబంధించిన కార్యము నెరవేర్చబడినది. దేవుడు, మనుష్యుడు సమాధానపరచబడ్డారు. ఆయా జనముల వారు దీనిని కనుగొని, ఆనందించుచు వారు ఒకరునొకరు ప్రేమించి నిత్య సంతోషము పొందవలెను. దేవునికి మనకు మధ్య ఉన్న దూరమును అధిగమించుటలో, క్రీస్తు జనముల మధ్య దూరమును అధగమించెను.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 45

## ప్రతి వంశము, ఆయాభాషలు మాటలాడు వారికి, ప్రతి ప్రజ మరియు ప్రతి జనము కొరకు విమోచన క్రయధనముగా నుండుటకు.

*నీవు ఆ గ్రంథమును తీసుకొని దాని ముద్రలను విప్పుటకు యోగ్యుడవు, నీవు వధింపబడిన వాడవై నీరక్తమిచ్చి, ప్రతి వంశములోను, ఆయా భాషలు మాటలాడు వారిలోను, ప్రతి ప్రజలోను, ప్రతి జనములోను, దేవునికొరకు మనుష్యులను కొని, మా దేవునికి వారిని ఒక రాజ్యముగాను యాజకులనుగాను చేసితివి.*

*ప్రకటన. 5:9*

**ఇ**ది పరలోక దృశ్యము. దేవుని చేతిలో ఉన్న భవిష్యత్తును గూర్చిన క్షణ దర్శనము అపోస్తులుడైన యోహానుకు ఇవ్వబడినది. “మరియు లోపటను వెలుపటను వ్రాతకలిగి, యేడుముద్రలు గట్టిగా వేసియున్న యొక గ్రంథము సింహాసనమందు ఆసీనుడైయుండువాని కుడిచేత చూచితిని” (ప్రకటన 5:1). గ్రంథము విప్పబడుట ప్రపంచ భవిష్యత్ చరిత్ర బయలుపరచుటకు చిహ్నముగా ఉన్నది. ఆ గ్రంథమును విప్పుటకు ఎవరికి శక్తి లేనందున యోహాను ఏడ్చుచుండెను. అప్పుడు పరలోకపు పెద్ద చెప్పెను–“ఏడవకుము; ఇదిగో దావీదుకు చిగురైన యూదాగోత్రపు సింహము ఏడు ముద్రలను తీసి ఆ గ్రంథమును విప్పుటకై జయము పొందెను” (ప్రకటన 5:5). ఇది మెస్సియ అయిన యేసుక్రీస్తునకు వర్తిస్తుంది. తన మరణము మరియు పునరుత్థానము ద్వారా ఆయన జయించెను. అప్పుడు యోహాను ఆయనను చూచెను. “సింహాసనమునకును ఆనాలుగు జీవులకును పెద్దలకును మధ్యను, వధింపబడినట్లుండిన గొఱ్ఱెపిల్ల నిలిచియుండుట చూచితిని” (5:6).

అప్పుడు సింహాసనము చుట్టు ఉన్న పరలోకజీవులు సాగిలపడి క్రీస్తును ఆరాధించెను. వారు క్రొత్త పాటలు పాడుదురు. ఆశ్చర్యముగా, భవిష్యత్తును తెలియజేయు గ్రంథము విప్పుటకు క్రీస్తు మరణము యోగ్యత కలిగించినదని ఆ పాట ప్రకటించును. చరిత్రలో దేవుని బౌగోళిక ఉద్దేశ్యము నెరవేర్చబడుటకు క్రీస్తు మరణము ఆవశ్యకమనేది అన్వయింపు. “వారు క్రొత్త పాట పాడుదురు, ఏలాగనగా,, నీవు ఆ గ్రంథమును తీసికొని దాని ముద్రలను విప్పుటకు యోగ్యుడవు, నీవు వధింపబడిన వాడవై నీరక్తమిచ్చి, ప్రతి వంశములోను, ఆయా భాషలు మాటలాడువారిలోను, ప్రతి ప్రజలోను, ప్రతి జనములోను, దేవునికొరకు మనుష్యులను కొని” యున్నావు (5:9).



గొప్ప విభేదములు కలిగిన ప్రజలను రక్షించుటకు క్రీస్తు మరణించెను. పాపమునకు ఆయా సంస్కృతి అన్న భేదము లేదు. మనుష్యులందరు పాపము చేసారు.ప్రతీవంశము, సంస్కృతివారు దేవునితో సమాధానపరచబడాలి. పాపమనే వ్యాధి విశ్వవ్యాపితము గనుక పరిహారము కూడా విశ్వవ్యాపితము. యేసు సిలువ యొక్క వేదన వచ్చుట గ్రహించి తన ఉద్దేశ్యము యొక్క పరిధిని గూర్చి ధైర్యముగా ఇట్లు చెప్పెను: “నేను భూమి మీద నుండి పైకెత్తబడిన యెడల అందరిని నా యొద్దకు ఆకర్షించుకొందునని చెప్పెను” (యోహాను. 12:32). ఆయన మరణమును ఉద్దేశించుట ద్వారా ప్రపంచమును హత్తుకొనెను.

క్రైస్తవత్వము తూర్పున (దేశాలలో) ప్రారంభమైనది. అనేక శతాబ్దములు తరువాత పశ్చిమమునకు వ్యాప్తి చెందినది. అయితే ఇప్పుడు క్రైస్తవత్వము పశ్చిమదేశాల మతముగా కనిపించుట లేదు. ఇది క్రీస్తుకు ఆశ్చర్యమేమికాదు. ఇప్పటికే పాత నిబంధనలో ఆయన బౌగోళిక ఉద్దేశ్యము ప్రవచింపబడినది. “ భూదిగంతముల నివాసులందరు జ్ఞాపకము చేసికొని యెహోవావాతట్టు తిరిగెదరు. అన్య జనుల వంశస్థులందరు నీ సన్నిధిని నమస్కారము చేసెదరు” (కీర్తన. 22:27). “జనములు సంతోషించుచు ఉత్సాహ ధ్వని చేయును గాక” (కీర్తన. 67:4). తన పరిచర్య ముగింపునకు వచ్చినప్పుడు, ఆయన తన పరిచర్యను స్పష్టము చేసెను : “ క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలో నుండి లేచుననియు యెరుషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారు మనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది” (లూకా 24:46–47). తన శిష్యులకిచ్చిన ఆజ్ఞ సరియైనది, “కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి” (మత్తయి. 28:19).

యేసు క్రీస్తు ఒక తెగకు చెందిన దేవుడు కాదు. ఆయన ఒక సంస్కతికి లేక ఒక ప్రాంతీయ జనులకు మాత్రమే చెందినవాడు కాదు. ఆయన “ లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల” (యోహాను. 1:29). “యూదుడని గ్రీసు దేశస్థుడని భేదము లేదు; ఒక్క ప్రభువే అందరికి ప్రభువైయుండి, తనకు ప్రార్థన చేయువారందరియెడల కృపచూపుటకు ఐశ్వర్యవంతుడైయున్నాడు. ఎందుకనగా–ప్రభువు నామమునుబట్టి ప్రార్థనచేయు వాడెవడో వాడు రక్షింపబడును” (రోమా. 10:12–13). ఆయనకు ప్రార్థన చేయండి, విశ్వవ్యాపితముగా విమోచింపబడిన సమూహములో చేరండి.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 46

# ఈ లోకమందు తన గొఱ్ఱెలను సమకూర్చుటకు

*(కయప) తనంతటతానే యీలాగు చెప్పలేదు గాని ఆ సంవత్సరము ప్రధానయాజకుడైయుండెను గనుక యేసు ఆ జనము కొరకును, ఆజనము కొరకు మాత్రమే గాక చెదరిపోయిన దేవుని పిల్లలను ఏకముగా సమకూర్చుటకును, చావనైయున్నాడని ప్రవచించెను.*

*యోహాను. 11:51-52*

*ఈ దొడ్డివికాని వేరే గొఱ్ఱెలును నాకు కలవు; వాటిని కూడ నేను తోడుకొని రావలెను, అవి నా స్వరము వినును, అప్పుడు మంద ఒక్కటియు గొఱ్ఱెల కాపరి ఒక్కడును అగును.*

*యోహాను. 10:16.*

**ఒ**క గాడిద దానికి తెలియకుండా, దేవుని కొరకు మాటలాడగలదు (సంఖ్యా.కా. 22:28). అదే ప్రకారము ఒక ప్రసంగీకుడు లేదా ఒక యాజకుడు (మాటలాడుదురు). యేసు తన జీవితము అర్పించనుద్దేశించిన సందర్భములో ఇశ్రాయేలు వారికి ప్రధానయాజకుడైన కయపకు ఇలాగే జరిగింది. తనకు తెలియకుండగానే ఇశ్రాయేలు పెద్దలతో ఇట్లు చెప్పెను, " మన జనమంతయు నశింపకుండునట్లు ఒక మనుష్యుడు ప్రజలకొరకు చనిపోవుట మీకు ఉపయుక్తమని మీరు ఆలోచించుకొనరు" (యోహాను. 11:50). దీనికి రెండు అర్థాలు ఉన్నాయి. కయప యొక్క అర్థమేనమగా, రోమీయులు తమను రాజద్రోహులుగా గుర్తించి, ప్రజలను నాశనము చేయుట కంటే యేసు చనిపోవుటే మేలు. అయితే దేవుడు వెరొక అర్థము కలిగియున్నాడు. అందుకే బైబిలు గ్రంథము చెబుతుంది, " (కయప) తనంతట తానే యీలాగు చెప్పలేదు గాని ఆ సంవత్సరము ప్రధానయాజకుడై యుండెనుగనుక యేసు ఆ జనము కొరకును, ఆజనము కొరకు మాత్రమే గాక చెదరిపోయిన దేవుని పిల్లలను ఏకముగా సమకూర్చుటకును, చావనవైయున్నాడని ప్రవచించెను" (యోహాను. 11:51-52).

ఇదే విషయాన్ని యేసు తానే వేరొక ఉపమానముతో చెప్పెను. "చెదరిపోయిన దేవుని పిల్లలు" అనే మాటకు బదులు ఇశ్రాయేలు వారికి వేరైన "గొఱ్ఱెలను" గూర్చి యేసు మాటలాడెను; "ఈ దొడ్డివికాని వేరేగొఱ్ఱెలును నాకు కలవు; వాటిని కూడ నేను



తోడుకొని రావలెను, అవి నా స్వరము వినును, అప్పుడు మంద ఒక్కటియు గొఱ్ఱెలకాపరి ఒక్కడును అగును" (యోహాను 10:16).

దానిని గూర్చి ఈ రెండు విధములుగా చెప్పుట ఆశ్చర్యమును కలిగించుచున్నది. అవి బోధించునదేమనగా, ప్రపంచములో నుండే ప్రజలందరిని యేసు క్రీస్తు ద్వారా రక్షించుటకు దేవుడు ఎన్నుకున్నాడు. అక్కడ "చెదరిపోయిన దేవుని పిల్లలు "ఉన్నారు". దానర్థము ఏమంటే, తన కుమారుని కొరకు ప్రజలను సమకూర్చుటకు దేవుడు తీవ్రమైన శ్రద్ధ కలిగియున్నాడు. తన ప్రజలు శిష్యులను తయారు చేయాలని ఆయన ఆజ్ఞాపించెను, అయితే వారికంటే ముందుగా ఆయన వెళ్లును. తన దూతలు అక్కడకు వెళ్లుటకు ముందే ఆయన ప్రజలను ఏర్పాటు చేసుకుంటాడు. కాబట్టి, దేవుడు చేత ఏర్పాటు చేయబడి, క్రీస్తు యొద్దకు తీసుకురాబడిన మార్పుచెందిన వారికొరకు యేసు ఇట్లు పలికెను, "తండ్రి నాకు అనుగ్రహించు వారందరును నాయొద్దకు వత్తురు; నా యొద్దకు వచ్చువానిని నేనెంతమాత్రమును బయటికి త్రోసివేయను.... వారు నీవారై యుండిరి, నీవు వారిని నాకనుగ్రహించితివి" (యోహాను 6:37, 17:6).

దేవుడు భూమిమీద నున్న సమస్త జనముల వైపు చూచి, తన గొఱ్ఱెల మందలగా ఎంచి క్రీస్తు పేరట పరిచారకులను వారి యొద్దకు పంపించి తాను ఎన్నుకొనిన వారిని సరియైన సువార్త యొద్దకు నడిపించి, వారిని రక్షించుట మహా అధ్భుతమైన విషయము. వారు మరియొక విధముగా రక్షించబడలేరు. పరిచర్యలు ఆవశ్యకము. "గొఱ్ఱెలు అతని స్వరము వినును, అతడు తన సొంత గొఱ్ఱెలను పేరుపెట్టిపిలచి వాటిని వెలుపలికి నడిపించును.... గొఱ్ఱెలు అతని స్వరమెరుగును గనుక అవి అతనిని వెంబడించును" (యోహాను 10:3-4).

గొఱ్ఱెలు ఆయన స్వరము విని, జీవించు లాగున యేసు శ్రమపొంది మరణించెను. అదే విషయాన్ని తనకు తెలియకుండా, కయప చెప్పెను; "యేసు... ఆ జనము కొరకు మాత్రమే గాక చెదరిపోయిన దేవుని పిల్లలను ఏకముగా సమకూర్చుటకును చావనైయున్నాడు". గొఱ్ఱెలను సమకూర్చుటకు ఆయన మరణించెను. తన సోత్తయిన వారు తన సర్వమును పోగొట్టుకొనకుండ ఆయన వారి మీద రక్తము చిందించుట ద్వారా కనికరపడెను. దేవుడు ఆ కనికరము నీపై చూపులాగున ప్రార్థన చేయుము. మరియు ఆయన స్వరము నీవు విని, జీవించెదవు.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 47

# అంతిమ తీర్పునుండి మనలను విడిపించుటకు

*ఆలాగుననే క్రీస్తు కూడ అనేకుల పాపములను భరించుటకు ఒక్కసారే అర్పింపబడి, తన కొరకు కనిపెట్టుకొని యుండు వారి రక్షణ నిమిత్తము పాపములేకుండా రెండవసారి ప్రత్యక్షమగును.*

*హెబ్రీ. 9 :28*

**క్రై**స్తవ రక్షణ ఉద్దేశ్యము భూతః, వర్తమాన, భవిష్యత్ కాలాలకు వర్తిస్తుందని బైబిలు గ్రంధము చెబుతుంది, "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు" (ఎఫెసీ. 2:8). "రక్షింపబడుచున్న మనకు" దేవుని శక్తియైయున్నదని అది చెబుతుంది. (1 కొరింథీ. 1:18). మరియు "మనము విశ్వాసులమైనప్పటికంటె ఇప్పుడు, రక్షణ మనకు మరి సమీపముగా ఉన్నది" అని చెబుతుంది (రోమా. 13:11). మనము రక్షింపబడ్డాము. మనము రక్షింపబడుతున్నాము. మనము రక్షింపబడుదుము.

ప్రతీ దశలో క్రీస్తు మరణము ద్వారా రక్షింపబడియున్నాను. గతమునకు సంబంధించి, క్రీస్తులోనే మన పాపములు యొక్క మూల్యము ఒక్కసారే చెల్లించబడినది. మనము విశ్వాసము ద్వారా మాత్రమే నీతిమంతులుగా చేయబడుచున్నాము. వర్తమానమునకు సంబంధించి, పాపము యొక్క ఆదిపత్యము మరియు నేరారోపణ నుండి దేవుని పరిశుద్ధాత్మ శక్తిలో కొనసాగులాగున క్రీస్తు మన రక్షణను భద్రపరచుచున్నాడు. మరియు భవిష్యత్‌లో, సిలువలో ప్రోక్షింపబడిన క్రీస్తు రక్తము మనలను దేవుని ఉగ్రతనుండి కాపాడి, సంపూర్ణత మరియు సంతోషము లోనికి తీసుకువస్తుంది.

ఒక వాస్తవమైన తీర్పు అచ్చట రానుంది. బైబిలు గ్రంధము ఈ విధముగా వివరిస్తుంది. "న్యాయపు తీర్పునకు భయముతో ఎదురు చూచుటయు, విరోధులను దహింపబోవు తీక్షణమైన అగ్నియు నికను ఉండును" (హెబ్రీ 10:27). "భయభక్తులతో" జీవించుటకు ఇది మనలను పిలుస్తుంది, "ఏలయనగా మన దేవుడు దహించు అగ్నియైయున్నాడు" (హెబ్రీ 12:28–29). బాప్తిస్మమిచ్చు యోహాను తన కాలంలో ఉండే ప్రజలను ఈ విధముగా హెచ్చరించుచున్నాడు: ''రాబోవు ఉగ్రతను తప్పించుకొనుటకు" (మత్తయి 3:7). ఏలయనగా, "ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకము నుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగనివారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునప్పుడు మిమ్మును శ్రమపరచువారికి శ్రమయు, శ్రమపొందుచున్న మీకు మాతోకూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే" (2 థెస్సలోనిక. 1:7–9).

దేవుని యొక్క ఈ అంతిమ తీర్పును గూర్చిన దృశ్యములు ఆలోచించుకొనుటకు బహుభయంకరముగా ఉన్నవి. ప్రేమ అపోస్తులుడైన యోహాను, నరకమును గూర్చిన భయంకర దృశ్యములను మచ్చుకు తెలియజేయుట హస్యాస్పదము. క్రీస్తును విసర్జించి వారి భక్తిని ఇతరమైన వాటికి ఇచ్చువారు, "ఏమియు కలపబడకుండ దేవుని ఉగ్రత పాత్రలో పోయబడిన దేవుని కోపమను మద్యమును వాడు త్రాగును. పరిశుద్ధ దూతల యెదుటను గొఱ్ఱెపిల్ల యెదుటను అగ్ని గంధకముల చేత వాడు బాదింపబడును. వారి బాధసంబంధమైన పొగ యుగ యుగములు లేచును" (ప్రకటన. 14:10–11).

భయంకరమైన దేవుని భవిష్యత్ ఉగ్రతను కొంత అనుభవ పూర్వకముగా ఎరుగనంత వరకు, ఆది సంఘము క్రీస్తు భవిష్యత్ రక్షణ కార్యములో అనుభవించిన ఆనందమును మనము గ్రహించక పోదుమేమో: "దేవుడు మృతులలో నుండి లేపిన యేసు, అనగా రాబోవు ఉగ్రతనుండి మనలను తప్పించుచున్న ఆయన కుమారుడైన యేసు, పరలోకము నుండి వచ్చునని యెదురు" చూచుచున్నాము (థెస్సలోనీక 1:10). యేసుక్రీస్తు, ఆయన మాత్రమే, రాబోవు ఉగ్రతనుండి రక్షించగలడు. ఆయన లేకుండా మనము తుడచివేయబడుదుము.

అయితే అంత్యమున ఆయన మనలను రక్షించినప్పుడు, అది ఆయన రక్తము మీద ఆధారపడి ఉంది. "అలాగుననే క్రీస్తు కూడ అనేకుల పాపములను భరించుటకు ఒక్కసారే అర్పింపబడి, తన కొరకు కనిపెట్టుకొని యుండువారి రక్షణ నిమిత్తము పాపము లేకుండ రెండవసారి ప్రత్యక్షమగును" (హెబ్రీ 9:28). పాపము ఒక్కసారే వ్యవహరించబడినది. క్రొత్తగా బలిఅర్పణ అవసరం లేదు. మన స్థానములో క్రీస్తు పొందిన శ్రమలు ఎంత నిశ్చయమో, రాబోవు ఉగ్రత నుండి రక్షణ అంతే నిశ్చయము. సిలువ నిమిత్తము, భవిష్యత్ కృపలో విజయము పొందుట కొరకే ఇది ఉంది.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 48

# తన యొక్క ఆనందము పొందుటకు మరియు మనలను ఆనందింపజేయుటకు

*ఆయన తన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి, సిలువను సహించి, దేవుని సింహాసనము యొక్క కుడి పార్శ్వమున ఆసీనుడైయున్నాడు.*

*హెబ్రీ. 12:2*

**ఆ**నందమునకు నడిపించుమార్గము ఒక కఠినమైన రహదారి. ఇది మనకు కఠినమైనది, మరియు ఇది యేసునకు కూడా కఠినమైయుండెను. ఆయన జీవితమంతా ఇందుకొరకు అర్పించబడినది. మన జీవితాలు కూడ అర్పించబడవలసి ఉంటుంది. “తన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై సిలువను సహించెను”. మొదట సిలువ వేదన, తరువాతే పరలోకపు అతిశయము. అక్కడ మరియొక మార్గములేదు.

ఆయన యెదుట ఉంచబడిన ఆనందము అనేక అంతస్తులను కలిగిఉంది. అది తన తండ్రితో తిరిగి ఐక్యత చెందుటవలన కలుగనది: “నీ సన్నిధిని సంపూర్ణ సంతోషము కలదు నీకుడిచేతిలో నిత్యము సుఖములు కలవు” (కీర్తన 16:11). అది పాపమును అధిగమించుట వలన కలిగిన ఆనందము: “పాపముల విషయములో శుద్ధీకరణము తానే చేసి... ఉన్నత లోకమందు మహామహుడగు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండెను” (హెబ్రీ 1:3). ఇది దైవికమైన హక్కులు తీసుకురాబడుట వలన కలిగిన ఆనందమైయున్నది; “(ఆయన) దేవుని సింహాసనము యొక్క కుడిపార్శ్వమున ఆసీనుడైయున్నాడు” (హెబ్రీ 12:2). ఇది– ఎవరికోసమైతే మరణించాడో ఆ ప్రజలందరూ ఆయనను స్తుతిస్తూ ఉండుటవలన కలిగిన ఆనందమై యున్నది : “మారుమనస్సుపొందు ఒక్క పాపి విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగును”– అనేకమంది కొరకు చెప్పబడలేదు (లూకా. 15:7).

ఇప్పుడు మన సంగతి ఏమిటి? ఆయన ఆనందములోకి వెళ్లి మనలను కష్టములో విడచిపెట్టడా ? లేదు. ఆయన మరణించటానికి ముందుగా, ఆయన పొందిన ఆనందానికి మనము పొందబోయే ఆనందమునకు సంధానము చేసాడు. ఆయన చెప్పెను, “మీ యందు నా సంతోషము ఉండవలెననియు, మీ సంతోషము పరిపూర్ణము కావలెననియు, ఈ సంగతులు మీతో చెప్పుచున్నాను” (యోహాను. 15:11). ఆయన సంతోషమేమిటో తాను ఎరుగును మరియు ఆయన ఇట్లు చెప్పెను “మీ యందు నా సంతోషము



ఉన్నది”. ఆయనలో విశ్వాసముంచిన మనము ఒక పరిమితమైన జీవరాశులు సంతోషించునంతగా యేసుతో ఆనదించెదము. అయితే ఈ రహదారి కఠినమైనది. యేసు మనలను ఇట్లు హెచ్చరించెను, “లోకములో మీకు శ్రమ కలుగును” (యోహాను. 16:33). “శిష్యుడు భోధకునికంటె అధికుడు కాడు... ఇంటి యజమానునికి బయెల్జెబూలని వారు పేరుపెట్టి యుండిన యెడల ఆయన యింటివారికి మరి నిశ్చయముగా ఆ పేరు పెట్టుదురు గదా” (మత్తయి. 10:24–25). “వారు మీలో కొందరిని చంపింతురు; నానామము నిమిత్తము మీరు మనుష్యులందరిచేత ద్వేషింపబడుదురు” (లూకా. 21:16–17). అదే మార్గములో యేసు నడచెను మరియు ఆనందమునకు రహదారి అదే ఆయన సంతోషము మనలో విజయోత్సహము చేయుచున్నది, మరియు మన సంతోషము పరిపూర్ణమగుచున్నది.

అదే ప్రకారము ఆనందము కొరకైన నిరీక్షణ క్రీస్తును సిలువ భరించునట్లు చేసినది, మరియు సంతోషము కొరకైన మన నిరీక్షణ ఆయనతో పాటు శ్రమపడుటకు శక్తిని కలుగజేయుచున్నది. యేసు దీనికొరకే మనలను ఆయత్తపరిచినట్లు ఈ మాటలు ద్వారా గ్రహించవచ్చు; “నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీమీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును,” (మత్తయి. 5:11–12). దేవుని కుమారుడు తన తండ్రి యందు ఆనందించునట్లే మనము దేవుని యందు ఆనందించుటయే మనకు ప్రతిఫలము.

ఒక వేళ యేసు ఇష్టపూర్వకముగా మరణించకపోతే, ఆయన గానీ, మనము గానీ ఎన్నటికీ ఆనందముగా ఉండలేము. ఆయన అవిధేయత చూపించి ఉంటే, మనము మన పాపములలో నశించి పోయెడివారము. ఆయన ఆనందము మరియు మనది సిలువయందు సంపాదించబడినది. ఇప్పుడు ప్రేమ మార్గములో ఆయనను వెంబడించుదము. “మన యెడల ప్రత్యక్షము కాబోవు మహిమ యెదుట ఇప్పటికాలపు శ్రమలు ఎన్న తగినవి కావని” మనము లెక్కించుకోవాలి. (రోమా. 8:18). ఇప్పుడు ఆయనతో పాటు నిందను అనుభవిస్తున్నాము. అయితే తరువాత మనకు తరగని ఆనందము ఉంది. ప్రేమచేత ఎటువంటి త్యాగాన్ని అయినా మనము భరించెదము. మన సొంత బలము ద్వారా కాదు, గానీ నీరీక్షణ యొక్క బలములోనే ఇది జరుగును; “సాయంకాలమున ఏడ్పువచ్చి, రాత్రి యుండినను ఉదయమున సంతోషము కలుగును” (కీర్తన. 30:5).

యేసు మరణించుటకు హేతువేమనగా :

# 49 మహిమ, ప్రభావములతో ఆయన కిరీటము ధరించునట్లు

✝

*యేసు మరణము పొందినందున, మహిమాప్రభావములతో కిరీటము ధరించిన వానిగా ఆయనను చూచుచున్నాము.*
*హెబ్రీ. 2:9*

*ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్నుతాను తగ్గించుకొనెను.... దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను.*
*ఫిలిప్పీ. 2:7-9.*

*వధింపబడిన గొఱ్ఱెపిల్ల, శక్తియు ఐశ్వర్యమును జ్ఞానమును బలమును ఘనతయు మహిమయు స్తోత్రమును పొందనర్హుడని గొప్ప స్వరముతో చెప్పుచుండిరి.*
*ప్రకటన. 5:12.*

**ఆ**యన మరణించుటకు ముందురోజు రాత్రి, ఏమి జరగనుందో ఎరిగినవాడై, యేసు ఈ విధముగా ప్రార్థించెను : " తండ్రీ, లోకము పుట్టకమునుపు నీ యొద్ద నాకు ఏ మహిమయుండెనో ఆ మహిమతో నన్ను ఇప్పుడు నీ యొద్ద మహిమపరచుము" (యోహాను. 17:5). మరియు అది ఇప్పుడు నెరవేర్చబడినది; "యేసు మరణము పొందినందున, మహిమా ప్రభావములతో కిరీటము ధరించిన వానిగా ఆయనను చూచుచున్నాము" (హెబ్రీ. 2:9). ఆయన పొందిన శ్రమకు ప్రతిఫలమే ఆయన మహిమ. "ఆయన మరణము పొందునంతగా విధేయత చూపినవాడై (నందున)... దేవుడాయనను అధికముగా హెచ్చించెను" (ఫిలిప్పీ. 2:7-9). ఎందుకంటే ఆయన వధింపబడెను, "గొఱ్ఱెపిల్ల.... ఘనతయు మహిమయు స్తోత్రమును పొంద నర్హుడని... చెప్పుచుండిరి" (ప్రకటన. 5:12). కేవలం కిరీటము పొందుకొనుటకు యేసుక్రీస్తు శ్రమలు పొందలేదు గానీ, అది చెల్లించవలసిన మూల్యమై యున్నది మరియు కిరీటము దానికి ఇవ్వబడిన బహుమానమైయున్నది. దానిని కలిగియుండుటకు ఆయన మరణించెను.

ఇచ్చుటనే అనేకమంది తడబడుచుందురు. ''దీనిని మనము ఎట్లు ప్రేమించగలము? ఆయన తన మహిమను పొందుకోవడానికి ఉద్దేశిస్తే, మనకు



సంతోషింపజేయుటకు యేసు ఏ విధంగా ఉపక్రమిస్తారు ? అన్నిటిని వ్యర్థముగా ఎంచుకొనుట ఎప్పుడు ఒక సద్గుణమౌతుంది? "అని వారు అడుగుదురు. అవి మంచి ప్రశ్నలు, మరియు వాటకి బైబిలానుసారమైన మంచి జవాబులు ఉన్నాయి.

గొప్ప ప్రేమంటే వాస్తవముగా ఏమిటో నేర్చుకొనుటలో దానికి జవాబు ఉంది. మనలో చాలామందిమి ఎదిగిన ఆలోచనలు కలిగి, ప్రేమించబడుట అంటే ఎక్కువగా చేయబడుట అని ఉద్దేశిస్తాము. మన యొక్క ప్రపంచమంతా ఈ ఊహలతోనే నిర్మితమౌతుంది. నేను నిన్ను ప్రేమిస్తే, నేను నిన్ను ఎక్కువ చేస్తాను. నిన్ను గూర్చి నీవు మంచిగా భావించుకొనులాగున నీకు సహాయము చేస్తాను. స్వయమును చూచుకొనటయే ఆనందమునకు రహస్యములా ఉంటుంది.

అయితే మనము బాగుగా ఎరుగుదుము. మనము బైబిలు యొద్దకు రావటానికి ముందే అది ఆవిధముగా లేదని మనము ఎరుగుదుము. స్వయం-నింపబడిన క్షణాలు కాదు గానీ, స్వయం-నుమరచిన క్షణాలే సంతోషకరమైన క్షణాలుగా ఉన్నాయి. గ్రాండ్ కెనియోన్ ప్రక్కనే లేదా కలిమంజారో కొండపాదము వద్ద నిలచియుండు అనుభూతి లేదా సహారా ఎడారిలో ఆశ్చర్యము కలిగించే సుర్యాస్తమయ దృశ్యము చూచినప్పుడు అద్భుతమైన ఆనంద క్షణాలు అనుభవిస్తుంటాము. ఈ విధముగా మనము చేయబడ్డాము. పరదైసు అద్దములు కలిగిన ఒక పెద్ద గది కాదు. అది మహిమ కనబరచబడు స్థలమైయున్నది. మరియు (ఆ మహిమ) మనది కాదు.

ఇది సత్యమైతే, విశ్వములో క్రీస్తే వాస్తవమైన మహిమయై ఉంటే, మనపట్ల ఆయన ప్రేమ ఏమైయున్నది? నిశ్చయముగా మనలను ఎక్కువ చేయుట కాదు. అది మన ప్రాణములకు తృప్తి నివ్వకపోవచ్చు. మరి గొప్పదైన దానికి మనము చేయబడ్డాము. మనము సంతోషముగా ఉంటే, యేసుక్రీస్తునే అన్నిటికి మహిమగల వ్యక్తిగా అనుభవ పూర్వకముగా ఎదుగుదుము. దానర్థమేమంటే, మనలను ప్రేమించుటకు యేసు తన పూర్తి మహిమను పొందుకొని మన యొక్క సంతోషమునకై దానిని ఇచ్చుట. అందుకే ఆయన మరణించిన ముందు రోజు రాత్రి ఈ విధముగా ప్రార్థన చేసెను, "తండ్రీ, నేనెక్కడ ఉందునో అక్కడ నీవు నాకు అనుగ్రహించిన వారును నాతో కూడ ఉండవలెననియు, నీవు నాకు అనుగ్రహించిన నా మహిమను వారు చూడవలెననియు కోరుచున్నాను" (యోహాను. 17:24). అదే ప్రేమ. "నా మహిమను వారికి చూపించెదను". యేసు తన పూర్ణమహిమ కోసము మరణించినప్పుడు. "ఆయన మన ఆనందము కొరకు మరణించెను. పనిచేయటయే ప్రేమ - మూల్యమేదైనప్పటికీ - యేసుక్రీస్తు నందు ఇతరులు సంతృప్తి పొందులాగున సహాయము చేయాలి. ఆ విధముగా యేసు ప్రేమించెను.

*యేసు మరణించుటకు హేతువేమనగా :*

# 50

## మిక్కిలి చెడ్డదైన కీడును దేవుడు మేలుకై మార్చెనని చూపుటకు

*ఏవి జరుగవలెనని నీ హస్తమును నీ సంకల్పమును ముందు నిర్ణయించెనో, వాటి నన్నిటిని చేయుటకై నీవు అభిషేకించిన నీ పరిశుద్ధ సేవకుడైన యేసునకు విరోధముగా హేరోదును పొంతి పిలాతును అన్యజనులతోను ఇశ్రాయేలు ప్రజలతోను ఈ పట్టణమందు నిజముగా కూడుకొనిరి*

*అపో.కా. 4:27-28*

**శ్ర**మ మరియు కీడును గూర్చి మనము చెప్పగలిగిన అతి ప్రాముఖ్యమైన విషయమేమంటే, యేసు క్రీస్తునందు, దేవుడు దానిలోనికి ప్రవేశించి దానిని (కీడును) మేలుగా మార్చెను. ఈ కీడు యొక్క ఆరంభము రహస్యముగా ఉంచబడినది. దానిని గూర్చి తెలుసుకొనుటకు బైబిలు గ్రంథము మనలను పురికొల్పుట లేదు. బదులుగా అది చెప్పెదేమనగా, ''రహస్యములు మన దేవుడైన యెహోవాకు చెందును'' (ద్వితి.కా. 29-29).

కీడు (లేదా దుష్టత్వము) ఎక్కడనుండి వచ్చినదో వివరించుట కాదుగానీ, దేవుడు దానిలోనికి ప్రవేశించి దానిని విరుద్ధమైన దానిగా అనగా-నిత్యము నిలచు నీతిగా, ఆనందముగా ఎట్లు మార్చెనో-తెలుపుట బైబిలు ముఖ్య ఉద్దేశ్యమైయున్నది. ఇటువంటి సందర్భాలు లేఖన భాగమంతటిలో మెస్సియాను గూర్చి ఉన్నాయి. యాకోబు కుమారుడైన యేసేపు ఐగుప్త దేశానికి బానిసగా అమ్మబడ్డాడు. దబ్బది సంవత్సరముల వరకూ ఆయన మరుగుపడినట్లు కనబడుచున్నాడు. కానీ, దేవుడు దానిలో ఉండి, ఆయనను ఐగుప్తునకు ప్రధానాధికారిగా చేసెను, అందువలన గొప్ప కరవు వచ్చినప్పుడు తనను అమ్మివేసిన వారినే రక్షించగలిగెను. ఈ వృత్తాంతమంతయు యేసేపు తన సహోదరులకు చెప్పిన ఒక్కమాటలో గుప్తమై ఉంది: "మీరునాకు కీడుచేయ నుద్దేశించితిరి గాని నేటి దినమున జరుగుచున్నట్లు, అనగా బహు ప్రజలను బ్రదికించునట్లుగా అది మేలుకే దేవుడు ఉద్దేశించెను" (ఆది. కా. 50:20).యేసుక్రీస్తుకు ఛాయగా ఉన్న ఆయన, అనేకులను రక్షించుటకై విడచిపెట్టబడిన వాడాయెను.

అదే ప్రకారము క్రీస్తు యొక్క వంశావళిని చూడండి. ఒకప్పుడు ఇశ్రాయేలు వారికి దేవుడే రాజుగా ఉండెడివాడు. గానీ ప్రజలు తిరుగుబాటుచేసి ఒక మానవరాజును



కొరుకున్నారు; "అలాగునకాదు... మాకు రాజు కావలెను" (1 సమూయేలు. 8:19), తరువాత వారు పశ్చాత్తాప పడ్డారు, "రాజును నియమించుమని మేము అడుగుటచేత మా పాపములన్నిటిని మించిన కీడు మేము చేసితిమి" (1 సమూయేలు. 12:19). అయితే దేవుడు దానిలో ఉన్నాడు. ఈ ఇద్దరు రాజుల వంశముల నుండి ఆయన క్రీస్తును లోకములోనికి తెచ్చెను. పాపము లేని రక్షకుడు, పాపులను రక్షించుటకు పాపముతో నిండిన ఈ భూమి మీద తన ఆరంభము కలిగియున్నాడు.

అయితే మిక్కిలి ఆశ్చర్యకరమైన విషయమేమంటే, శ్రమను, కీడును జయించుటకు క్రీస్తుకు అప్పగింపబడిన మార్గమేదనగా శ్రమ మరియు కీడు. యేసునకు వ్యతిరేఖముగా చేయబడి ప్రతీ ద్రోహము మరియు క్రూరమైన కార్యములన్నీ పాపమైనవి మరియు దుష్టమైనవి. అయితే దేవుడు అక్కడ ఉన్నాడు. బైబిలు గ్రంధము చెబుతుంది, "దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యద్ జ్ఞానమును అనుసరించి" యేసు అప్పగింపబడెను (అపో.కా. 2:23). తన వీపు మీద కొరడా, తలమీద ముండ్ల కిరీటము, చెంపలమీద ఉమ్మివేయుట, ముఖము మీద దెబ్బలు, చేతులకు సీలలు, పక్కలో బల్లెపుపోటు, అధికారుల తిరస్కారము, తన స్నేహితులు తనను శత్రువులకు అప్పగించుట, విడచివెళ్లిన శిష్యులు-ఇవన్నియు పాపము యొక్క పర్యవసానమే, మరియు పాపము యొక్క శక్తిని నాశనము చేయుటకు ఇవన్నీ దేవునిచే ఏర్పరచబడినవే. "ఏవి జరుగవలెనని నీ హస్తమును నీ సంకల్పమును ముందు నిర్ణయించెనో, వాటినన్నిటిని చేయుటకై..... హేరొదును పొంతి పిలాతును అన్యజనులతోను ఇశ్రాయేలు ప్రజలతోను ఈ పట్టణమందు నిజముగా కూడుకొనిరి" (అపో. కా. 4:27-28).

దేవుని కుమారుని అసహ్యించుకొని, చంపుటకంటే గొప్ప పాపమేదియు లేదు. క్రీస్తు శ్రమకు మించిన శ్రమ, మరియు ఆయన నిర్దోషత్వమునకు మించిన నిర్దోషత్వము లేదు. అయినప్పటికీ దేవుడు వాటన్నిటిలో ఉన్నాడు. "అతని నలుగగొట్టుటకు యెహోవాకు ఇష్టమాయెను ఆయన అతనికి వ్యాది కలుగజేసెను" (యెషయా. 53:10). శ్రమ మరియు కీడు పొందుట ద్వారా శ్రమను మరియు కీడును జయించుట ఆయన లక్ష్యము. "అతడు పొందిన దెబ్బల చేత మనకు స్వస్థత కలుగుచున్నది" (యెషయా. 53:5). అందుకే యేసు మరణించుటకు వచ్చెను. నిత్యమైన నీతిగా, ఆనందముగా దేవుడు మార్చలేని పాపముగానీ, కీడుగానీ లేదని చూపించుట దేవుని ఉద్దేశ్యమైయున్నది. మనము కలుగజేసిన ఆ శ్రమలే మన రక్షణకు నిరీక్షణ అయ్యేను. "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము" (లూకా. 23:34).

# ఒక ప్రార్థన

పరలోకమందున్న తండ్రీ, ప్రతి చదువరి ఈ పుస్తకములో ఎదైతే సత్యమో దానిని గ్రహించుటకును, అసత్యమైనదేదైనా ఉంటే దానిని విసర్జించుటకును సహాయము చేయుమని యేసు నామములో అడుగుచున్నాను. క్రీస్తు పట్ల ఏ ఒక్కరు తడబడకుండ ఉంచుమని ప్రార్థన చేయుచున్నాను. ఆయన యొక్క దైవత్వమును లేదా అసమానమైన తన శ్రమను ఎవ్వరూ హానికరమైనదిగా తీసుకొనకుందురుగాక. ఆయన మరణమునకు హేతువులను ఎవ్వరు తిరస్కరించకుందురుగాక. వీటిలో అనేక విషయములు క్రొత్తవి, వాటిని జాగ్రత్తగా వారు పరిగణించుదురు గాక. మరియు అవగాహన, వెలిగింపును మీరు అనుగ్రహించండి.

నిత్యత్వమునకు సంబంధించిన విషయాలలో భేదములు తొలగించబడి, పరలోకము మరియు నరకము గూర్చి స్పష్టముగా ఎరుగునట్లు చేయుమని ప్రార్థన చేయుచున్నాను. చరిత్రలో యేసు కేంద్రముగా ఉండి, ఆయన మరణము ఏ విషయము కంటెను అతి ప్రాముఖ్యమైనదిగా ఉన్నదని గ్రహించునట్లు చేయుమని ప్రార్థన చేయుచున్నాను. స్పటికమంత స్పష్టముగా సత్యమనే గాలి వీచుచుండగా, నిత్యత్వపు సత్యముతో కలసి నడచుటకు సామర్థ్యమును దయచేయండి.

మరియు యేసు యొక్క మరణములో గుప్తమైన శ్రేష్ఠమైన దైవిక ఉద్దేశ్యము నుండి మా యొక్క దృష్టి మరల్చబడకుండ ఉంచుమని ప్రార్థన చేయుచున్నాను. ప్రజలు మీ కుమారుని చంపారు అనే ప్రశ్న చేత మేము చిక్కులో పడకుండా కాపాడండి. మేమందరము దానిలో ఉన్నాము. అయితే అది ప్రాముఖ్యమైన సంగతి కాదు. మీ ఉద్దేశ్యము, మీ కార్యము ప్రాముఖ్యమైనవి. ఓ దేవా, కేవలమునీవే, మనుష్యుడు కాదు, యేసు మరణాన్ని యోచించారని గ్రహించునట్లు మా కండ్లు తెరువజేయండి.

ఎంత ఆశ్చర్యకరమైన సత్యమును మీరు బయలుపరచారు; “పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెను” (1 తిమోతి. 1:15). ఆయన బోధ ద్వారా కాదుగాని, ఆయన మరణము ద్వారా దీనిని నెరవేర్చెను. “లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి పొందెను” (1 కొరింథీ. 15:3). మా సొంత మనస్సాక్షి కోరినదానిని లెక్కించలేని, మాలాంటి వారికి ఇంతకంటే అద్భుతమైన వర్తమానము ఏదైనా ఉన్నదా? మీ సొంత పరిశుద్ధత కోరునదే మాలో అనుమతించండి.

కనికరము గల తండ్రీ ఈ పుస్తకమును చదువుతున్న ప్రతీవారు తమ యొక్క అవసరత ఎరిగి, యేసు మరణము యొక్క దర్శనము గ్రహించి, విశ్వాసముంచులాగున చేయండి. మీ కుమారుడు చేసిన వాగ్దానమును బట్టి నేను ఈ ప్రార్థన చేయుచున్నాను: "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను. 3:16). యేసు కనికరమైన నామములో ప్రార్థన చేయుచున్నాను. ఆమెన్.



# BOOKS ON THE HISTORICAL RELIABILITY OF THE BIBLE'S RECORD

*If you want to read some of the best scholarship of the life, death, and resurrection of Jesus, I would recommend the following books.*


Blomberg, Craig L. The Historical Reliability of the Gospels. Downers Grove, Ill.: Inter Varsity Press 1987.

Copan, Paul, ed. *Will the Real Jesus Please Stand Up? A Debate Between William Lane Craig and John Dominic Crossan.* Grand Rapids, Mich.: Baker, 1999.

Craig, William Lane ed. *Jesus' Resurrection: Fact or Figment? A Debate between William Lane Craig and Gerd Ludemann.* Downers Grove, Ill.: Inter Varsity Press, 2000.

Craig, William Lane .The Son Rises: *The Historical Evidence for the Resurrection of Jesus.*Eugune, Ore.: Wipf & Stock, 2001.

Habermas,Gary R.*The Historical Jesus:Ancient Evidence forthe Life of Christ. Joplin,* Mo.: College Press, 1996.

Wilkins, Micheal J. and J.P. Moreland, eds. *Jesus Under Fire: Modern Scholarship Reinvents the Historical Jesus.* Grand Rapids, Mich.: Zondervan, 1996.